
# జనబలం

ప్రజలే ప్రభువులు

ఆగస్టు 2024 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-









## OPS రహిత భారతదేశం

## చట్టసభలపై చర్చించాల్సిన సమయం

## ఎన్నికల్లో ప్రజలిచ్చిన సందేశం

## యూనియన్ బడ్జెట్ 2024-25



## సరైన విధానాలుంటే ఏపీ @ 9-10% అభివృద్ధి



యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లకి పూణెలోని ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీ, ఎంఐటీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ నిర్వహించిన
14వ జాతీయ స్థాయి అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్),
లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



















ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ఆగస్టు 2024

సంపుటి 25 సంచిక 08


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




## లోపలి పేజీలలో..


ప్రభుత్వోద్యోగుల పెన్షన్ల గురించి ప్రజలు ఎందుకు ఆలోచించాలి? 5

ఓపీఎస్ పార్టీలు, ఎన్నికల విషయం కాదు 8

ఆదాయాల్ని, దీర్ఘకాలిక అభివృద్ధిని పెంచే బడ్జెట్ 10

సవాళ్లున్నా సుస్థిరాభివృద్ధికి గొప్ప అవకాశం 14

"భోళా భాళా" భండారి అంకయ్య 21



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# పారా హుషార్!
# బడ్జెట్ల "కాలం"- ఆర్థిక సర్వే ఏం చెప్పింది?

క్రోధి నామ సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా నాలుగు పరిణామాలు సంభవిస్తున్నాయి. మొదటిది ప్రకృతి వైపరీత్యాలు, రెండవది దేశాల మధ్య భౌతిక యుద్ధాలు, మూడవది ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్న దేశాల సంఖ్య రోజురోజుకు పెరగడం, నాలుగోది చాలా దేశాల్లో రాజకీయ అస్థిరత. ఈ నాలుగు పరిణామాల నేపథ్యంలో మన దేశంలో ఆర్థిక సర్వే ఏం చెప్పిందంటే "చుట్టూ పక్కల చూడరా చిన్నవాడా, చుక్కల్లో చూపు చిక్కుకున్న వాడా" అనే రుద్రవీణ సినిమాలోని పాట గుర్తుకొస్తుంది.

పశ్చిమ ఆసియాలో జరుగుతున్న భౌతిక యుద్ధాలు, భయపెడుతున్న మూడో ప్రపంచ యుద్ధమేఘాలు ఒకవైపు, మరోవైపు దక్షిణాసియాలో భారత్ చుట్టుపక్కల ఉన్న దేశాలు రాజకీయ, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడం చూస్తే మధ్యనున్న భారత్ ఎనిమిది దిక్కుల అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది.

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక బడ్జెట్ ను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి సొంతంగా మ్యాజిక్ ఫిగర్ మెజారిటీ దాటకుండానే మిత్రపక్షాల సహకారంతో గట్టెక్కిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఈ దిశలో వివిధ రాష్ట్రాలు కూడా తాత్కాలిక బడ్జెట్లు ప్రవేశపెట్టి పార్లమెంటు ఎన్నికల తర్వాత 18వ లోక్ సభ కొలువు తీరాక ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ కు అనుగుణంగా తమ తమ రాష్ట్రాలలో పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టాయి. ఈ పరిణామ క్రమంలో మన భారతదేశ ఆర్థిక సర్వే ఏం చెప్పింది దాని వెలుగునీడలు ఏమిటి? ముంచుకొస్తున్న ప్రమాదం..పరిణామాలు ఏమిటి అనేది మనం ఆలోచించాలి.

**"దాల్ మే కుచ్ కాలా హై!**

మన భారతదేశ ఆర్థిక స్థితి అంతా బాగానే ఉందంటూనే ఆర్థిక సర్వే అందులోని లోతైన విషయాలను వెల్లడించింది. 2023-24 గత ఆర్థిక సంవత్సరంలో జిడిపి లో సాధించిన ఎనిమిదిన్నర శాతం అభివృద్ధి కాస్త 2024-25 అంచనాలకు ఆరున్నర, ఏడు శాతానికే పరిమితమైందంటే "దాల్ మే కుచ్ కాలా హై" అని ఆర్థిక సర్వే హెచ్చరించింది.

**ఊపర్ షేర్వానీ- అందర్ పరేషానీ!**

1947లో వందేళ్ళ స్వాతంత్రం తర్వాత "వికసిత భారత్" లక్ష్యంగా ముందుకు సాగే ఆర్థిక వ్యవస్థను రూపొందించి వచ్చే పదేళ్ల లోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మనం మూడో స్థానానికి చేరుకుంటామని బలంగా వాదన వినిపిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సర్వేలోని లోతైన అంశాలను పట్టించుకుంటే తప్ప మన లక్ష్యాన్ని చేరుకోలేమని స్పష్టం చేసింది. "ఊపర్ షేర్వానీ అందర్ పరేషానీ"లా మన ఆర్థిక వ్యవస్థ ఉండకూడదని తేల్చి చెప్పింది. మన ఆర్థిక వ్యవస్థ పైకి బాగానే కనిపిస్తున్నా లోపల ఏం జరుగుతుందో గమనించకపోతే అసలు లక్ష్యానికే విఘాతం కలుగుతుందని ఆర్థిక సర్వే హెచ్చరించింది.

"పూను స్పర్ధలు విద్యలందే! వైరములు వాణిజ్యమందే!"అన్న గురజాడ వారి సూక్తి గమనిస్తే ఇకముందు ప్రపంచంలో భౌతిక యుద్ధాల కంటే ఆర్థిక యుద్ధాలే జరుగుతాయన్నది వాస్తవం. అందులో భాగంగా "శత్రువు శత్రువు మిత్రుడన్నట్లు "యూరప్ అమెరికా మిత్ర దేశాలు ఆర్థికంగా ప్రపంచంలో రెండో శక్తిగా ఉన్న చైనాను బాయ్‌కాట్ చేస్తున్నాయి. ఈ అవకాశాన్ని మనం వినియోగించుకొని చైనా దేశం నుండి మనకు ఎదురవుతున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూనే చైనా నుండి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) మనదేశంలో ప్రోత్సహించాలని ఆర్థిక సర్వే సలహా ఇచ్చింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో సమూల మార్పులను ఆర్థిక సర్వే సూచించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ద్వారా కోల్పోయే ఉద్యోగాలకు సమానంగా ఇతర రంగాలలో ఉపాధి కల్పన ధ్యేయంగా ముందుకు సాగాలని చెప్పింది. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరిగి నానాటికి ఉపాధి అవకాశాలు సన్నగిల్లడంతో సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెరగాలంటే డబ్బు రూపంలో పెట్టుబడుల విలువ కంటే ఆయా సంస్థలలో ఉద్యోగ అవకాశాల గురించి ఆలోచించాలని ఆర్థిక సర్వే చెప్పింది.

భారతదేశ ఆర్థికంగా మరింత నిలదొక్కుకొని మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే సమస్యలను అధిగమిస్తూనే ముందుకు సాగే దిశగా ప్రభుత్వాలు చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లను మళ్లీ చేయకుండా ఉండాలని"పారాహుషార్ అంటూ హెచ్చరించింది. ఆర్థిక సర్వే సూచించిన సలహాలు సూచనలను "తూచా"తప్పకుండా మనం చేయాల్సిన పని "ఇక ఆచరణ మాత్రమే తరువాయి".

బండారు రామ్మోహనరావు

# ప్రభుత్వోద్యోగుల పెన్షన్ల గురించి ప్రజలు ఎందుకు ఆలోచించాలి?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



(ప్రభుత్వోద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న కాంట్రిబ్యూటరీ/ కొత్త పెన్షన్ విధానం (సీపీఎస్/ఎన్‌పీఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వాలు ఆమోదిస్తే దేశానికి ఆర్థికంగా ఎంత వినాశకర పరిస్థితులు తలెత్తుతాయో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్ ఎన్నికలకు ఎంతో ముందు నుంచీ తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో ప్రభుత్వాల్ని, రాజకీయ పార్టీల్ని, ప్రజల్ని అప్రమత్తం చేస్తూ వచ్చారు.

ఎంతో చరిత్ర కలిగి, దేశంలో ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం ఓపీఎస్‌కు హామీ ఇచ్చినా, క్రమంగా వాస్తవాల్ని అర్థం చేసుకుని ఇప్పుడు కొంత వెనక్కి తగ్గింది. జాతీయ స్థాయిలో ఓపీఎస్‌కు హామీ ఇవ్వలేదు. తొలినుంచీ ఓపీఎస్‌ను వ్యతిరేకిస్తూ ఎన్‌పీఎస్ అమలులో రాజీలేకుండా వ్యవహరిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం మూడోసారి ఎన్నికయ్యాక ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం రూపొందించే ప్రయత్నం చేస్తోంది. ఈ విషయాన్ని యూనియన్ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఉద్యోగులకు పెన్షన్ డబ్బు మరీ తక్కువ కాకుండా, కొంత కనీస మొత్తం వచ్చేట్లు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వటం, అందుకు డబ్బును ఇప్పుడే కేటాయించి బడ్జెట్‌లో ఏర్పాటు చేయటం జరుగుతుంది. దీనికి మనం అభ్యంతరం చెపాల్సిన అవసరం లేదు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, ఉద్యోగి, ప్రభుత్వం అందుకు ముందుగానే డబ్బులు పెట్టటం ఎట్టిపరిస్థితుల్లో కొనసాగాల్సిందే. జాతీయ స్థాయిలో చూపెడుతున్న మార్గాన్ని రాష్ట్రాలు కూడా అనుసరించాలి. భారతదేశం ఓపీఎస్ రహిత దేశంగా మారితేనే వందో స్వాతంత్ర్య దినోత్సవం నాటికి అభివృద్ధి చెందిన దేశం స్థాయిని అందుకోవటం సాధ్యం. ఈ **నేపథ్యంలో పాత పెన్షన్ విధానాన్ని నిర్మూలించి, ఉద్యోగులు, ప్రభుత్వం ఎప్పటి డబ్బులు అప్పుడు కంట్రిబ్యూట్ చేసే కొత్త పెన్షన్ (సీపీఎస్, ఎన్‌పీఎస్) ఎందుకు అవసరమో తెలియచేస్తూ జేపీ రాసిన వ్యాసాల్ని 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో అందిస్తున్నాం)**

మన దేశంలో చాలా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక ఆరోగ్యం సవ్యంగా లేదన్నది బహిరంగ రహస్యం. ఖజానాకి పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవటం ఎలా అన్నది మన ముందున్న తక్షణ సవాలు. ఈ ప్రశ్నకు సమాధానం దొరకాలంటే, వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలకు, ఈవేళ బడ్జెట్‌లో రూపాయి కేటాయించకుండా అమలు చేసే పాత పెన్షన్ విధానానికి (ఓపీఎస్) మధ్య తేడాని అర్థం చేసుకోవాలి. తాత్కాలిక పథకాలు, ఓపీఎస్ రెండూ మన పన్నుల డబ్బు మీద భారం వేస్తాయిగానీ, వాటి ప్రభావం, పరిష్కార పద్ధతులు భిన్నమైనవి.

తాత్కాలిక సంక్షేమ పథకాలు ఆకలిగొన్న వారికి, కష్టంలో ఉన్నవారికి తాత్కాలిక ఉపశమనం కలిగించేందుకు

ఉద్దేశించినవి. సంపాదించే శక్తిని, ఆదాయాల్ని ఈ పథకాలు పెంచలేవు. పేదరికం నుంచి ప్రజల్ని బయటపడేయలేవు. కానీ ఇప్పటికీ పెద్దసంఖ్యలో ప్రజలు పేదరికంలో బతుకుతున్న మన లాంటి దేశంలో అవి అవసరం. నైపుణ్యాలు, ఉత్పాదకతలను పెంచే, పెట్టుబడులను ప్రోత్సహించే, అభివృద్ధిని పెంపొందించే, ఉద్యోగాలను సృష్టించే, ఆదాయాల్ని పెంచే చర్యలు మాత్రమే పేదరికాన్ని తగ్గించగలవు, జీవితాల్ని, జీవనోపాధిని మెరుగుపరచగలవు. కాబట్టి ఆర్థిక ప్రగతి, ఉపాధి అవ కాశాల సృష్టి, ఆదాయాల్ని పెంచటం మాత్రమే మనం పట్టించుకోవాల్సిన, ప్రాధాన్యం ఇవ్వాల్సిన అంశాలు కావాలి.

అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాలు. ప్రగతి పెరిగితే ప్రభుత్వ ఆదాయాలు పెరుగుతాయి. ఖజానాలో కాసుల గలగలలు పెరిగితే ప్రభుత్వాలు తాత్కాలిక సంక్షేమ పథకాల మీద ఎక్కువ ఖర్చు చేయగలుగుతాయి. మరింత అభివృద్ధి కోసం దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టగలుగుతాయి. వేగంగా జరిగే ఆర్థిక వృద్ధి సమాజాన్ని పేదరికం నుంచి బయట పడేయ గలిగిన, అవకాశాల్ని పెంచ గలిగిన ప్రగతి వలయాన్ని సృష్టిస్తుంది.

అదేరీతిలో, తాత్కాలిక పథకాలు ఆర్థిక ప్రగతికి ఓపీఎస్ స్థాయి నష్టం కలిగించవు; ఈ పథకాల ద్వారా తాత్కాలిక ఉపశమనం అనేకమంది పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చేరుతుంది; పథకాల్ని భవిష్యత్తులో ప్రభుత్వాలు ఉప సంహరించుకోవచ్చు లేదా పునర్వ్య వస్థీకరించవచ్చు; కానీ వీటికయ్యే వ్యయాన్ని ఎప్పటికప్పుడు ప్రస్తుత బడ్జెట్‌లలోనే కేటాయిస్తారు. ప్రభుత్వ అప్పుల మీద వడ్డీ చెల్లింపు రూపంలో మినహా భవిష్యత్తు తరాల పన్ను చెల్లింపుదారుల మీద అన్యాయమైన భారం వేయవు.

కానీ, ప్రభుత్వోద్యోగులకు మాత్రమే అమలు చేసే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించటం వల్ల ప్రమాదం అనేకరెట్లు ఎక్కువ. ఓపీఎస్‌లో ఉద్యోగి, ప్రభుత్వం కూడా ఆ ఉద్యోగి సర్వీసు కాలంలో ఒక్క రూపాయి మదుపు చేయరు. కానీ రిటైరయ్యాక ఉదారంగా పెన్షన్ అందుతుంది. ఎంత ఉదారంగా అంటే, ఎప్పటికప్పుడు పే రివిజన్లు, కరవు భత్యాలకు అనుగుణంగా ఆ పెన్షన్ నిరంతరం భారీగా పెరుగుతూంటుంది. పదివేల జీతంతో రిటైరయిన ఉద్యోగులు ఈరోజు రు.80,000 నెల పెన్షన్లు అందుకుంటున్నవారున్నారు. ప్రభుత్వ సంస్థలలో రిటైరయిన ఒక సామాన్య ఉద్యోగి ఇప్పుడు నెలకి రు.1,00,000 పెన్షను అందు కుంటున్నారు. పెన్షన్‌కి ఇవాళ ఎటువంటి మదుపు చేయకపోవటం, ఏటా పెరుగుతుండటం వల్ల వచ్చే తరం మీద భరించలేని భారం పడుతుంది. 2005, 2022 మధ్య పెన్షన్ వ్యయం పదకొండు రెట్లు పెరిగింది! అంతకంటే పెద్ద ప్రమాదం – రాష్ట్రాల ఆదాయం కంటే వేగంగా పెన్షన్ భారం పెరుగు తుండటం. 1990–91లో పెన్షన్ వ్యయం రాష్ట్రాల సొంత వనరుల్లో 7.9%గా ఉంది; 2020–21లో అది 27.4%. రాష్ట్రాల మొత్తం ఆదాయాల్ని (యూనియన్ ప్రభుత్వం నుంచి బదిలీ అయ్యే నిధులతో కలిపి) తీసుకుంటే, పెన్షన్లు 1990–91 లోని 4.7% నుంచి 2020–21 లో 14.3%కి పెరిగాయి.

**ప్రభుత్వోద్యోగులకు మాత్రమే అమలు చేసే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించటం వల్ల ప్రమాదం అనేకరెట్లు ఎక్కువ. ఓపీఎస్‌లో ఉద్యోగి, ప్రభుత్వం కూడా ఆ ఉద్యోగి సర్వీసు కాలంలో ఒక్క రూపాయి మదుపు చేయరు. కానీ రిటైరయ్యాక ఉదారంగా పెన్షన్ అందుతుంది. ఎంత ఉదారంగా అంటే, ఎప్పటికప్పుడు పే రివిజన్లు, కరవు భత్యాలకు అనుగుణంగా ఆ పెన్షన్ నిరంతరం భారీగా పెరుగుతూంటుంది. పదివేల జీతంతో రిటైరయిన ఉద్యోగులు ఈరోజు రు.80,000 నెల పెన్షన్లు అందుకుంటున్నవారున్నారు.**

పాత పెన్షన్ విధానాన్ని కొన సాగించే రాష్ట్రాలు ఆర్థికంగా వినాశకర పరిణా మాలను ఎదుర్కో నున్నాయన్నది సు స్పష్టం. అందుకే 2004లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పద్ధతి, ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టారు. యూనియన్, అన్ని రాష్ట్రాలూ అమలు చేశాయి. పశ్చిమ బెంగాల్ మినహాయించి. ఎన్‌పీఎస్‌లో ఉద్యోగి, ప్రభుత్వం ప్రతి నెలా పెన్షన్ ఫండ్‌లో కొంతమొత్తం మదుపు చేస్తారు. రిస్కు కనిష్టంగా, ఆదాయం గరిష్టంగా పెరిగే రీతిలో వ్యాపార నైపుణ్యంతో ఆ నిధిని నిర్వహిస్తారు. ఇందులో ఉద్యోగులకు అనేక పెన్షన్ స్కీములు అందుబాటులో ఉన్నాయి. రిస్కు తీసుకోవటానికి సిద్ధపడటాన్ని బట్టి స్కీమును ఎంచుకోవచ్చు. అలా పోగుపడిన పెన్షన్ నిధి నుంచి రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ తీసుకుంటారు. అంతేతప్ప ప్రజల పన్నుల డబ్బు నుంచి పెన్షన్ తీసుకోరు. కాబట్టి, వచ్చే తరం మీద భారం ఉండదు, ప్రభుత్వం చేయాల్సిన పనులు సమర్థంగా చేయటానికి పన్నుల డబ్బు మిగులుతుంది.

కానీ ఇటీవల కొన్ని రాష్ట్రాలు ప్రభుత్వోద్యోగుల ఓట్లను ఆకర్షించేందుకు ఓపీఎస్‌కి హామీ ఇచ్చాయి. మన దేశంలో పనిచేసేవారిలో ప్రభుత్వోద్యోగులు కేవలం 3% మంది. గొంతులేని, అసంఘటితమైన మిగిలిన 97% కార్మికశక్తిలో

చాలామందికి ఈ విషయాలు అర్థం కావు, వారు రోజువారీ ఉపాధిలో తలమునకలై ఉంటారు కాబట్టి వాళ్లంటే పార్టీలకు పెద్ద భయం లేదు. కానీ సంఘటితమైన, తమ లాభాలు బాగా తెలిసిన, గొంతున్న ప్రభుత్వోద్యోగులంటే మాత్రం వణుకు. ప్రపంచవ్యాప్తంగా పెన్షన్లు చెల్లించటానికి ప్రభుత్వ ఆదాయాల్లో 15% వెచ్చిస్తారు. అన్ని రంగాలలో పనిచేసేవారికి అందరికీ, 100% మందికి పెన్షన్ వస్తుంది. వాళ్లు ప్రభుత్వంలో ఉన్నా, ప్రయివేటులో ఉన్నా లేదా స్వయంఉపాధి పొందుతున్నా. ఆయా దేశాల్లో సగటు పెన్షన్ తలసరి ఆదాయంలో 25% దాకా ఉంటుంది. ఆ పెన్షన్ డబ్బుకి వాళ్లు నెలనెలా కొంత మొత్తం ప్రభుత్వంతో పాటు జమ చేస్తారు. కానీ భారతదేశంలో, ప్రభుత్వ ఆదాయాల్లో




18% కేవలం 3 శాతం మంది ప్రభుత్వోద్యోగుల పెన్షన్ కోసమే ఖర్చు చేస్తున్నారు. వారి సగటు పెన్షన్ తలసరి ఆదాయంపైన 250-300% ఉంది! ఈ పెన్షన్ కోసం ఒక్క రూపాయి కూడా ముందుగా మదుపు చేయటం ఉండదు. ఈ పరిస్థితి ప్రమాదకరం, కొనసాగటం అసాధ్యం. అందుకే పెన్షన్లు లేని ప్రభుత్వేతర రంగాలకి చెందిన 97% మంది కార్మికులు మేలుకోవాలి.

పార్టీలు, ప్రభుత్వాలు ఒక సహేతుక ఏకాభిప్రాయానికి రావటంలో విఫలమైతే, లెక్కలేనితనంతో ఓపీఎస్‌కి తిరోగమిస్తే రాష్ట్ర భవిష్యత్తు కోలుకోలేనివిధంగా నాశనమవుతుందనటంలో సందేహం లేదు. కానీ ఆ నష్టాన్ని నియంత్రించటానికి, భవిష్యత్తును పరిరక్షించటానికి అప్పటికి కూడా కొన్ని మార్గాలు అందుబాటులో ఉన్నాయి. భారతదేశ ఆర్థిక స్థిరత్వానికి, అప్పులకు యూనియన్ ప్రభుత్వానిదే తుది బాధ్యత అని రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు. రాష్ట్రాలు అప్పులు తెచ్చుకుని తమ అవసరాలు, ప్రాధాన్యాలకనుగుణంగా ఖర్చు చేయవచ్చు గానీ, అవి ఎడాపెడా అప్పులు, అనుత్పాదక ప్రాధాన్యాలకు విచ్చల విడిగా పందేరాలు చేయకుండా రాజ్యాంగంలో ఏర్పాటు చేశారు. యూనియన్‌కి రాష్ట్రాలు బకాయిలుంటే, ఆ రాష్ట్రాలు ఎటువంటి రుణం తీసుకోవాలన్నా అనుమతించే అధికారం యూనియన్ ప్రభుత్వానిదని ఆర్టికల్ 293 స్పష్టం చేస్తోంది. అటువంటి ఆమోదాన్ని షరతులతో మంజూరు చేయవచ్చు. అసాధారణ పరిస్థితుల్లో, ఆర్థిక ఎమర్జెన్సీలో ఆర్టికల్ 360 ద్వారా చర్యలు తీసుకోవచ్చు. నిజానికి ఇప్పటికే జీతాలు, భత్యాలు చాలా రాష్ట్రాలలో ఆలస్యంగా అందుతున్నాయి. పాత పెన్షన్లు వస్తే ఆర్థిక ఎమర్జెన్సీ రావటం ఖాయం; జీతాలు తగ్గటం, పెన్షన్లు పోవటం అనివార్యం! నిజానికి కొత్త పెన్షన్ పద్ధతిలో డబ్బులు పెన్షన్ నిధిలో జమపడతాయి. వాటిని ప్రభుత్వ ఖజానాతో కలపరు. కాబట్టి పెన్షన్లు ఖచ్చితంగా అందుతాయి. ఒక రాష్ట్రంలో జీతాలు, అలవెన్సులను తగ్గించటానికి, పన్నులు, వ్యయా లతో కూడిన ద్రవ్య బిల్లుల్ని ఆమోదిం చటానికి యూనియన్‌కి అధికారాలున్నాయి. రాజ్యాంగ నిర్మాతలు అంత ముందుచూపు ప్రదర్శించారు.

కొన్ని రాష్ట్రాలు గుడ్డిగా, మొండిగా వినాశకర ఓపీఎస్‌ను కొనసాగిస్తే, మిగిలిన దేశ ఆర్థిక స్థిరత్వాన్ని, రుణ సామర్థ్యాన్ని పరిరక్షించేందుకు యూనియన్ ప్రభుత్వం ఆర్టికల్ 293 ద్వారా అధికారాలను వినియోగించాలి. రెవెన్యూ లోటు సున్నా అయ్యేలా రాష్ట్రాలు చర్యలు తీసుకోవటం తప్పనిసరి చేయాలి. అంటే, రోజువారీ ఖర్చులు ఆదాయం నుంచే చేయాలి తప్ప అప్పులు తెచ్చి కాదు. అప్పు చేసిన డబ్బు ఉత్పాదకత, వృద్ధిని పెంచేందుకు పెట్టుబడులుగా వినియోగించాలి. భవిష్యత్తులో చెల్లించే మొత్తం పెన్షన్‌లకి అవసరమైన పెన్షన్ నిధిని ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లలోనే సమకూర్చాలి. తరిగే డబ్బు విలువను పరిగణలోకి తీసుకుని రేపటి విలువకనుగుణంగా ఈవేళ ఆ కేటాయింపు చేయాలి. అంటే, రకరకాల రూపాల్లో వ్యాపార పెట్టుబడుల ద్వారా పెరిగే పెన్షన్ నిధిలో ప్రస్తుతం డిపాజిట్ చేసే డబ్బు భవిష్యత్తు పెన్షన్లకు సరిపోవాలి. దీనివల్ల ఖజానా తరిగిపోయి ఇతర ప్రజాప్రయోజనాలు, సేవలకు ప్రభుత్వ వ్యయం తగ్గుతుందనటంలో సందేహం లేదు.

తమ నిర్ణయాలు, ఎంపికల పర్యవసానాలను ప్రజలు, రాజకీయ నాయకులు ఒక్కసారి అర్థం చేసుకుంటే, మెరుగైన ప్రభుత్వ విధానం సాధ్యమవుతుంది. ఆర్థిక భారాన్ని దాచి పెట్టి భవిష్యత్తు తరాలపైకి నెట్టే వినాశకర విధాన నిర్ణయాలు దేశానికి పెను ప్రమాదం. ❐

# ఓపీఎస్ పార్టీలు, ఎన్నికల విషయం కాదు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



పక్షపాత రాజకీయాల్ని అలా ఉంచితే, మన ఎన్నికల రాజకీయాల్లో అత్యంత ప్రమాదకర పరిణామమొకటి ఇటీవల ఉన్నకొద్దీ పెరుగుతోంది. దీర్ఘకాలిక అభివృద్ధికి, వ్యక్తిగత, తాత్కాలిక సంక్షేమ చర్యలకు మధ్య యుద్ధంలా ఎన్నికలు తయారయ్యాయి. రాజకీయ పోటీ తీవ్రంగా ఉన్న మనలాంటి పేద దేశంలో ఇలాంటి పరిస్థితి వల్ల చాలా సందర్భాల్లో దీర్ఘకాలిక ప్రజాసంక్షేమం మూల్యం చెల్లిస్తుంది. తాత్కాలిక రాజకీయ లబ్ధి పైచేయి సాధిస్తుంది.

ఇలాంటి ఎన్నికల రాజకీయం నేపథ్యంలోనే కొన్ని రాష్ట్రాలు జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్)గా పిలువబడే పెన్షన్ విధానం నుంచి పాత పెన్షన్ విధానానికి (ఓపీఎస్) తిరోగమిస్తున్నాయి. ఎన్‌పీఎస్ ఆర్థికంగా భారం పడని పథకం. అవసరమైన నిధుల కేటాయింపు పక్కాగా ఉన్న పెన్షన్ పథకం. ఇందుకు విరుద్ధమైన ఓపీఎస్‌ను తిరిగి తీసుకురావటం ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాల ఆరోగ్యానికి ప్రమాద సంకేతం. భారతదేశ దీర్ఘకాల వృద్ధికి అది అతి పెద్ద, విస్పష్ట ప్రమాదం.


ప్రభుత్వోద్యోగులు ఈవేళ ఒక్క రూపాయి కూడా తమ వంతుగా ఇవ్వకుండా రిటైరయ్యాక భారీ ప్రయోజనాలను పొందే పాత పెన్షన్ విధానం స్థానంలో ఉద్యోగి, యజమాని కూడా తమ వాటాగా కొంత చెల్లించే ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టటం ద్వారా వాజపేయి ప్రభుత్వం గొప్ప ముందుచూపును ప్రదర్శించింది. కొత్తగా ప్రభుత్వోద్యోగాల్లో చేరిన వారందరికీ ఎన్‌పీఎస్‌ను అన్ని రాష్ట్రాలూ అమలుచేశాయి, ఒక్క పశ్చిమ బెంగాల్ మినహాయించి. ఓపీఎస్ అమలు ఆర్థికంగా అసాధ్యం. ఎందుకంటే, ఉద్యోగి సర్వీసులో ఉన్న కాలంలో ఎటువంటి వాటా చెల్లింపు ఉండదు. కానీ రిటైర్మెంట్ తర్వాత ఆ ఉద్యోగికి జీవితకాల పెన్షన్, చనిపోయాక ఆ కుటుంబానికిచ్చే పెన్షన్.. ఇలా మొత్తం ఇంతింతై వటుడింతై అన్నట్లు నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. ఆ భారమంతా తర్వాతి తరాల మీద పడుతుంది. ఇవాళ్టి సేవలకు వచ్చే తరం మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఓపీఎస్‌లో పెన్షన్లు ఇంత భారం ఎందుకంటే, అవి ఇండెక్స్ ఆధారంగా, పే కమిషన్ల సిఫార్సులతో పెరిగే జీతాలకనుగుణంగా పెరుగుతూంటాయి. అన్ని ప్రభుత్వాలూ ఉద్యోగుల జీతాల్ని, పెన్షన్ ప్రయోజనాల్ని గణనీయంగా పెంచాయి. ఉద్యోగి సర్వీసులో ఉండగా పెన్షన్ కోసం ఒక్క రూపాయి కూడా మదుపు చేయకపోవటం ఒక్క భారతదేశంలోనే కనిపిస్తుంది. ఏ పెద్ద ఆర్థిక వ్యవస్థలోనూ పాత పెన్షన్ పథకం లాంటి పద్ధతి లేదు.

ఖజానాపై పెన్షన్ భారం ఇప్పటికే అనేక రాష్ట్రాలలో పెరిగిపోతోంది. రాష్ట్రాలపై పెన్షన్ భారం 2013 ఆర్థిక సంవత్సరంలో రూ.1.45 ట్రిలియన్లుండగా, 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.4.07 ట్రిలియన్లకు పెరిగింది. పెన్షన్ వాటా జీడీపీలో 1.9% కాగా, అన్ని రాష్ట్రాల మొత్తం ఆదాయాల్లో 13.2%. రాష్ట్రాల సొంత పన్నుల ఆదాయంలో 29.7%. యూనియన్ నుంచి బదిలీ అయ్యే నిధులతో కలిపి రాష్ట్రాల మొత్తం ఆదాయాల్లో కేవలం జీతాలు, పెన్షన్లు, వడ్డీలకే 56% ఖర్చవుతోంది. ఇవన్నీ తప్పనిసరి వ్యయాలు. ఇవిపోగా, అసలు ప్రభుత్వం ఎందుకుందో ఆ పనులు చేయటానికి చాలా తక్కువ మిగులుతోంది. 2021 ఆర్థిక సంవత్సరంలోనైతే అన్ని రాష్ట్రాల మొత్తం తప్పనిసరి వ్యయం వాటి ఆదాయాల్లో 125% దాకా ఉంది. కొన్ని రాష్ట్రాల్లో యూనియన్ నుంచి బదిలీ అయ్యే వనరులతో కలిపి మొత్తం ఆదాయంలో ఈ అనివార్య వ్యయాల వాటా మరీ ఎక్కువగా ఉంది. ఉదాహరణకు పంజాబ్ 80%, కేరళ 73.9%, పశ్చిమ బెంగాల్ 73.7%, ఆంధ్రప్రదేశ్ 72.2%.

2004లో దేశంలోని దాదాపు మొత్తం రాజకీయ వ్యవస్థను ఒక తాటి మీదకు తెచ్చి వాజపేయి ప్రభుత్వం ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టటానికి నేపథ్యం ఇది. మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం ఈ ప్రక్రియను చురుగ్గా ముందుకు తీసుకెళ్లి అమల్లోకి తెచ్చింది. 2004కి ముందున్న ఉద్యోగులు కొనసాగుతుంటారు కాబట్టి జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లో కొన్నేళ్లపాటు ఓపీఎస్ భారం పెరుగుతూనే ఉంటుంది. కానీ ఆ తర్వాత చేరిన ఉద్యోగుల నుండి ఎన్‌పీఎస్ అమలు వల్ల ఒకట్రెండు దశాబ్దాల తర్వాత ఖజానాపై భారం ఉండదు. ఎన్‌పీఎస్‌లో ఉద్యోగి సర్వీసు కాలంలోనే ప్రభుత్వం నిధుల్ని కేటాయిస్తుంది, ఆ డబ్బుతో ఒక నిధి ఏర్పాటు చేస్తారు, ఆ పెన్షన్ నిధి నుండి భవిష్యత్తులో పింఛను తీసుకుంటారు. ఇది ఆర్థికంగా ఆరోగ్యకరమైన రీతిలో భవిష్యత్తును కాపాడుకోవటం. ముందు తరాలు అందించిన సేవలకు తర్వాతి తరం మూల్యం

చెల్లించకుండా నైతికంగా కూడా ఇది తప్పనిసరి. భారతదేశంలో ప్రతి కుటుంబం.. ఏ కులం, ఏ మతం, ఏ ప్రాంతమైనా ఈవేళ్టి తమ కోర్కెలను వచ్చే తరం కోసం త్యాగం చేస్తారు. పేద కుటుంబాలు కూడా పొదుపు చేసి తమ పిల్లల కోసం ఆస్తుల్ని నిర్మిస్తాయి. ప్రభుత్వాలు రోజువారీ ఖర్చుల కోసం భారీగా అప్పులు చేస్తూ ఈవేళ్టి ప్రభుత్వోద్యోగుల పెన్షన్లకు ఎటువంటి కేటాయింపులు లేకుండా నిరంతరం పెరిగే పెన్షన్ భారాన్ని భవిష్యత్ తరాల మీదకు నెడుతున్నాయి. ఇది భారతీయ సమాజ విలువలు, సంస్కృతికి విరుద్ధం.

కానీ గొంతున్న, బలమైన సంఘటిత శక్తి ఉన్న ప్రభుత్వోద్యోగుల ఒత్తిడికి ఇప్పుడు కొన్ని రాష్ట్రాలు లొంగిపోతున్నాయి. 2004 నుండి ఎన్‌పీఎస్ సవ్యంగా నడుస్తోంది. ఒక ఆరోగ్యకరమైన ఒరవడి ఏర్పడింది. ఆ పంథా నుంచి రాష్ట్రం తర్వాత రాష్ట్రం వెనక్కి మళ్లుతున్నాయి. ఆచరణసాధ్యం కాని ఓపీఎస్‌ను మొదట్నుంచి కొనసాగిస్తున్న పశ్చిమ బెంగాల్‌కి పంజాబ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ తోడయ్యాయి. ఇప్పటికే అమలు చేస్తు_న్నాయి లేదా అమలు చేస్తామని ప్రకటించాయి.




దురదృష్టవశాత్తూ ఓపీఎస్ కారణంగా దీర్ఘకాలంలో ఎంత పెనుభారం పడుతుందో తెలియచేసే గణాంకాలు ప్రభుత్వోద్యోగుల తాత్కాలిక ఓట్లను ఆకర్షించాలనే తాత్కాలిక రాజకీయ ఒత్తిడుల మధ్య ఎక్కువ చర్చకు రావటం లేదు. ప్రభుత్వం మౌలికంగా చేయాల్సిన పనులు, భవిష్యత్తు కోసం వెచ్చించాల్సిన పెట్టుబడి, అభివృద్ధి, ఆదాయాలు, ఉపాధి, పేదలకు అవకాశాలు ఇవన్నీ తాత్కాలిక ఎన్నికల ప్రయోజనాలకు మూల్యం చెల్లిస్తున్నాయి.

ప్రజల సొమ్మును సొంత సొమ్మన్నట్లు ప్రచారం చేసుకుంటూ ఇష్టారాజ్యం పందేరాలు చేస్తున్న ప్రభుత్వాలు ఓపీఎస్‌కి మొగ్గు చూపేందుకు అంతకంటే వికృతమైన ప్రోత్సాహకం కూడా ఉండవచ్చు. ఓపీఎస్ వైపు మళ్లే రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక వ్యవస్థను కుప్పకూలుస్తున్నా, భవిష్యత్తును దెబ్బతీస్తున్నా, పందేరం చేయటానికి తాత్కాలికంగా అదనపు వనరులు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అంతకుముందు ప్రభుత్వాలు, పన్ను చెల్లింపుదారులు 2004 తర్వాత ముందుచూపుతో వ్యవహరించి భవిష్యత్తుపై పెన్షన్ భారం లేకుండా ఎన్‌పీఎస్ పద్ధతిలో బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఈ మొత్తాన్ని ఎసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం) పెన్షన్ నిధిలో జమ చేస్తారు. ఈ నిధిలోని మొత్తం ఎన్‌పీఎస్ ఆస్తులు 2022 ఆర్థిక సంవత్సరంలో 27 శాతానికి పెరిగి రూ.7.36 లక్షల కోట్లకు చేరాయి. ఇప్పుడు 10 లక్షల కోట్లు దాటాయి. ఒక రాష్ట్రం ఓపీఎస్‌కి మళ్లి అప్పటి వరకు ప్రభుత్వం, ఉద్యోగులు తమ పెన్షన్ వాటాగా ఏయూఎంకి జమ చేసిన డబ్బు తిరిగి తీసుకుంటే, తాత్కాలికంగా ఒకసారి ఆర్భాటానికి బోలెడు డబ్బులు కనిపిస్తాయి. కానీ భావి తరాల మీద మాత్రం పెన్షన్ల భారం మాత్రం అనూహ్య స్థాయిలో పెరిగిపోతుంది. దీర్ఘకాలిక సుస్థిరాభివృద్ధి పట్ల మనకు నియంత్రణ, పట్టింపు లేకుంటే, తాత్కాలిక రాజకీయ, ఆర్థిక ప్రోత్సాహకాలన్నీ కలగలసి అభివృద్ధిని, వచ్చే తరాల ప్రగతిని పణంగా పెడతాయి. పందేరం రాజ్యమేలుతుంది.


ఓ అధ్యయనం ప్రకారం, ఆంధ్రప్రదేశ్ గనక ఓపీఎస్‌కి తిరిగి మళ్లితే, మొత్తం రాష్ట్ర ఆదాయాల్లో (యూనియన్ ప్రభుత్వం నుంచి బదిలీ అయ్యే నిధులు సహా) ప్రస్తుతమున్న 11% నుంచి 2050 నాటికి 28.6 శాతానికి, 2100 నాటికి 38.9%కి పెరుగుతుంది. ఆరోగ్యకరంగా ఉండాలంటే 5-7% మాత్రమే ఉండాలి. మొత్తం రాష్ట్ర ఆదాయం (జీఎస్‌డీపీ)లో అప్పుల వాటా ఇప్పుడున్న 38% నుండి 2030 నాటికి 53%కి పెరుగుతుంది. కేవలం ఓపీఎస్ కారణంగా. ఈ భారం 2050 నాటికి 107%, 2100 నాటికి 211% అవుతుంది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధన ప్రకారం జీఎస్‌డీపీ, అప్పుల నిష్పత్తి 20% మాత్రమే ఉండాలి. ద్రవ్యలోటు ప్రస్తుతం జీఎస్‌డీపీలో 3% ఉండగా, 2050 నాటికి 8.1% కి పెరుగుతుంది. అదేవిధంగా, రాష్ట్ర సొంత ఆదాయంలో (యూనియన్ ప్రభుత్వం నుంచి బదలాయింపులు కాకుండా) జీతాలు, పెన్షన్ల వాటా ప్రస్తుత 74.1% నుంచి 2030 నాటికి 97.7%కి, 2050 నాటికి 129.2%కి పెరుగుతుంది. ఓపీఎస్ వల్ల పెరిగే వ్యయభారం ఉన్నకొద్దీ విపరీతమవుతూ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చేస్తుంది. ఓపీఎస్‌కు తిరిగి వెళ్లాలనుకుంటున్న, ఇప్పటికే ఓపీఎస్‌కి మళ్లిన రాష్ట్రాల్లో శ్రీలంక తరహా సంక్షోభానికి దారితీస్తుంది.

ఇక ఉద్యోగులు ఒ.పి.యస్ వల్ల తమకేదో లాభం కలుగుతుందని ఆశపడుతున్నారు. ఇది అపోహ మాత్రమే. ప్రభుత్వాలు దివాళా తీస్తే జీతాలు, పెన్షన్లు - రెండూ అందవు. ఇప్పటికే చాలా రాష్ట్రాలలో జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారు. ప్రభుత్వాలు దివాళా తీస్తే జీతభత్యాలని తగ్గించే ప్రమాదముంది. అలాగే ఉద్యోగి మరణం తరవాత, ఫామిలీ పెన్షన్ అందుకునేవాళ్ళు లేనప్పుడు కుటుంబానికి వేరే ఆదాయం రాదు. అదే యన్.పి.యస్ అయితే రెండు లాభాలున్నాయి. 1. పెన్షన్ కోసం ఏర్పాటు చేసిన నిధిలో ప్రతి నెలా డబ్బు జమ అవుతుంది. ఆ డబ్బు మీద ప్రభుత్వానికి, చట్టసభకి ఏ అధికారమూ ఉండదు. ఆ డబ్బుని ఖర్చు పెట్టే అధికారం ప్రభుత్వానికి లేదు. కాబట్టి ఉద్యోగుల పెన్షన్ డబ్బు సురక్షితంగా ఉంటుంది. 2. ఉద్యోగి మరణించాక, ఆ ఉద్యోగి పేరుతో జమ అయిన మొత్తం, వృద్ధి చెందిన డబ్బుతో సహా, వారసులకి అందుతుంది.

సందేశం సుస్పష్టం. పాతన పెన్షన్‌కి తిరిగెళ్లటం భారతదేశంలో ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థని కుప్పకూలుస్తుంది. దేశాన్ని ఆర్థికంగా ఎదగనీయకుండా పేదరికంలోకి నెడుతుంది. ఇది పార్టీలు, ఎన్నికల యుద్ధాలకు సంబంధించిన విషయం కాదని ఆలోచనాపరులు గుర్తించాలి; అభివృద్ధి చెందుతున్న దేశంగా మన భవిష్యత్తు కోసం చేస్తున్న నిశ్చయాత్మక యుద్ధం. ❐

# ఆదాయాల్ని, దీర్ఘకాలిక అభివృద్ధిని పెంచే బడ్జెట్

***యూనియన్ బడ్జెట్ 2024-25పై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్ స్పందనలోని ముఖ్యాంశాలు:***




ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా విశిష్టమైనది. ఎందుకంటే, ఎన్నికలకు ముందు జనాకర్షక పథకాలు, ఆదాయం ఎక్కువ చూపెట్టటం, ఎక్కువ ఖర్చుకు ప్రతిపాదనలు తీసుకురావటం, ఎన్నికలైన తర్వాత ఆదాయం లేదని చేతులెత్తేయటం మామూలై పోయింది. చాలా గొప్ప విషయం ఏమిటంటే, 2024-25 సంవత్సరానికి ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో, ఆనాడు ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ కావచ్చు, ఈవేళ పూర్తిస్థాయి బడ్జెట్ కావచ్చు, చాలా ఆర్థిక క్రమశిక్షణతో కూడుకున్నది. రెవెన్యూని ఎక్కువగా అంచనా వేయకుండా, అబద్ధాలు లేకుండా క్రమశిక్షణ పాటించటం, ఆర్థిక ప్రగతికి బాటలు వేయటం - ఈ లక్షణాలు బడ్జెట్‌లో కనిపించాయి, తాత్కాలిక బడ్జెట్ నుంచి అవి కొనసాగాయి.

నిజానికి ప్రతిపాదించిన బడ్జెట్‌లో తాత్కాలిక బడ్జెట్‌లో కంటే ఆదాయం ఎక్కువ కనిపిస్తోంది. ఎందుకంటే, ఆర్‌బీఐ నుంచి అదనంగా డివిడెండ్లు వచ్చాయి. అలాగే కొన్ని ప్రభుత్వరంగ సంస్థల నుంచి. అదివరకు రూ. 30 లక్షల కోట్లు ఆదాయం ఉంటుందనుకుంటే, ఇప్పుడు 31 లక్షల 29 వేల కోట్లు. ఆదాయం పెరిగింది. దీన్లో దాదాపుగా 72,000 వేల కోట్లు అప్పుల భారం తగ్గించటం కోసం ఖర్చు పెట్టారు. అంటే, ద్రవ్యలోటు తగ్గించటం కోసం. అందుకే ఆనాడు 5.1 శాతం ద్రవ్యలోటు ఉంటుందనుకుంటే, అది జాతీయాదాయంలో 4.9 శాతం వాటాకి తగ్గించారు. అంటే, ఆర్థిక క్రమశిక్షణ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అందుకు ప్రధానంగా ప్రధానమంత్రిని, యూనియన్ మంత్రివర్గాన్ని, ఆర్థిక మంత్రిని మనం అభినందించాలి. ఎన్నికలకు ముందుగాని, ఎన్నికల తర్వాత గానీ జనాకర్షక పథకాలకు పాల్పడటం, తాత్కాలికంగా వ్యక్తిగత సంక్షేమానికి మాత్రమే ఎక్కువ ఖర్చు పెట్టి దీర్ఘకాలిక ప్రగతికి బాటలు వేయకుండా ఉండటం, పేదరికాన్ని తొలగించటం కాకుండా తాత్కాలిక తాయిలాలివ్వటం చాలా తేలిక. అలాకాకుండా దీర్ఘకాలిక ప్రగతికి బాటు వేయటమనేది రాజకీయంగా చాలా కష్టంతో కూడుకున్నపని. దాన్ని ఎన్నికలకు ముందు, తర్వాత కూడా ప్రదర్శిస్తున్న ప్రభుత్వాన్ని మనం మనసారా అభినందించాలి. రాష్ట్రాలు కొన్ని ఆ రకంగా చేస్తున్నాయి, మరికొన్ని దుబారా ఖర్చులు చేసి ఓట్లవేటలో మునిగిపోయి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. రాష్ట్రాలు దీన్నుంచి పాఠం నేర్చుకుంటే అది దేశం మొత్తానికీ మంచిది. ఎందుకంటే, ఈ దేశంలో ప్రజల భవిష్యత్తు చాలామేరకు రాష్ట్రాల మీద ఆధారపడి ఉంది. యూనియన్ ప్రభుత్వం కేవలం వనరులను సేకరించగలదు, వనరులు కేటాయించగలదు, ఒక మార్గం చూపెట్టగలదు. కానీ పరిపాలన మొత్తం, రాష్ట్రంలో ప్రజల భవిష్యత్తు అంతా కూడా అత్యధికంగా రాష్ట్రాలపై ఆధారపడి ఉంది. అంచేత, దీన్నంచి మనం కొన్ని విషయాలు నేర్చుకుని, ఏ రాష్ట్రాల్లో అయితే ఆర్థిక క్రమశిక్షణ లేకుండా ఉందో, అక్కడ దీర్ఘకాలంగా ఆర్థిక వ్యవస్థను ఒక గాటికి తేవటం కోసం గట్టి ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది.

తొమ్మిది ప్రాధమ్యాలు వారు ప్రకటించారు. చాలా సవివరంగా, ఊరికే పైపైన కాకుండా, కేవలం ఇంత డబ్బులు కేటాయించటం కాకుండా, సవివరంగా విధానాల్లోగానీ, కేటాయింపుల్లోగానీ పద్ధతులు

రూపొందించారు. కొన్ని అంశాలు చూస్తే, వ్యవసాయ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత పూర్తిగా, అవసరమైనది. జనాభాలో 45% వ్యవసాయం మీద ఆధారపడుతున్నారు, 65% గ్రామాల్లో ఉన్నారు ఇప్పటికి కూడా. కాబట్టి, వ్యవసాయంపై మనం ప్రత్యేకంగా దృష్టి సారించకుండా, ఆదాయం పెంచకుండా, అదనపు విలువ చేకూర్చకుండా ఈ దేశంలో పేదరికాన్ని తొలగించలేం.




రెండోది, ఉపాధి కల్పన, నైపుణ్యాల పెంపు. చాలా పెద్దఎత్తున ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నుంచి ప్రభుత్వాలు గానీ, రాజకీయ వ్యవస్థ గానీ కొన్ని విషయాల్ని నేర్చుకున్నాయి. పెరుగుతున్న జనాభా, యువత, పనిచేసే జనాభా ఎక్కువ ఉన్న దేశం మనది. కానీ వాస్తవానికి నైపుణ్యం లేకుండా ఉపాధి లేక కోట్ల మంది గందరగోళ పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో, ప్రభుత్వంలో ఉద్యోగాల కోసం లక్షల మంది పోటీపడుతున్నారు. మార్కెట్‌లో ఉద్యోగాలు లేక కాదు. ప్రభుత్వంలో 3–4 రెట్లు ఎక్కువ ఆదాయాలు, జీతాలు ఎక్కువ ఇవ్వటం మార్కెట్ కంటే, జీవితకాలం భద్రత ఇవ్వటం, పని చేయకపోయినా కూడా జీతాలిచ్చి ఉద్యోగాల్లో ఉంచుకోవటం, కొన్ని ఉద్యోగాల్లో ఆమ్యామ్యాలు ఉండటం, అదనపు సంపాదన ఉండటం, రిటైరైన తర్వాత పెద్దఎత్తున పెన్షన్ ఇవ్వటం – ఇవన్నీ ఆకర్షణగా కనిపిస్తున్నాయి తప్ప, నిరుద్యోగానికి ప్రభుత్వోద్యోగాలు పరిష్కారం కాదు. నిజమైన ఉపాధి ప్రయివేటు రంగంలో జరుగుతుంది. ఉత్పత్తి జరిగేది ప్రయివేటు రంగంలో కాబట్టి. నూటికి 3 ఉద్యోగాలే ప్రభుత్వంలో ఉంటాయి. 97 ప్రయివేటు రంగంలో ఉంటాయి. ఈ 97 ఉద్యోగాలను పెంచటం కోసం చాలా విశేషమైన ప్రయత్నం ఈ బడ్జెట్‌లో కనిపించింది. ఉపాధి కల్పన కోసం, నైపుణ్యాన్ని పెంచటం కోసం. ఉపాధిని కల్పిస్తూ పరిశ్రమలు వచ్చినట్లయితే, వారికి రాయితీలివ్వటం కోసం, ఉద్యోగులకు రాయితీలివ్వటం కోసం, ఉద్యోగులకు శిక్షణను ఇవ్వటం కోసం రకరకాల పథకాలు – ఇంటర్న్‌షిప్స్‌గానీ, లేకపోతే ట్రైనింగ్‌గానీ, ఉద్యోగాల్లో చేర్చుకునేందుకు, ఉపాధి కల్పనకు సంబంధించి ప్రోత్సాహకాలుగానీ చాలా పెద్దఎత్తున కల్పించారు. వాటిని మనస్ఫూర్తిగా మనం ఆహ్వానించాలి. మరిన్ని పద్ధతులను ప్రవేశపెట్టి, ఉపాధి కల్పనే దేశ భవిష్యత్తుకి మొట్టమొదటి లక్ష్యంగా పెట్టుకోవాలి.

మూడోది, తయారీరంగం. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో మాన్యుఫ్యాక్చరింగ్ పెంచటం కోసం, ఇతోధికంగా ఎన్నో రకాల మార్పులు, తాయిలాలివ్వటమే కాకుండా, విధానాల్లో రకరకాల మార్పులు మాత్రమే కాకుండా, సంస్కరణలకు కూడా శ్రీకారం చుట్టారు. దాన్ని మనం మనసారా ప్రోత్సహించాలి. ఎందుకంటే, ప్రపంచంలో సంపన్న దేశాలు సైతం, చైనా లాంటి దేశం సైతం, ప్రధానంగా ఆధారపడేది ఉపాధి కల్పనకి, పేదరిక నిర్మూలని చిన్న, మధ్యతరహా పరిశ్రమల మీద. కాబట్టి అందుకు చాలా సమగ్రమైన ఏర్పాట్లు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే, విభజన సమయంలో ఇచ్చిన హామీల్ని, చట్టంలో చేసిన ఏర్పాట్లని పూర్తిగా అంగీకరిస్తూ కొన్ని కేటాయింపులు చేశారు. రాజధాని కోసం కావచ్చు, పోలవరం నిర్మాణం కోసం కావచ్చు, విశాఖపట్నం, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో కావలసిన ఏర్పాట్లు కావచ్చు, వెనకబడ్డ ప్రాంతాల కోసం, నాలుగు రాయలసీమ జిల్లాలు, పాత ప్రకాశం జిల్లాలో మార్కాపురం డివిజన్ సహా మూడు ఉత్తరాంధ్ర జిల్లాలకు బ్యాక్‌వర్డ్ రీజియన్ గ్రాంట్ అన్న పేరుతో ప్రత్యేక నిధులు కావచ్చు – వీటన్నిటికీ కూడా సమగ్రంగా కేటాయింపులు జరిగాయి. సద్వినియోగం చేసుకోవాలి. మరికొన్ని అంశాలున్నాయి. అవి బహుశా తర్వాత ప్రభుత్వం చేపడుతుంది. బడ్జెట్‌లో కేటాయింపులు లేకున్నా కూడా రాష్ట్రానికి రుణమాఫీ చేయవచ్చు. ఉదాహరణకి, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రూ.16,000 కోట్లు అదనంగా రావాలి ఆంధ్రప్రదేశ్‌కి. ఆ డబ్బులు కేటాయించలేకపోయినా, రుణమాఫీ చేస్తే ఆ మేరకు, జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి మనకు వెసులుబాటు వస్తుంది. కాబట్టి మరికొన్ని మనం పట్టుబట్టి సాధించుకోవాల్సిన అవసరం ఉంది. సాధించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని, వాటిని రాష్ట్ర ప్రజలకు అందించిన జాతీయస్థాయి ప్రభుత్వాన్ని మనసారా అభినందించాలి.

ఇక పెన్షన్ పద్ధతికి ఒక పరిష్కారం శాశ్వతంగా జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఆర్థికమంత్రి ప్రసంగంలో సూచన ప్రాయంగా చెప్పారు. జాతీయ స్థాయిలో ఉద్యోగులు కూడా కలిసొస్తున్నారని తెలిపారు. మన పత్రికల్లో వస్తున్న

వార్తల ప్రకారం, ఒక గ్యారంటీడ్ పెన్షన్, అంటే ఉద్యోగులకు వచ్చిన చివరి జీతంలో 50% వచ్చేట్లుగా, దానికి ఒక గ్యారంటీ ఇచ్చే ఏర్పాటు చేయటం, అందుకు కావలసిన అదనపు నిధుల్ని భవిష్యత్తు మీద భారం వేయకుండా, ఇప్పుడే కేటాయించి బడ్జెట్‌లో పెట్టటం జరుగుతోంది. ఇది మనకు అత్యంత అవసరం. ఎట్టి పరిస్థితుల్లోనూ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉండితీరవలసిందే. ఉద్యోగి, ప్రభుత్వం ముందుగానే డబ్బు పెట్టవలసిందే. అదనంగా పెన్షన్ కావాలన్నా, కొంత లోటుంది, గ్యారంటీ ఇద్దాం అంటే, అదనంగా ఖర్చయ్యే డబ్బులకి ప్రస్తుతం బడ్జెట్‌లోనే ఏర్పాట్లు చేసి, ఆ డబ్బుల్ని వేరే చేయవలసిందే. అది చేస్తే సాధ్యం తప్ప, మీరు పాత పెన్షన్ పద్ధతికి వెళ్లి, ఉద్యోగులుగానీ, ప్రభుత్వంగానీ ఈవేళ ఎటువంటి కంట్రిబ్యూషన్ చేయకుండా, భవిష్యత్ తరాల మీద భారం వేయటమనేది నేరసమాన నిర్లక్ష్యం. జాతీయస్థాయిలో ఒక మార్గం చూపెడుతున్నారు, దేశమంతా దాన్ని అనుసరిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. రాష్ట్రాలన్నీ కూడా ముందుకొచ్చి, ఇక ఈ పాత పెన్షన్ పద్ధతి అన్నదాన్ని పూర్తిగా సమాధి చేసి, దేశ భవిష్యత్తుని, రాష్ట్రాల భవిష్యత్తుని కాపాడుకోవాలి.

**పరోక్ష పన్నుల విధానంలో. వాటిని పూర్తిగా మనం ఆహ్వానించాలి. ఇక క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్. స్టాక్ మార్కెట్ మీద 10 శాతం ఉండేది, దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ని 12.5 శాతం చేశారు. ఈ పన్నును పెంచటం చాలా న్యాయం. ఎందుకంటే, కోటీశ్వరులు, లక్షాధికారులు వాళ్ల డబ్బుని స్టాక్‌మార్కెట్‌లో పెడితే, దానిమీద లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్ను 10%, అదే కష్టపడి పనిచేసే కార్మికులకి జీతం మీద 15, 20, 30 శాతం దాకా ఆదాయం పన్ను.**

అలాగే ఎగుమతుల్ని పెంచటం కోసం, కాంపిటీటివ్‌నెస్, అంటే, పారిశ్రామిక ఉత్పత్తుల్లో పోటీ పెంచటం కోసం, ఇతర దేశాలతో, పన్నుల విధానంలో చాలా మార్పులు తెచ్చారు. ముఖ్యంగా పరోక్ష పన్నుల విధానంలో. వాటిని పూర్తిగా మనం ఆహ్వానించాలి. ఇక క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్. స్టాక్ మార్కెట్ మీద 10 శాతం ఉండేది, దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ని 12.5 శాతం చేశారు. ఈ పన్నును పెంచటం చాలా న్యాయం. ఎందుకంటే, కోటీశ్వరులు, లక్షాధికారులు వాళ్ల డబ్బుని స్టాక్‌మార్కెట్‌లో పెడితే, దానిమీద లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్ను 10%, అదే కష్టపడి పనిచేసే కార్మికులకి జీతం మీద 15, 20, 30 శాతం దాకా ఆదాయం పన్ను. సుప్రసిద్ధ అమెరికన్ ఇన్వెస్టర్, బెర్క్‌షైర్ హాథవే అధిపతి, వారెన్ బఫెట్ ఎప్పుడూ చెబుతుండేవారు, అంత అపర కోటీశ్వరుడు కట్టే పన్నులు ఆదాయంలో 12%, ఆయన దగ్గర పనిచేసే సెక్రటరీ కట్టే పన్ను 30%. అదేం ధర్మం? కాబట్టి క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పెంచటం ధర్మం. ఆ డబ్బును సద్వినియోగం చేయాలిగానీ, పన్నులు తగ్గించమని ఎవరూ అనరు డబ్బున్నవాళ్ల మీద. మనకి ఒక రూపాయి పన్ను తగ్గాలి అని చూడటం మాత్రమే కాదు, ఈ దేశ అవసరాలకు మనం ఎలా ఉపయోగపడాలి అన్న ఆలోచన చేయాలి. ఇక ఆస్తుల అమ్మకంపైన పన్ను 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించి, ఇండెక్సేషన్ నిర్మూలించటం ద్వారా పన్నుని సరళీకరించారు.

అయితే కొన్ని అవకాశాలను జారవిడుచుకున్నారు ఆర్థికమంత్రి నా దృష్టిలో. ఒకటి, ఆరోగ్యాన్ని మరింత సమగ్రంగా, సమర్థంగా అందించటం కోసం పెద్ద ఖర్చు ఎక్కువ లేకుండా మంచి పథకాన్ని ఏర్పాటు చేయవలసింది. దాని మీద ఎక్కడా దృష్టి పెట్టలా. మొన్న ఎన్నికల్లో ప్రజలు ఏం చెబుతున్నారు - నిరుద్యోగం, బీదరికం తొలగించమని, మంచి ప్రమాణాల విద్య అందించమని, బతుకుభారాన్ని, లేకపోతే, ఆరోగ్యం మీద ఖర్చును తగ్గించమని. ఇవన్నీ పెట్టకపోతే సమ్మిళిత అభివృద్ధి (ఇంక్లూజివ్ గ్రోత్) రాదు ఈ దేశంలో. అందరినీ కూడా భాగస్వాముల్ని చేయటం అవసరం. దాన్లో కీలకమైన అంశం ఆరోగ్యం. బహుశా భవిష్యత్తులోనైనా ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఆశిద్దాం. అదేవిధంగా, ఉపాధిహామీ చట్టాన్ని చిన్న రైతులకు వర్తింప చేసినట్లయితే, ముఖ్యంగా హార్టికల్చర్, పండ్లతోటలు వేసినట్లయితే, వరి, గోధుమ వంటివి కాకుండా, అలాగే వాటర్ హార్వెస్టింగ్‌లాంటివి, మన భూగర్భ జలం పెరగటానికి, భూసార పరిరక్షణకి కేటాయించినట్లయితే, అదనపు ఖర్చేమీ పెద్దగా లేకుండా వ్యవసాయ రంగానికి చాలా మేలు చేయవచ్చు. అట్లాగే స్టోరేజీకి పెద్దపీట వేయాలి వ్యవసాయాన్ని బాగుచేయాలి అంటే. ఇవాళ దేశంలో వ్యవసాయోత్పత్తుల్లో 10 శాతానికి కూడా నిల్వ సదుపాయం లేదు. అది కూడా ప్రధానంగా వరిపంట, ఆహారధాన్యాలకు ఉపయోగిస్తున్నారు తప్ప, అవసరమైనవాటికి ఉపయోగించటం లేదు. మనకు రేట్లు అదేపనిగా హెచ్చు తగ్గులున్న పంటలున్నాయి. ఉదాహరణకి పత్తి. అట్లాగే మిర్చి, పసుపు పంటలు. ఇవి దీర్ఘకాలం ఉండేవైనా కూడా, నిల్వ ఉంచుకునే శక్తి రైతుకి లేకపోవటం చేత రైతు

తెగనమ్ముకోవాల్సి వస్తోంది. నిల్వ కోసం గోడౌన్లు ఏర్పాటు చేసి, స్టాక్‌కి రుణం ఏర్పాటు చేస్తే, రైతుకి రేటు వచ్చాక అమ్ముకోవచ్చు. చాలా తేలిగ్గా ఈ ఎక్కువతక్కువలు మారి రైతుకి ధరలొచ్చే ఏర్పాటు జరుగుతుంది. అట్లాగే కుళ్లిపోయే పంటలు. పండ్లు, కూరగాయలు. టొమాటో, ఉల్లి చూస్తున్నాం. ధర ఆకాశానికంటుతుంది లేకపోతే పాతాళానికి పడిపోతోంది. వాటికి నిల్వ సదుపాయం ఉండి, ప్రాసెసింగ్ ఉంటే, అలాగే స్టోరేజీతో ప్లెడ్జి రుణం ఉంటే, అంతగా ధరల హెచ్చుతగ్గులుండవు. వినియోగదారుడికి ధర అదేపనిగా పెరగదు కొన్ని సందర్భాల్లో, అలాగే రైతుకి ధర పడిపోదు కొన్ని సందర్భాల్లో.

కాబట్టి తేలిగ్గా చేసే పని. ఇప్పటికైనా భవిష్యత్తులో ఆ పని కోసం ప్రభుత్వం నడుం కడుతుందని ఆశిద్దాం. అలాగే రిటైల్ చెయిన్లని తీసుకురావాలి వ్యవసాయంలో. వ్యవసాయ రంగంలో చాంతాడంత పొడవున్న సప్లయ్ చెయిన్‌ని తగ్గించి, వినియోగదారుడికి ఖర్చు పెట్టే రూ.100లో 60 రైతుకొచ్చే ఏర్పాటు చేయాలంటే, రిటైల్ చెయిన్స్ కావాలి. అలాగే ఎగుమతులు పెద్దఎత్తున మన దేశంలో జరగాలి అంటే, రిటైల్ చెయిన్స్ కావాలి. లేకపోతే చిన్న చిన్న వ్యాపారాలు విదేశీ మార్కెట్‌లో ప్రవేశించటం చాలా కష్టం. రకరకాల ప్రతిబంధకాలున్నాయి. కాబట్టి కొన్ని అవకాశాలు జారవిడుచుకున్నారు. తరువాతైనా కూడా ప్రభుత్వం దీన్నంతటినీ గమనించి, రాష్ట్రాలతో కూర్చుని మార్పులు చేర్పులు చేస్తుందని ఆశిద్దాం.

మొత్తం మీద ఈ బడ్జెట్ ఆహ్వానించదగ్గది, క్రమశిక్షణతో కూడుకున్నది, దీర్ఘకాలిక అభివృద్ధిని సాధించేది, ప్రగతిని పెంచేది, ఆదాయాన్ని పెంచేది, నైపుణ్యాన్ని పెంచేది, ఉపాధి కల్పించేది. ఈ దేశంలో కావలసిందిదే. తాత్కాలికమైన వ్యక్తిగత సంక్షేమం మీద ఆధారపడినట్లయితే, జాతి దీర్ఘకాలిక భవిష్యత్తు కోసం పనిచేయకపోయినట్లయితే, దేశం చాలా నష్టపోతుంది. తాత్కాలిక బడ్జెట్‌లో ప్రతిపాదించిన మిగతా ఖర్చులన్నీ కూడా ఎంతో కీలకమైనవి. ఉదాహరణకు మౌలిక సదుపాయాల కోసం రికార్డుస్థాయిలో 11.11 లక్షల కోట్లు ఇచ్చారు. అన్ని రకాల క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ లెక్కలో చూస్తే అది దాదాపు రూ.15 లక్షల కోట్లు. రికార్డు దేశ చరిత్రలో. 3.4% జాతీయాదాయంలో ప్రభుత్వం ప్రత్యక్షంగా వీటికి ఖర్చు పెడుతోంది. రాష్ట్రాలు అదనంగా ఖర్చు పెడతాయి. ఇవన్నీ పూర్తిగా ఆహ్వానించదగినవి. ఆ పథాన్ని వదలకుండా మంచి మార్గాన్ని కొనసాగిస్తున్నారు.

**మొత్తం మీద ఈ బడ్జెట్ ఆహ్వానించదగ్గది, క్రమశిక్షణతో కూడుకున్నది, దీర్ఘకాలిక అభివృద్ధిని సాధించేది, ప్రగతిని పెంచేది, ఆదాయాన్ని పెంచేది, నైపుణ్యాన్ని పెంచేది, ఉపాధి కల్పించేది. ఈ దేశంలో కావలసిందిదే. తాత్కాలికమైన వ్యక్తిగత సంక్షేమం మీద ఆధారపడినట్లయితే, జాతి దీర్ఘకాలిక భవిష్యత్తు కోసం పనిచేయకపోయినట్లయితే, దేశం చాలా నష్టపోతుంది.**

ఈ ఎన్నికల నుంచి కొన్ని విషయాల్ని నేర్చుకొని ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కొన్ని మార్పులకి సంకల్పించారు. మరికొన్ని మార్పులు ఇవాళ మనం సూచించినట్లు చేసినట్లయితే, కచ్చితంగా దీర్ఘకాలంలో పేదరికం పోతుంది, ఉపాధి పెరుగుతుంది, ఆదాయాలు పెరుగుతాయి. ఒక అభివృద్ధి చెందిన దేశంగా భవిష్యత్ తరాలు గర్వపడతాయి ఈ దేశంలో. ఆ మార్గానికి మనమంతా దోహదపడతామని ఆశిస్తూ మరొక్కమాట.

మన రాష్ట్ర ప్రజల భవిష్యత్తుగానీ, దేశ ప్రజల భవిష్యత్తుగానీ జాతీయస్థాయిలో లేదు, రాష్ట్రాల్లో ఉంది. నూటికి 80 పాళ్లు ఒక రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉందనేది ఆ రాష్ట్రంలో ప్రభుత్వంపై ఆధారపడి ఉందిగానీ, జాతీయస్థాయిలో లేదు. జాతీయస్థాయిలో ప్రభుత్వం ఉన్నది కేవలం పన్నుల వసూళ్లు (రాష్ట్రాల్లోనూ పన్నుల వసూళ్లు ఉంటాయిగానీ, ఎక్కువ జాతీయస్థాయిలో ఉంటాయి), వనరుల విభజన, వనరుల కేటాయింపు, కొన్ని విధానాలు. అమలు చేసేది, పరిపాలనా యంత్రాంగం ఉండేది, ప్రజలకు దగ్గరగా ఉండేది రాష్ట్రాలు. రాష్ట్రాలు క్రమశిక్షణ పాటించి దీర్ఘకాల అభివృద్ధి కోసం పాటుపడకపోయినట్లయితే, తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమాన్ని దీర్ఘకాలిక అభివృద్ధితో కలపకపోయినట్లయితే, ఎల్లకాలం ఓట్ల వేటలో కులం, మతం పేరుతో మనం ఓటర్లను విభజించే ప్రయత్నం చేసినట్లయితే నష్టపోయేది రాష్ట్రాలు. చివరికి దాని ప్రభావం దేశం మొత్తం మీదా ఉంటుంది. ఈవేళ ఒక మంచి అవకాశం దేశం ముందున్నది, మన రాష్ట్రాల ముందున్నది. ఆర్థిక క్రమశిక్షణను పాటించి, అభివృద్ధికి బాటలు వేసి పెట్టుబడులను ప్రోత్సహించి వచ్చే తరం భవిష్యత్తుని గూర్చి నిరంతరం ఆలోచించే విధానాలు చేపడతారని మనసారా ఆశిస్తున్నాను. దానికి ఈ బడ్జెట్ ఒక మార్గం చూపెడుతోంది. దాన్ని అందుకోవాల్సిన బాధ్యత దేశంలో ప్రయివేటు రంగానికి, రాష్ట్ర ప్రభుత్వాలది, పౌరులందరిదీ. ❒

# సవాళ్లున్నా సుస్థిరాభివృద్ధికి గొప్ప అవకాశం

## -ఆర్థిక సర్వే-

2024-25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 6.5 నుండి 7 శాతం వరకు ఉండొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగినా దేశీయ సానుకూలతలు, ప్రోత్సాహకాలు భారత్ వృద్ధికి చోదకశక్తులుగా నిలిచాయని పేర్కొంది. దేశ ఆర్థికాభివృద్ధికి గొప్ప అవకాశాలున్నాయని తెలిపింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన చర్యలను సూచించింది. ఎగుమతులకు ఊతమివ్వటం కోసం చైనా నుండి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చేలా చూడాలని సూచించింది. ప్రయివేటు పెట్టుబడులకు ఊతమివ్వాలని, వాతావరణ మార్పులకు అనుగుణంగా చేయాల్సిన సర్దుబాట్లకు ఆర్థిక వనరులు పెంచాలని పేర్కొంది. ఉద్యోగాల కల్పనకు మరింత అనుకూల వాతావరణాన్ని కల్పించే దిశగా కార్మిక సంస్కరణలను వేగవంతం చేయాలంది. వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని తెలిపింది. పెరుగుతున్న ఆహార ధరల వల్ల ఇబ్బందులు పడుతున్న పేదలు, అల్పాదాయ వినియోగదారులకు కూపన్లు లేదా నగదు బదిలీ ద్వారా ఉపశమనం కలిగించొచ్చని తెలిపింది. వ్యవసాయంలో తక్షణ సంస్కరణలు అవసరమని, విధానాలను పునర్వ్యవస్థీకరించాలని స్పష్టం చేసింది. ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కార్యాలయం రూపొందించిన ఆర్థిక సర్వే 2023-24ను యూనియన్ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు.




### వృద్ధిరేటు పెరిగే అవకాశాలు

ఈ ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు అంచనాల విషయంలో ఆర్థిక సర్వే ఆచితూచి వ్యవహరించింది. ఇది 6.5 నుంచి 7 శాతం మధ్య ఉండవచ్చని తెలిపింది. 2023-24లో సాధించిన 8.2 శాతం వృద్ధిరేటు కన్నా ఇది తక్కువ. ప్రయివేటు పెట్టుబడుల్లో వృద్ధి నెమ్మదించటం, వాతావరణ పోకడలపై అనిశ్చితి వంటి కారణాల వల్ల ఇలా లెక్కలు కట్టినట్లు సర్వే పేర్కొంది. సంస్థాగత సంస్కరణలు అమలు చేస్తే 7 శాతం పైబడి సుస్థిర వృద్ధిరేటును సాధించే వీలుందని తెలిపింది. ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలు:

### విద్య, ఆరోగ్యం

- భారతీయుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి ఉత్పాదకతను దెబ్బతీస్తాయి. వాటిపై దృష్టి సారించాలి. పాఠశాలల్లో మానసిక ఆరోగ్య నిపుణుల సంఖ్యను పెంచాలి. చిన్నారుల్లో ఈ సమస్యలకు సామాజిక మాధ్యమాలను మితిమీరి వినియోగించటం కారణం.
- ప్రాథమిక విద్యలో నాణ్యత పెంచేందుకు సంయుక్తంగా కృషి చేయాలి. బోధన నాణ్యతను పర్యవేక్షించే అధికారుల పోస్టులను భర్తీ చేయాలి.
- భారత్‌లోని 56.4 శాతం ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణం అనారోగ్యకర ఆహారమే. పెద్దల్లో స్థూలకాయం మూడురెట్లు కన్నా ఎక్కువ పెరిగింది. గ్రామీణ ప్రాంతాల (19.3 శాతం)తో పోలిస్తే పట్టణాల్లో (29.8 శాతం) ఊబకాయుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. 18 నుంచి 69 ఏళ్ల మధ్యవయసు గలవారిలో 22.9 శాతం మగవారు, 24 శాతం ఆడవారు ఊబకాయులుగా ఉన్నారు.
- డిజిటల్ చెల్లింపు వ్యవస్థ ఈ-రూపీ విధానంలో ఎరువుల రాయితీని ప్రత్యక్ష బదిలీ ద్వారా రైతులకు అందించాలి.
- గత అయిదేళ్లలో రైల్వే రంగంలో కొత్త లైన్ల ఏర్పాటు, గేజ్ మార్పిడి, డబ్లింగ్ వంటి మూలధన వ్యయం 77 శాతం పెరిగింది. 2019-20లో ఈ వ్యయం రూ.1.48 లక్షల కోట్లు ఉండగా, 2023-24లో రూ.2.62 లక్షల కోట్లకు చేరింది. 2024, ఏప్రిల్ 1 నాటికి భారతీయ రైల్వే 68,564 కిలోమీటర్ల రైల్వే నెట్‌వర్క్‌తో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రైల్వే వ్యవస్థగా ఉంది.

### వ్యవసాయం

భారత వ్యవసాయం ఇప్పుడు సంక్షోభంలో లేదు. అయితే ఈ రంగంలో సంస్కరణలు తక్షణావసరం. వాతావరణ మార్పులు, నీటికొరత పెనుసమస్యలు కానున్నాయి. సబ్సిడీలు, కనీస మద్దతు ధర వంటి తోడ్పాటు చర్యలు అందిస్తున్నప్పటికీ ప్రస్తుత విధానాలపై మదింపు జరపాలి.

వ్యవసాయ సాంకేతికత, మార్కెట్ అవకాశాలను మెరుగుపరచటం, సేద్యంలో నూతన విధానాలు, పెట్టుబడిలో వృధాను తగ్గించటం, వ్యవసాయం–పరిశ్రమ సంధానతను మెరుగుపరచటం వంటివి చేయాలి. ఆహార భద్రత నుంచి పోషకాహార భద్రత వైపు దృష్టి మళ్లించాలి.

⏭ తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, తగ్గిపోయిన నీటిమట్టాల కారణంగా గత రెండేళ్లలో వ్యవసాయ దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో ఆహార పదార్థాల ధరలు పెరిగిపోయాయి. కూరగాయలు, పప్పుధాన్యాల ధరలు పెరిగాయి.

### ప్రయివేటు, వ్యవసాయేతర ఉపాధి పెరగాలి

దేశ ఆర్థిక వ్యవస్థ 2036 వరకు ఏటా సగటున 78.5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరముందని ఆర్థికసర్వే అంచనా వేసింది. దేశంలో ఉపాధి కల్పనలో ప్రయివేటు రంగానిది కీలకపాత్ర. అయినా ఆ విషయంలో కార్పొరేట్ రంగం అంత గట్టిగా అడుగులు వేయలేదు. 33,000 కంపెనీలను శాంపిల్‌గా చేసుకుని జరిపిన సర్వేలో 2019–20 నుంచి 2022–23 వరకు పన్నుకు ముందు లాభం నాలుగింతలైంది. సాధారణ జీడీపీ 9.6% వృద్ధితో రూ.295 లక్షల కోట్లకు చేరింది. కానీ నూతన నియామకాలు, సిబ్బంది వేతనాల్లో వృద్ధి పెద్దగా లేదు. ఉద్యోగాలతోపాటు జీవన ప్రమాణాలు మెరుగుపడితేనే ఆర్థిక వృద్ధి సాధ్యం. ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ, ప్రయివేటు రంగంతో కలిసి పనిచేస్తేనే అది సాకారమవుతుంది.

⏭ కార్మిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వాటా క్రమంగా తగ్గుతోంది. 2023లో మొత్తం కార్మికరంగంలో వ్యవసాయ రంగ వాటా 45.8% కాగా, 2047 కల్లా 25 శాతానికి పరిమితం కావొచ్చు. అందువల్ల వ్యవసాయేతర రంగంలో ఏటా 78.5 లక్షల ఉద్యోగాలను సృష్టించాలి. ప్రస్తుత పీఎల్ఐ (అయిదేళ్లలో 60 లక్షల మందికి ఉపాధి) పథకాలు, మిత్రా టెక్స్‌టైల్ పథకం (20 లక్షల ఉద్యోగాలు), ముద్రా తదితరాల ద్వారా ఈ ఉద్యోగాలను పొందే అవకాశం ఉంది.

### భూచట్టాల్లో సంస్కరణలు అవసరం

తాత్కాలిక ఉపాధి పొందేవారికి, సామాజిక భద్రతను కల్పించేందుకు స్టాఫింగ్ కంపెనీలు కృషి చేయాలి. ఫ్లెక్సీ వర్కర్ల నియామకాలను పెంచాలి. వ్యవసాయం నుంచి ఇతర రంగాలకు వెళ్లేవారికి, మంచి ఉద్యోగాలను సాధించిపెట్టటమన్నది సవాలే. భూ, కార్మిక చట్టాల్లో సంస్కరణలు, నిబంధనల సరళీకరణ ద్వారా నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సర్వే సూచించింది.

## ప్రజల ఆకాంక్షలు పెరుగుతున్నాయి

భారత్ గత దశాబ్ది కాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ మెరుగైన వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. యూనియన్ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అల్పాదాయ దేశం నుంచి అల్ప మధ్యాదాయ దేశంగా ఎదిగింది. ఇప్పుడు మధ్యాదాయ, ఎగువ మధ్యాదాయ దేశంగా మారే క్రమంలో ప్రజల ఆకాంక్షలు విశేషంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యకాలిక దృక్పథంలో మనం ఆరంచెల వ్యూహం అనుసరించటం ముఖ్యం.

☞ ప్రయివేటు రంగ పెట్టుబడులు నిలకడగా పెరగాలి. దీనివల్ల ఉద్యోగాల్లో వృద్ధి ఏర్పడటంతోపాటు కార్మికులకు ఆదాయంలో న్యాయబద్ధ వాటా దక్కుతుంది

☞ హరిత ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యాలు కీలకం కానున్నాయి. ఈ ప్రయాణానికి మద్దతు ఇచ్చేందుకు వినూత్న దృక్పథంతో కూడిన ఆర్థిక సాధనాలు అందుబాటులోకి రావాలి. వీటి వల్ల ప్రయివేటు పెట్టుబడుల సమీకరణ తేలికవుతుంది.

☞ ఎంఎస్ఎంఈలకు రుణ లభ్యతలో వ్యత్యాసాల తొలగింపుకి ప్రభుత్వం మార్గాలు అన్వేషించాలి. నియంత్రణల సడలింపు, భౌతిక, డిజిటల్ కనెక్టివిటీ పెంపు, ఎంఎస్ఎంఈలు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవటానికి వీలుగా మెరుగైన ఎగుమతుల వ్యూహం అనుసరించటం అవసరం.

☞ భారత వృద్ధికి చోదక శక్తి కాగల సామర్థ్యం వ్యవసాయానికి ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ, వాతావరణ పరంగా రైతులకు సహకారి అయ్యే విధానాలను రూపొందించాలి

☞ జనాభాలో నైపుణ్యాల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు అనువైన విద్య, నైపుణ్య విధానాలు అనుసరించాలి. ఇందుకు ఈయూ తరహాలో సమీకృత విధానం అనుసరించటం మంచిది

☞ ఈపై అంశాలన్నీ ఫలవంతం కావాలంటే ప్రభుత్వ సామర్థ్యాలు, సమర్థతలు పెరగాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పునరుజ్జీవింప చేయటానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

### చౌక దిగుమతుల పట్ల అప్రమత్తత

ఇతర దేశాల నుంచి వస్తున్న చౌకదిగుమతుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సర్వే హెచ్చరించింది. '2024లో భౌగోళిక, రాజకీయ సంఘర్షణలు పెరిగితే, సరఫరాపై ప్రభావం పడి వస్తువుల ధరలు అధికమవుతాయి. అది ద్రవ్యోల్బణంపై ఒత్తిడి తీసుకొస్తుంది. భారత ఆర్థికరంగ

భవిష్యత్ అంచనాలు బాగున్నా, మన బలహీనతల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

### వృద్ధికి కీలకమైన క్యాపిటల్ మార్కెట్లు

దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి గాథలో క్యాపిటల్ మార్కెట్ల పాత్ర కీలకంగా మారిందని ఆర్థిక సర్వే తెలిపింది. కంపెనీలు మూలధనాన్ని సమీకరించేందుకు, మదుపర్లు ఆకర్షణీయ ప్రతిఫలం కోసం పెట్టుబడులు పెట్టేందుకు క్యాపిటల్ మార్కెట్లపై ఆధారపడటం బాగా పెరిగింది. అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక కుదుపుల ప్రభావాన్ని మన మార్కెట్లు తట్టుకుని నిలబడటం ఇందుకు నేపథ్యం. 2023-24లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వర్ధమాన మార్కెట్లలో ఒకటిగా మన మార్కెట్లు నిలిచాయి. విలువ పరంగా మన మార్కెట్లు ప్రపంచంలో అయిదవ స్థానంలో నిలిచాయి. సాంకేతికత, డిజిటలీకరణ, నియం త్రణపరంగా పటిష్ఠ చర్యల వల్ల క్యాపిటల్ మార్కెట్లలో చిన్న మదుపర్ల ప్రాతినిధ్యం శరవేగంగా పెరుగుతోంది. వీరి స్పందన అధికంగా ఉండటం, బ్యాంకుల్లో వడ్డీ ఎక్కువగా ఉంటు న్నందున కార్పొరేట్ సంస్థల నిధుల సమీకరణ కోసం క్యాపిటల్ మార్కెట్లు మరింత ఆకర్షణీయంగా మారాయి.

⏭ దేశ స్థూల జాతీయోత్పత్తిలో స్టాక్‌మార్కెట్ల విలువ నిష్పత్తి 2018-19లో 77 శాతం ఉండగా, 2023-24లో 125 శాతానికి చేరింది. జీడీపీలో మార్కెట్ విలువ నిష్పత్తి పెరగటాన్ని, ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతంగా తప్పనిసరిగా భావించాల్సిన అవసరంలేదని సర్వే అభిప్రాయపడింది.

### చిన్న మదుపర్ల రాక మంచిదే.. కానీ ఎఫ్ అండ్ ఓ ప్రమాదకరం

స్టాక్ మార్కెట్లలోకి చిన్న మదుపర్లు అధికంగా రావటం వల్ల, విదేశీ పెట్టుబడుల ప్రభావం తగ్గినా, అధిక లాభాలు ఆర్జించొచ్చనే ఆశతో వారు ఎఫ్ అండ్ ఓ (ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్) విభాగంలో ట్రేడింగ్ చేస్తూ నష్టపోతున్నారని సర్వే తెలిపింది. డీమ్యాట్ ఖాతాల ద్వారా ప్రత్యక్షంగా, మ్యూచువల్ ఫండ్‌ల ద్వారా పరోక్షంగా స్టాక్‌మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎఫ్ అండ్ ఓపై చిన్న మదుపర్ల ఆసక్తి పెరగటానికి.. అది గ్యాంబ్లింగ్ లక్షణాన్ని పోలిఉండటమే కారణంగా కనిపిస్తోందని సర్వే వివరించింది.

⏭ ఎఫ్ అండ్ ఓ విభాగంలో నెలవారీ టర్నోవరు 2024 మార్చిలో రూ.8,740 లక్షల కోట్లకు పెరిగింది. 2019 మార్చిలో ఇది రూ.217 లక్షల కోట్లు మాత్రమే.

⏭ ఈక్విటీ నగదు విభాగంలో రోజువారీ సరాసరి టర్నోవరు రూ.1 లక్ష కోట్లు ఉండగా, ఎఫ్ అండ్ ఓ విభాగంలో ఇది రూ.330 లక్షల కోట్లు.

**దేశీయ ఎగుమతిదారులు కొత్త దేశాలకు విస్తరిస్తున్నట్లు ఆర్థిక సర్వే తెలిపింది. దేశీయ మొత్తం వాణిజ్య ఎగుమతుల్లో, మొదటి పది స్థానాల్లో ఉన్న దేశాలకు ఎగుమతులు 1999-2000 ఆర్థిక సంవత్సరంలో 61.9 శాతమైతే, గత ఆర్థిక సంవత్సరంలో 50.5 శాతానికి తగ్గింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎగుమతులు 42.9% నుంచి 52 శాతానికి పెరిగాయి. సేవల రంగంలో ప్రస్తుతం ప్రపంచంలో భారత్ ఏడో స్థానంలో ఉందని, 2001లో ఇది 24వ స్థానమని పేర్కొంది.**

⏭ 2023-24లో ఈక్విటీ క్యాష్ విభాగం టర్నోవర్‌లో చిన్న మదుపర్ల వాటా 35.9%.

⏭ డీమ్యాట్ ఖాతాల సంఖ్య 2022-23 చివరకు 11.45 కోట్లు కాగా, 2023-24 ఆఖరుకు 15.14 కోట్లు.

⏭ ఎన్ఎస్ఈ వద్ద నమోదైన మదుపర్ల సంఖ్య 2020 మార్చి నుంచి మూడింతలై 2024 మార్చి 31కి 9.2 కోట్లకు చేరింది. కుటుంబాలు తమ పొదుపులో 20 శాతాన్ని క్యాపిటల్ మార్కెట్‌లో పెట్టుబడులుగా పెడుతున్నారు.

⏭ మ్యూచువల్ ఫండ్ పథకాల నిర్వహణలోని ఆస్తుల విలువ ఏడాది క్రితంతో పోలిస్తే రూ.14 లక్షల కోట్లు (35%) పెరిగి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది. మ్యూచువల్ ఫండ్ ఖాతాల సంఖ్య 17.8 కోట్లకు పెరిగింది.

⏭ గత రెండేళ్లుగా ఐటీ రంగంలో నియామకాలు గణనీయంగా తగ్గినట్లు సర్వే తెలిపింది. ఏఐ వల్ల అన్ని స్థాయిల్లోనూ ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని, అప్రమత్తత అవసరమని సూచించింది.

⏭ చాట్‌బాట్‌లు, జెన్‌ఏఐ విస్తరణ వల్ల బీపీఓ రంగం ప్రమాదంలో పడింది

⏭ సేవల రంగంలో ఏఐ వల్ల ఉద్యోగాల తీరు మారుతోంది. కొన్ని ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తోంది.

⏭ కృత్రిమ మేధ సవాలును ఉద్యోగార్థులు స్వీకరించాలి. విశ్లేషణాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాలు అవసరం. క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచనలు, నైపుణ్యాభివృద్ధి, ప్రోగ్రామింగ్, డిజైనింగ్, టెక్నాలజీపై దృష్టి సారించాలి.

### పర్యాటకంలో భారీ ఉద్యోగావకాశాలు

తయారీ, సేవల రంగంలో ఉద్యోగాల కల్పన తగ్గుతున్న నేపథ్యంలో, పర్యాటకం, ఆతిథ్య రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు సృష్టించే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తెలిపింది. కొవిడ్ పరిణామాలు ముగిశాక పర్యాటకం బాగా

**అమెరికా, ఐరోపాలు చైనా నుంచి దూరంగా జరుగుతున్నవేళ.. చైనా కంపెనీలు మన దేశంలో పెట్టుబడులు పెట్టేలా చేసి, వివిధ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయటం మంచిదని సర్వే తెలిపింది. తద్వారా అమెరికాకు మన పెట్టుబడులు పెరుగుతాయి. గతంలో తూర్పు ఆసియా దేశాలు ఇలానే చేశాయి. 2020 మేలో చైనాతో సంఘర్షణ మొదలైన నేపథ్యంలో 200కి పైగా చైనా యాప్‌లపై మన దేశం నిషేధం విధించినా తద్వారా వాణిజ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. భారత్‌కి వస్తున్న మొత్తం ఎఫ్‌డీఐలో 2000 నుంచి 2024 వరకు చైనా వాటా 0.37% మాత్రమే.**

పెరగటం ఇందుకు నేపథ్యమని వివరించింది. పర్యాటక కేంద్రాల్లో మౌలిక వసతులు పెంచాలని, సేవల మెరుగుదలకు సంబంధించిన నైపుణ్యాల్లో శిక్షణ కార్యక్రమాలు అవసరమని పేర్కొంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లకు వీలు కల్పించాలని సూచించింది. వడ్డీ రేట్ల నిర్ణయంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకోవద్దు.

⏭ వడ్డీ రేట్లను నిర్ణయించేందుకు రిటైల్ ద్రవ్యోల్బణాన్ని రిజర్వుబ్యాంక్ పరిగణలోకి తీసుకుంటుంది. అయితే వడ్డీ రేట్ల నిర్ణయంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిశీలనలోకి తీసుకోవద్దని ఆర్థిక సర్వే సూచించింది. అధిక ఆహార ధరలను నియంత్రించేందుకు/ తట్టుకునేందుకు పేదలకు కూపన్లు ఇవ్వటం లేదా నేరుగా నగదు బదిలీ వంటి అవకాశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. 2016లో ప్రభుత్వం ద్రవ్యోల్బణ నియమావళిని తీసుకొచ్చింది.

⏭ దివాలా స్మృతి అమల్లోకి వచ్చిన 2016 తర్వాత, కేసులు నమోదు కావటానికి ముందే రూ.10.2 లక్షల కోట్ల బాకీలు వసూలయ్యాయని ఆర్థిక సర్వే వెల్లడించింది.

⏭ వాహన, వాహన విడిభాగాల కోసం ఉద్దేశించిన ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ), ఇప్పటిదాకా రూ.67,690 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడులు ఆకర్షించింది. 2024 మార్చి చివరకు రూ.14,043 కోట్ల పెట్టుబడులు మూలధనం రూపంలో వచ్చాయి. 1.48 లక్షల మందికి ఉపాధినిస్తామని దరఖాస్తుదారులు ప్రతిపాదించగా, ఇప్పటిదాకా 28,884 ఉద్యోగాలనిచ్చారు.

⏭ ప్రయాణీకుల నుంచి గిరాకీ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో విమానయాన సంస్థలు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఆర్థిక సర్వే సూచించింది. స్థిరమైన విధానాలు అనుసరించాలని, ప్రభుత్వం, పరిశ్రమ విదేశీ భాగస్వాములతో కలిసి పనిచేయాలని అభిప్రాయపడింది.

⏭ అయిదారు దశాబ్దాల కాలంలో దేశీయ ఫార్మా పరిశ్రమ స్థిరమైన వృద్ధి సాధిస్తూ, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు సంపాదించింది. ముడి ఔషధాలు, ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇంగ్రిడియెంట్ల) కోసం ఇతర దేశాలపైనే ఆధారపడి ఉన్నాం. పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాన్ని పెంపొందించుకోవటమే దీనికి పరిష్కారమని సర్వే పేర్కొంది. దేశీయ ఔషధ పరిశ్రమ విలువ ప్రస్తుతం 50 బిలియన్ డాలర్లు, 2030కి 130 బిలియన్ డాలర్లు. ఫార్మా రంగానికి చెందిన మొత్తం ఉత్పత్తుల్లో 30% తెలంగాణలోనే జరుగుతున్నాయి.

⏭ మనదేశంలో 150కి పైగా బహుళజాతి కంపెనీలు తమ జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశాయి. ఐటీ, ఫార్మా, బీపీఓ, ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ వంటి అనేక రంగాల్లో ఇవి సేవలు అందిస్తున్నాయి. వీటిని

**2023-24లో భారత్ 14 బిలియన్ డాలర్ల (సుమారు 1.16 లక్షల కోట్ల) విలువైన ఐఫోన్‌లను యాపిల్ సంస్థ అసెంబ్లింగ్ చేసింది. అంతర్జాతీయంగా యాపిల్ తయారుచేసిన ఐఫోన్లలో ఇవి 14 శాతానికి సమానమని ఆర్థిక సర్వే వెల్లడించింది. 2023-24లో అమెరికాకు మొబైల్‌ఫోన్లు సహా ఎలక్ట్రానిక్స్ దిగుమతులు 5.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి.**

**✦ దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రూ.8.22 లక్షల కోట్లు**

**✦ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.1.9 లక్షల కోట్లు**

ఆకర్షించటంలో తెలంగాణ, కర్ణాటక ముందున్నాయి.

⏭ రాబోయే అయిదేళ్లలో ప్రతి గ్రామ పంచాయతీలో ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్థికసర్వే తెలిపింది. రాష్ట్రాలవారీగా చేస్తే అత్యధికంగా మహారాష్ట్రలో 2.20 లక్షల సంఘాలుంటే, గుజరాత్‌లో 80 వేలు, తెలంగాణలో 55 వేలు ఉన్నాయి. గత మార్చి నాటికి దేశంలో మొత్తం 8.03 లక్షల సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. బహుళ రాష్ట్రా ల్లో, ఇతర దేశాల్లో వ్యాపారాలు చేసే 1614 మల్టీ స్టేట్ సహకార సంఘాలు కూడా ఉన్నట్లు సర్వే తెలిపింది. వీటి ద్వారా పలు దేశాలకు వ్యవసాయోత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ❐

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Vote Jugaad August 2024! జుగాడ్ 50:50 రాజనీతి

## Cooperation based on trust - Jugaad Voters' Government!

## (నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం)

1) శాసనసభలు (Legislature) 2) అధికార యంత్రాంగం (Executive) 3. న్యాయవ్యవస్థ (Judiciary), ఈ మూడు వ్యవస్థలనూ 1950 జనవరి 26 తరువాత ఓటర్లైన మనపూర్వీకులు ప్రజాస్వామ్యానికి అనుగుణంగా భారతరాజ్యాంగాన్ని నిర్మించారు. 4.పైమూడింటినీ నిరంతర నిఘాలో ఉంచేందుకు వార్తాపత్రికలతో సహా ప్రసార మాధ్యమాలు పనిచేస్తాయని భావించారు. కానీ రాజ్యాంగకర్తలు (అనగా అలనాటి ఓటర్లు) ఆశించిన విధంగా వ్యవస్థలు పనిచేయడం లేదన్నది నిర్వివాదాంశం!

2) పై వ్యవస్థలకు సంబంధించిన ఓటర్ల రోజువారీ వ్యవహారశైలిలో సంస్కరణలు తీసుకువచ్చే నిశ్శబ్ద ఉద్యమమే జుగాడ్ ఓటర్ల ఉద్యమం. తద్వారా, గ్రామ సర్పంచి కేంద్రబిందువుగా, ఎమ్మెల్యే నియోజకవర్గం వృత్తపరిధిగా - ఒక ద్విపక్ష జాతీయ పొలిటికల్ పార్టీ ఏర్పడుతుంది. పేరు (తాత్కాలికంగా) జుగాడ్ స్వర్ణ భారత్ ! నేటి జుగాడ్ ఓటర్లే రేపటి ప్రభువులు! నేనొక పునాదిరాయిని మాత్రమే !

3) ఈ పంద్రాగస్టుకి, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అయింది. సాంకేతికంగా ఆర్థికంగా ఎంతో పురోగతి సాధించాము. వార్షికాదాయం ఐదు లక్షల రూపాయలు మించని పేద కుటుంబాలకి ప్రభుత్వాల వివిధ పథకాల ద్వారా ఉచితంగా ఆహారం, త్రాగునీరు, విద్యుత్తు, స్త్రీలకు బస్సుసౌకర్యం, ఆరోగ్య భీమా లభిస్తున్నాయి. ఇదొక్కటే సంతోషించతగ్గ విషయం. దేశ ఆర్థిక వ్యవస్థ పై ఋణభారం పెరుగుతుంది అని విజ్ఞులు గ్రహించాలి

4) అయినా, మన ఓటర్ల వ్యవస్థలో అంతర్గత లోపాల మూలంగా, నేరాలూ- మోసాలూ - ద్వేషాలు, పెరుగుతున్నాయి. ఏ సమస్యకైనా పరిష్కారం కొట్లాడి సాధిస్తాం - అనే కొన్ని స్థానికపార్టీల - దుష్ట-నీతిని ఓటర్లందరూ తిరస్కరించాలి. సమస్యల పరిష్కారానికి మాట్లాడి సాధిస్తామనే నీతికి ఓటర్లంతా కట్టుబడి ఉండాలి. శాంతియుతంగా ఏదైనా సాధించవచ్చు.

5) పాలకవర్గాలు పోలీసు వ్యవస్థని గుప్పిట్లో పెట్టుకుని, నిరంకుశధోరణిని ప్రదర్శిస్తూఉంటే మనం ఏమీచేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాం. చట్టబద్ధ పాలన లోపించి, సామాజిక భద్రత కరువైంది. అందుకే హత్యలు ఆత్మహత్యలు మానభంగాలు నానాటికి ఎక్కువ అవుతున్నాయి. మనచే ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధులు గవర్నర్ చే కాని ప్రెసిడెంట్ చే కాని ప్రమాణ స్వీకారం చేసిన (రాగద్వేషాలకతీతంగా పనిచేస్తామని, రాజ్యాంగ పరిధిలోనే ఉంటామని, సభాగౌరవాన్ని కాపాడుతామని వాగ్దానం చేసిన) ఎమ్మెల్యేలు లేదా ఎంపీలు అధికారంలోకి రాగానే గూండాలులాగ ప్రవర్తిస్తూ ఉంటే ప్రజాస్వామ్యం ఎలా నడుస్తుంది?.

6) "మన ఓటు-మన డబ్బు-మన పార్టీ, మన స్వాధికార ప్రభుత్వం" ప్రాతిపదికన, నమూనా మార్పుకై జుగాడ్ ఓటర్ల జాతీయ ద్విపక్ష పార్టీ నిర్మాణానికి సమిష్టిగా కృషి చేద్దాం రండి. ఓటర్లందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు !

**Contact: Jugaad Parthasarathy (9866416798) With (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**


Advt

# పేదరికాన్ని పెంచుతున్న ప్రభుత్వం

అర్జున్

ఏదైనా అనారోగ్యం వస్తే జాప్యం లేకుండా ఆసుపత్రికి వెళ్ళటానికి మన దేశంలోని మధ్యతరగతి కుటుంబాల్లో ఎక్కువమంది సుముఖత చూపించరు. మౌనంగా సమస్యను భరిస్తున్నారు. ఎందుకంటే, వాళ్లకి తెలిసింది ఒకటే – ప్రైవేటు ఆసుపత్రికి వెళితే ఆస్తులు అమ్ముకునేంత ఖర్చు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే వైద్యం అందదనే భావన. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అయినా, వైద్యం అనే మౌలిక సదుపాయంలేక దేశంలో ప్రతి ఏటా 5.5 కోట్ల మంది, ఆంధ్ర ప్రదేశ్‌లో 21 లక్షల మంది పేదరికంలోకి జారిపోతున్నారు.

యాక్సిస్ మై ఇండియా నివేదిక ప్రకారం, దేశంలో 51% మంది నెలకి పదివేల రూపాయలు మాత్రమే సంపాదిస్తున్నారు. 34% మంది ఇరవైవేల దాకా సంపాదిస్తున్నారు. మొత్తంగా దేశంలో 85% మంది నెలవారీ ఆదాయం ఇరవై వేల లోపే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా సాధారణ ఆరోగ్య సమస్య వస్తే, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వచ్చి ఆసుపత్రికి వెళితే సగటున 15 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. జాతీయ ఆరోగ్య గణాంకాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 63.6% ఆరోగ్య ఖర్చులు వ్యక్తిగతంగా జేబుల్లో నుంచి చెల్లిస్తున్నారు. అందులో 24% అప్పు తీసుకుని చెల్లిస్తున్నారు (అంటే చికిత్సకయ్యే ప్రతి 15 వేల ఖర్చు మీద, 2300 రూపాయలు అప్పు చేయాల్సి వస్తోంది).




ఉచితంగా వైద్య సేవలు అందించటానికి ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నప్పటికీ, ఇంత భారాన్నీ మోస్తూ ఎక్కువమంది ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతున్నారు. భారత్‌లో ఆరోగ్య స్థితిపై ఎన్ఎస్ఎస్ఓ గణాంకాల ప్రకారం, వారు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లకపోవటానికి ముఖ్య కారణాలు:

☆ నాణ్యతలేని వైద్యం

☆ నమ్మకం ఉన్న డాక్టర్ దగ్గరికే వెళ్లాలనే భావన


☆ నాణ్యత ఉన్నా, ప్రభుత్వ ఆసుపత్రి దూరంగా ఉండటం

ఇవేకాక అనేక కారణాల వల్ల, ఉదాహరణకు వైద్యులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లటానికి ఇష్టం చూపించకపోవటం, మందుల కొరత, వైద్య పరీక్షకి కావలసిన లేబొరేటరీలు లేక పోవటం వల్ల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల మీద నమ్మకం కోల్పోయారు.

వైద్యరంగంలో కొత్త మందుల ఆవిష్కరణలు, టీకాలు అందు బాటులోకి రావటం వల్ల అంటువ్యాధులు సుమారుగా అదే శాతంలో ఉన్నప్పటికీ వాటి వల్ల కలిగే మరణాల సంఖ్య తగ్గింది. ఇది ఇలా ఉండగా మారుతున్న జీవనశైలి వల్ల, సమాజంలో సాంక్రమికేతర (నాన్‌కమ్యూనికబుల్) వ్యాధుల భారం పెరుగుతూ వస్తోంది.

వ్యాధుల భారం మారుతున్నప్పుడు, నివారణ ఆరోగ్య సంరక్షణ (ప్రివెంటివ్ కేర్) మీద మాత్రమే కాకుండా చికిత్స (క్యూరేటివ్ కేర్) మీద కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యశ్రీ పథకం కింద సమర్థవంతంగా ఆసుపత్రి స్థాయిలో వైద్యసేవలు అందించటానికి ప్రజలకు ఎంపిక స్వేచ్ఛ, ఆసుపత్రుల మధ్య పోటీ ఉండటమే ముఖ్య కారణం. కానీ అంటువ్యాధులను త్వరగా కని పెట్టి చికిత్స అందించటంలో, సాంక్రమికేతర వ్యాధులకు వైద్యం అందించటంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు విఫలం అయ్యా యి. ఈ వైఫల్యం వల్ల ఆ భారం తృతీయస్థాయి వైద్యం అందించే స్పెషాలిటీ వైద్య కేంద్రాల మీద పడి, వైద్యానికి అయ్యే ఖర్చు, ఆ కేంద్రాలలో వైద్యుల మీద పడే భారం పెరుగుతూ ఉంది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లని మెరుగుపరిచి సగటు కుటుంబం మీద పడే ఆర్థిక భారాన్ని తగ్గించాలంటే, ప్రభుత్వం ప్రవేశపెట్టే ఏ నమూనా అయినా, తగిన ఫలితాలు రావాలంటే, మూడు ప్రాతిపదికల్ని పాటించాలి.




**గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వైద్యభారం**

దేశంలో నెలవారీ కుటుంబ ఖర్చులు పెరిగాయని, గ్రామాల్లో ప్రధానంగా వైద్యం కోసం చేస్తున్న వ్యయం ఎక్కువగా ఉందని జాతీయ కుటుంబ వినియోగ వ్యయ సర్వే 2022–23 తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు విద్యపై చేస్తున్న ఖర్చు తగ్గుతోంది. 2009–10లో మొత్తం వ్యయంలో 3.6 శాతం ఖర్చు చేస్తే, ఇప్పుడది 3.3 శాతానికి పడిపోయింది. వైద్యం కోసం చేస్తున్న ఖర్చు మాత్రం 5.4 శాతం నుంచి 7.1 శాతానికి పెరిగిందని పేర్కొంది.

1. ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నప్పుడు తమ జేబులో నుండి ఎటువంటి ఖర్చు లేకుండా, తాము నమ్మిన వైద్యుడిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ

2. మెరుగైన వైద్యం అందించటం ద్వారా తమ సంపాదన పెంచుకోవటానికి వైద్యుల మధ్య పోటీ పెంచే వ్యవస్థ

3. అవసరమైన అన్నిరకాల మందులు, అధునాతన పరికరాలతో రోగ నిర్ధారణ పరీక్షలు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చేందుకు మందుల్ని కేంద్రీకృతంగా సేకరించటం, ఉమ్మడి (క్లస్టర్డ్) వైద్య పరీక్ష కేంద్రాలు ❐

# చట్టసభలపై చర్చించాల్సిన సమయం

అనేక కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలు ఉన్న వైవిధ్యభరితమైన భారతదేశంలో, ప్రతి వర్గానికీ భిన్నమైన ఆకాంక్షలు ఉంటాయి. కానీ దేశంలో ఉన్న మితమైన వనరులతోనే అందరి ఆకాంక్షాల్ని నెరవేర్చాలి. ఇలాంటి సందర్భంలో హింసా మార్గాన్ని ఎంచుకోకుండా శాంతియుతంగా చర్చించి, ఏదో ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకుండా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విధివిధానాలు తీసుకురావటానికి నిర్మించుకున్న వ్యవస్థ మన చట్టసభలు. భారతదేశంలో ప్రజలు నేరుగా ఎన్నుకుని అధికారం ఇచ్చిన ఏకైక వ్యవస్థ ఇది.

ఇంతటి ప్రాముఖ్యత ఉన్న శాసన వ్యవస్థ ఇటీవలి కాలంలో పోషించాల్సిన పాత్ర పోషించటంలేదు. పలు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ ఆరోపణల్ని, పరిష్కారాల్ని తెలుసు కోవటానికి చట్టసభల పనితీరును పరిశీలిద్దాం.

1962 నుండి 1967 వరకు లోక్‌సభ కేటాయించబడిన సమయంలో 107% పనిచేసింది. కానీ 15వ లోక్‌సభ కొచ్చేసరికి అనేక అంతరాయాల్ని ఎదుర్కొన్నందున కేటాయించిన సమయంలో 61% మాత్రమే ఉపయోగించు కుంది. సభకు అంతరాయం కలిగించటం కూడా ప్రజాస్వామ్యంలో భాగమనే వాదనను ప్రచారంలోకి తెచ్చి ఒక వ్యూహంగా అనుసరించారు. కానీ ఏ ప్రమాణాల ప్రకారం చూసినా, ప్రతిపక్షం పాత్ర పార్లమెంటరీ కార్యకలాపాలకు అంతరాయం కలిగించటం కాదు. నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనటం, అర్థవంతమైన విమర్శలు చేయటం. మాకు అధికార, ప్రతిపక్షం మధ్య పరస్పర గౌరవం ఉన్న రాజకీయం కావాలని ప్రజలు స్పష్టమైన సంకేతం ఇచ్చినా పాత తీరు మారలేదు. ఎన్నికల తర్వాత పార్లమెంటు మొదటి సమావేశంలో, ప్రధానమంత్రి ప్రతిపాదించిన అంశాలపై నిర్మాణాత్మక విమర్శను అందించకుండా, ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, చర్చకు నాయకత్వం వహించకుండా, పార్లమెంటు సమావేశాన్ని అడ్డుకోవటానికి పార్టీ సభ్యులను ప్రతిపక్ష నేత ప్రోత్సహించారు.

బిల్లులను లోతుగా అధ్యయనం చేసి మెరుగుపరిచే కమిటీల వ్యవస్థను బలహీనపరిచారు. 15వ లోక్‌సభలో 71% బిల్లుల్ని కమిటీలకు పంపగా, 17వ లోక్‌సభలో ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. కేవలం 16%కి బిల్లుల్ని కమిటీలకు పంపారు. ఫిరాయింపుల నిరోధక చట్టం అమలులో ఉండటంతో, సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తపరచకుండా పార్టీ తీసుకున్న వైఖరిని గుడ్డిగా అనుసరించాల్సి వస్తోంది. ఓటింగ్‌పై పార్టీ జారీ చేసిన విప్‌ని ధిక్కరిస్తే సభ్యులు రాజకీయంగా భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో,

**- సంతోషిణి-**



అభిప్రాయాలను వ్యక్తపరచటానికి, విషయాలపై చర్చించి, నాణ్యమైన పరిశీలనలు చేయటానికి కమిటీలు మరింత కీలకమవుతాయి. బిల్లులను కమిటీలకు పంపటం కాలక్రమేణా తగ్గటం వల్ల చట్టసభల లక్ష్యం దెబ్బతింటోంది. మొదటి లోక్‌సభలో, 48.8% సమయం చట్టాలపై చర్చించటానికి కేటాయించారు. ఇది ఎనిమిదవ లోక్‌సభకు వచ్చేసరికి 24.9% కి తగ్గిపోయింది. ఇటీవలి సంవత్సరాలలో సుమారు 20%కి పడిపోయింది. 2007 నుండి, 47% బిల్లులు ఎటువంటి చర్చ లేకుండానే అమలయ్యాయి. చర్చకు కేటాయించిన సమయం తగ్గిపోవటం వల్ల, వ్యవసాయ రంగాన్ని విముక్తం చేయటానికి, రైతులు వారి ఉత్పత్తులను ఎక్కడ రేటు ఉంటే అక్కడ అమ్ముకోవటానికి అనుమతించే వ్యవసాయ చట్టాలు వంటి మంచి చట్టాల్ని కూడా ఉపసహరించుకోవాల్సి వచ్చింది. చట్టాలను అమలు చేసే ముందు వివిధ పక్షాల సమగ్ర చర్చ, సంప్రదింపులు లేకపోవటం దేశాన్ని ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి పడేలా చేస్తుంది.

భారతదేశంలో వెస్ట్‌మినిస్టర్ నమూనా వల్ల పార్టీలు, పార్లమెంటరీ వ్యవస్థ అనుసంధానమై ఉన్నాయి. పార్లమెంటు పనితీరు మెరుగుపరచటానికి, రాజకీయ పార్టీల పనితీరును సంస్కరించాలి. పలు పార్టీలు నాయకుల వ్యక్తిగత ఆస్తిగా మారాయి. పార్టీ నాయకులను సర్వశక్తిమంతులు, సర్వాంతరయాములుగా చేస్తున్న కేంద్రీకృత ధోరణులు మారాలి. పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే రాజకీయ వ్యవస్థను తీసుకురావటం, సభ్యుల గొంతునొక్కుతున్న విప్ వ్యవస్థను మార్చటం, పార్టీ ఫిరాయింపుల్ని నిరోధించేందుకు ఉద్దేశించిన చట్టాన్ని తొలగించటం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ❐

# "భోళా భాళా" భండారి అంకయ్య

**జూలై 29 సోమవారం ఉదయాన్నే వరంగల్ నుండి లోక్ సత్తా సంస్థ రాష్ట్ర సలహాదారు పర్చా కోదండ రామారావు గారి నుండి నాకు ఫోన్ వచ్చింది. నమస్కారం సార్ అనగానే ఆయన గద్గద స్వరంతో రామ్మోహన రావు గారు ఈ విషాద వార్త విన్నారా అని అన్నారు. తెలియదు సార్ అనగానే వెంటనే ఆయన మన అంకయ్య గారు ఇకలేరు అంటూ భోరున ఏడ్చారు.పాతికేళ్లుగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో కలిసి పనిచేసిన అనుబంధం అది అందుకే కోదండ రామారావు గారు అంతలా ఫీలయ్యారు. ఆ వార్త విన్న వెంటనే అంకయ్య గారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మన లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గారికి మొదట ఈ సమాచారం అందించాను. ఆ తర్వాత మన లోక్‌సత్తా ఆత్మీయ బంధువులందరికీ అంకయ్య గారి మరణ వార్త తెలియజేశాను. అంకయ్య గారితో నాకు కూడా పాతికేళ్ల అనుబంధం ఉంది. అందుకే ఆయనకు అశ్రు నివాళి అర్పిస్తూ ఆయనతో నాకున్న జ్ఞాపకాలను మీతో పంచుకుంటున్నాను.**



**ఆత్మీయ అనుబంధం మాది**

నా ఇంటి పేరు "బండారు". అంకయ్య గారి ఇంటిపేరు "భండారి". ఇంటి పేరు కొంచెం అటూ ఇటుగా అదే అక్ష రాలు కొంచెం తేడాతో ఒకే విధంగా ఉండటంతో చాలా మంది మమ్మల్ని ఏక వంశీకులు లేకపోతే చుట్టాలు అను కునేవారు. కొందరు మమ్మల్ని అడిగే వారు కూడా అప్పుడు నాతో పాటు అంకయ్య గారు చిరునవ్వుతో అవును మేము చుట్టాలమే మనమందరం రక్త సంబంధీకులము కాకపోయి నా భావాల పరంగా లోక్‌సత్తా బంధువులం కదా అనే వాళ్ళం.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ లో మేము చేరిన తర్వాత మొదటి రెండు సంవత్సరాలు నేను ఉమ్మడి మెదక్ జిల్లా సమన్వయకర్తగా వ్యవహారాలు చూసేవాడిని. అంకయ్య గారు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వరంగల్ జిల్లా సమన్వయకర్తగా పర్చా కోదండ రామారావు గారితో కలసి పనిచేసేవారు. మేమిద్దరం వేరువేరు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించి పనిచేశాము. అప్పుడు జిల్లాల నుండి ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయిలో జరిగే సమావేశాలకు అందరితోపాటు మేము కూడా హాజరయ్యే వాళ్లం. ఆ తర్వాత 2000వ సంవత్సరం నుండి మేమిద్దరము రాష్ట్రస్థాయి బాధ్యతలు తీసుకున్నాం. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు నేను ప్రాతినిధ్యం వహిస్తే వరంగల్, ఖమ్మం, నల్లగొండ, జిల్లాలకు అంకయ్య గారు ప్రాతినిధ్యం వహించేవారు. అలా మొదట జోనల్ కోఆర్డినేటర్లుగా మొదలైన మా ప్రయాణం ఆ తర్వాత అంకయ్య గారు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా నేను తెలంగాణ జిల్లాలు సమన్వయ పరిచే బాధ్యులుగా పని విభజన చేసుకున్నాం. మొదట్లో మేమిద్దరం వేరువేరు బాధ్యతలు తీసుకోవడం వల్ల చాలా వరకు కలిసి తిరిగే వారం కాదు. ఎవరి ఏరియాలో వారు పనిచేసే అవకాశం మాత్రమే ఉండేది. కానీ ఆ తర్వాత మా ఇద్దరినీ రాష్ట్రవ్యాప్తంగా తిరిగే అవకాశం లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కల్పించింది. దాంతో రాష్ట్రంలోని దాదాపుగా అన్ని జిల్లాలు ఒక పదేళ్ల పాటు మేము కలిసి తిరిగే అవకాశం, అదృష్టం లభించింది.

-బండారు రామ్మోహనరావు

నాకు, అంకయ్య గారికి వయసులో సుమారు 20 సంవత్సరాల తేడా ఉంది. ఒకరకంగా చూస్తే మా నాన్న గారి వయసుకు ఒక పది సంవత్సరాలు అటు ఇటుగా ఆయన వయసు ఉండేది. నాకు చిన్న వయసులోనే రాజ కీయంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో వివిధ పదవుల్లో ఎన్నికై క్షేత్రస్థాయిలో ఉన్న అనుభవం ఉంటే మరో వంక అంకయ్య గారికి రెవిన్యూ డిపార్ట్మెంట్లో కిందిస్థాయి నుంచి అనేక పదోన్నతులు పొందుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన అనుభవం అంకయ్య గారిది. కేవలం అధికారిగానే కాకుండా సాహిత్యకారుడిగా, రచయితగా, కళాకారుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఉన్న ఆయన అనుభవం లోక్‌సత్తా ఉద్యమ వ్యాప్తిలో నాకు ఎంతో పనికి వచ్చింది.

అంకయ్య గారితో లోక్‌సత్తాలో పనిచేస్తున్నప్పుడు నాకున్న రెండు అనుభవాలను పంచుకుంటాను. రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతున్న సందర్భంలో ప్రతిరోజు శుక్రవారం రాత్రి బయలుదేరితే సోమవారం ఉదయం ఇంటికి చేరేవాడిని. అప్పుడు తెలంగాణ జిల్లాలలో వరంగల్ జిల్లా మినహాయించి రైల్వే సౌకర్యం సరిగ్గా ఉండదు కనుక చాలా వరకు నేను


లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సాహిత్యం పెద్ద పెద్ద పుస్తకాల కట్టలు లగేజీ తీసుకొని బస్సుల్లో తిరిగే వాడిని. ఉదయం 5 గంటలకు మా ఊరు ప్రజ్ఞాపూర్ నుండి బయలుదేరితే ఆయా జిల్లా కేంద్రాలకు వెళ్ళడానికి ఐదారు గంటల సమయం పట్టేది. సరే సమావేశం అయిపోగానే సాయంత్రాలు మళ్లీ ఏ రాత్రయినా ఇంటికి రావాలి కనుక వెంటనే నేను తిరుగు ప్రయాణం కోసం బస్సు కోసం ఆరాటపడేవాడిని. ఎందుకంటే అప్పుడు నేను న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాను కనుక సోమవారం ఉదయాన్నే కోర్టుకు హాజరు కావాలి. ఒకసారి అలాగే సిద్దిపేటలో ఒక సమావేశం ముగించుకొని తొందర తొందరగా బస్సు స్టాండ్ కు బయలుదేరాను అప్పుడు అంకయ్యా గారు నన్ను గట్టిగా చేయి పట్టుకుని రామ్మోహనరావు గారు దూర ప్రాంతం నుంచి ఇంటికి పోవడానికి తొందరపడడం సహజమే అయినా సిద్దిపేటకి మీ ఊరు ప్రజ్ఞాపూర్‌కి మధ్య మీకు ఎంతో దూరం లేదు కదా పబ్లిక్ మీటింగ్ కానీ లేక సమావేశం పూర్తి అయిన తర్వాత మన కార్యకర్తలతో ఒక గంట సేపు కూర్చుంటే మనకు ఆ జిల్లా సమస్యలు తెలుస్తాయి. లేకపోతే మీరు కూడా ఒక గెస్ట్‌గా వచ్చి పోయినట్లే ఉంటుంది అని నాకు హితబోధ చేశారు. ఆయన చెప్పిన మాటలు నేను పాటించడం వల్ల నాకు

**భండారి అంకయ్యగారి మృతి లోక్‌సత్తా ఉద్యమానికి తీరని లోటని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ పేర్కొన్నారు. భండారి అంకయ్య మృతిపట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సత్తా ఉద్యమ వ్యాప్తికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు.**

అంకయ్యా గారు తన వయసు తేడా కూడా మర్చిపోయి అందరితో కలసి మెలిసి ఉండేవారు. కోపం అప్పటికప్పుడు సమసి పోయేదే అని నేను కార్యకర్తలను సమాధానపరిచేవాన్ని. నిజంగానే అంకయ్యా గారి ప్రవర్తన ఆ విధంగా ఉండేది. తను కోపగించిన కార్యకర్తలని తన అక్కున చేర్చుకొని కల్మషం లేకుండా మాట్లాడేవారు. అంకయ్యా గారు భోళా శంకరుడు ఆయనకు కోపం వస్తే మనకు చాలా మంచి జరుగుతుందని ఆయన నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది అని కార్యకర్తలకి సర్ది చెప్పేవాడిని.

**లోక్‌సత్తా ఉద్యమానికి సూత్రధారి..పాత్రధారి**

లోక్‌సత్తా చేపట్టిన అనేక ఉద్యమాలకు కార్యక్రమాలకు ఆయన సూత్రధారిగా గానే కాకుండా పాత్రధారిగా కూడా ఉన్నారు. "జనబలం" ఎడిటోరియల్ బోర్డులో ఒకరుగా సంపాదకీయం




భండారి అంకయ్యగారి స్వగతం 'నాలో నేను' పుస్తకంలోని ముందుమాట..జనబలం పాఠకుల కోసం..

రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా కార్యకర్తలు నాయకులతో ఆత్మీయ అనుబంధం ఏర్పడింది. ఆ సమావేశంలో తను నాతో పాటు కూర్చుని సమావేశం తర్వాత సమీక్షలు చేసుకునే ఒక మంచి సంప్రదాయాన్ని నాకు నేర్పారు. ఆయన చెప్పిన మాట తూచా తప్పకుండా పాటిస్తూ అవసరమైతే ఒకరోజు ముందుగా ఆయా జిల్లాలకు వెళ్లి ఆయా జిల్లాల్లోనే ఉండి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కార్యకర్తలతో అనుబంధం పెంచుకునే అవకాశం ఆయన మాటల వల్ల నాకు కలిగింది.

**భోళాశంకరుడు**

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కార్యక్రమాలలో తిరుగుతున్నప్పుడు కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేయడంలో ఏమైనా అవకతవకలు జరిగినా లేక పబ్లిక్ మీటింగ్ కానీ ఇతరత్రా సమావేశాలు కానీ కొంచెం ఆలస్యం అయినా కూడా ఏ పనైనా సరిగ్గా జరగకపోతే ఆయన కార్యకర్తలను కోప్పడేవారు. కానీ ఆ కోపం అంతా సమావేశం పూర్తికాగానే పటా పంచలయ్యేది.

నుంచి మొదలుకొని లోక్‌సత్తా ఉద్యమ సమయంలో మరియు పార్టీ ఏర్పడిన తర్వాత కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కళాజాత కార్యక్రమానికి అంకయ్యా గారు దర్శకులుగా పనిచేశారు. వారి మార్గదర్శకత్వం లోనే మేము కళాజాతలో ఏ అంశాలు తీసు కోవాలి ఎలాంటి పాటలు ఉండాలి దానికి అవసరమైన కొరియోగ్రఫీతో సహా అంకయ్యా గారే దగ్గర ఉండి చూసు కునేవారు. "ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం" అనే పాట ఆయన కలం నుండి జాలువారింది .అలాగే లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సాహిత్య సృజనలో ఆయన పాత్ర చాలా పెద్దది.

**ఇందుగలడందు లేడని..**

ఒక్క మాటలో చెప్పాలంటే లోక్సత్తా ఉద్యమ సంస్థ నిర్మాణంలో ఆ తర్వాత పార్టీ ఆవిర్భావం సమయంలో పార్టీ కొనసాగింపులో "ఇందు గలడందు లేడని" సందేహము లేకుండా అంకయ్యా గారి పాత్ర చిరస్మరణీయం వారికి అశ్రునివాళి.

# ఈసీపై ఆరోపణలు – పోలింగ్ బూత్ రిపోర్ట్

- క.సంతోష్ చైతన్య

మనకు స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయిన తరుణంలో ఈ సుదీర్ఘ ప్రయాణం సాధ్యమవటానికి, భవిష్యత్తు పట్ల ఆశావాదంతో మనం ఎదురుచూడటానికి కారణమైన రాజ్యాంగ సంస్థల గురించి మాట్లాడుకోవాలి. వీటిలో చాలా కీలక పాత్ర పోషించిన ఓ సంస్థ గురించి నా అభిప్రాయాలను పంచుకోవాలనుకుంటున్నాను. నేను మాట్లాడేది భారత ఎన్నికల సంఘం గురించి.

దేశవ్యాప్తంగా 18వ లోక్‌సభ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు తమ బాధ్యతల్ని స్వీకరించారు.




ఐక్యరాజ్యసమితి (యుఎన్ఎఫ్‌పిఎ) ప్రపంచ జనాభా 2024 నివేదిక ప్రకారం, 1.44 బిలియన్ జనాభాతో భారత్ అత్యధిక జనాభా కలిగిన దేశం. ఎంతో వైవిధ్యమున్న సువిశాలమైన దేశంలో ప్రపంచంలోనే అతి ఎక్కువమంది ఓటర్లతో, 96.88 కోట్ల మందితో ఎన్నికల్ని నిర్వహించటం అంత సులభం కాదు.

తొలి ఎన్నిక నుండి, ఎమర్జెన్సీ లాంటి అవరోధాలను దాటుకుని మరీ మన ఈసీ ఎన్నికల్ని విజయవంతంగా నిర్వహిస్తూ వస్తోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర కొన్ని ప్రధాన మార్పుల వరకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారింది.

ఈసీ ప్రకటించిన ఎన్నికల తీర్పును మనమంతా స్థూలంగా ఆమోదిస్తున్నా, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పనితీరు పేలవంగా ఉందనే అభిప్రాయం కొంతమేర సమాజంలో ఉంది. కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కూడా పర్యవసానాలను ఆలోచించకుండా ఆరోపణలు చేయటం, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు వంటివి పెచ్చరిల్లటానికి ఈసీ వైఫల్యమే కారణం అని ఆలోచనాపరులు, మీడియా భావించటం, ఈసీ నియామకాలపై అనవసర వివాదాలు వంటి కారణాల వల్ల ఈసీ పట్ల అనుమానాలు ఇటీవల కొంత ఎక్కువయ్యాయి.

ఎన్నికల్ని సక్రమంగా, నిష్పాక్షికంగా నిర్వహించటంలో ఈసీ విశ్వసనీయతపై సరైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయటం దేశానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదం. వివిధ దేశాల్లో ఎన్నికల తీరు, ఈసీ చరిత్రతో పాటు, ఎన్నికల సంఘం పరిధిని మనం స్పష్టంగా అర్థం చేసుకుంటే, ఈ గందరగోళం ఏర్పడదు. ఈసీ పరిధి ప్రధానంగా పోలింగ్ బూత్‌లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవటానికి సంబంధించినది. ఈ విషయంలో ఈసీ తన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తోంది. ఎవరూ తుపాకి పట్టి బెదిరించి ఓటు వేయించటం లేదు. బూత్ బయట చట్టవిరుద్ధంగా కోట్ల రూపాయల ఖర్చు వంటి సంక్షోభాన్ని ఈసీ పరిష్కరించలేదు, అది రాజకీయ పార్టీలు చేయాల్సిన పని.

అదేవిధంగా, పోలింగ్‌బూత్ పరిధిలో, ఈవీఎంలపై కొన్ని ఆరోపణలు వచ్చాయి. వాటికి సంబంధించి నిజానిజాల్ని పోలింగ్ స్టేషన్‌లోని ప్రొసీడింగ్‌లపై స్వయంగా తెలుసుకున్న వివరాల ఆధారంగా వివరించే ప్రయత్నం ఈ వ్యాసం.

ఒక రాజకీయ పార్టీ పోలింగ్ ఏజంట్ సహాయంతో నేను పోలింగ్ స్టేషన్‌లోని ప్రొసీడింగ్‌లపై అవగాహన పొందాను. మాక్‌పోల్ నుంచి ఈవీఎం సీల్ చేసే వరకు మొత్తం ప్రక్రియకు సంబంధించిన వివరాలు అందించగలిగారు. ఓటింగ్ మందకొడిగా ఉన్నప్పుడు, కొంత సమయం వరకు ఓటర్లు లేనప్పుడు, సంబంధిత ప్రిసైడింగ్ అధికారితో ఆ ప్రతినిధి మాట్లాడారు.

కమిషన్ కేటాయించిన విధులు నిరాకరించటం వల్ల కలిగే

పరిణామాలపై ఆరా తీస్తే, అది సస్పెన్షన్ సహా క్రమశిక్షణా చర్యకు దారితీస్తుందని ప్రిసైడింగ్ అధికారి తెలిపారు.

ఎన్నికల విధులకు ఎంపికైన వారు గైర్హాజరయ్యే అనుమతి ఇవ్వరు. ప్రభుత్వోద్యోగికి ఎన్నికల విధి నుండి మినహాయింపు ఇవ్వటం నాలుగు కారణాలతో మాత్రమే సాధ్యం. రెండుచోట్ల కేటాయింపు, రాజకీయ అనుబంధం, ముందుగా బుక్ చేసుకున్న విదేశీ పర్యటన, తీవ్రమైన గుండెజబ్బులు లేదా అరుదైన వ్యాధి. మినహాయింపు కోరే ఉద్యోగి తన ఉన్నతాధికారులకు అధికారిక రుజువును సమర్పించాలి. ఎన్నికల విధి నుండి మినహాయింపు ఉత్తర్వులను జిల్లా ఎన్నికల అధికారి (డిఇఓ) మాత్రమే ఆమోదించగలరు.

**మొదటి పరిశీలన:**

శిక్షణకి ఎన్ని రోజులు కేటాయించారని పీఓ ఆరాతీయగా, మూడు రోజులపాటు పొందినట్లు తెలిపారు. సూచనలతో కూడిన హ్యాండ్‌బుక్‌ను కూడా అధికారులకు ఇస్తారు కాబట్టి, ఈ వ్యవధి సరిపోతుందని నిర్ధారించటం సహేతుకమైనది.

పీవో, ఇతర పోలింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి/రిటర్నింగ్ అధికారి శిక్షణ ఏర్పాటు చేస్తారు. ట్రైనింగ్ ముగిసే సమయానికి, అధికారులు వీవీప్యాట్‌తో ఈవీఎం పనితీరు, గ్రీన్ పేపర్ సీల్, ప్రత్యేక ట్యాగ్, అన్ని సీలింగ్ విధానాలు, పోలింగ్ స్టేషన్‌లో అనుమతించే వివిధ చట్టబద్ధ వేదికల గురించి అవగాహన పొంది ఉండాలి. ప్రిసైడింగ్ అధికారి తప్పనిసరిగా శిక్షణ మాడ్యూల్ చివరిలో పరీక్షకు హాజరుకావాలి.

అయితే, పీవో, ఇతర అధికారులు, వారికి అందిస్తున్న శిక్షణ, వనరులను (రిసోర్సెస్) పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోకపోవటం గమనించవచ్చు.

**రెండవ పరిశీలన:**

సంబంధిత అధికారులు అవసరమైన సమాచారాన్ని (ఎనెక్చర్-18) రిఫరెన్స్ కోసం తమ వద్ద అందుబాటులో ఉండేలా చూసుకోవటం లేదు. ఒక అంధ లేదా అస్పష్ట ఓటరు వచ్చినప్పుడు, ప్రిసైడింగ్ అధికారి అనుసరించాల్సిన నిబంధనలు కరదీపికలో ఉంటాయి. అతనికి సహాయం ఆ సూచనలకు అనుగుణంగా చేయవలసి ఉంటుంది. అంధ ఓటరు ఓటు వేయటానికి సహాయకునితో కలిసి పోలింగ్ స్టేషన్‌కి రావటం వంటి పరిస్థితుల్లో నిబంధనల కోసం తడుముకోవటం వల్ల ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుంది. ఇది ఓటింగ్ వేగంపై ప్రభావం చూపుతుంది. పొడవాటి క్యూకి దారితీస్తుంది. మండే ఎండలో ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలు సహజంగానే అధికారుల అలసత్వం పట్ల అసహనానికి గురయ్యారు.

**మూడవ పరిశీలన:**

అభ్యర్థుల జాబితా: ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 38 (2) కింద జాబితాలో అభ్యర్థుల పేర్ల వరుస క్రమాన్ని ఈ కింది వర్గీకరణ ఆధారంగా నిర్ణయిస్తారు:

1) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు

2) క్లాజ్ 1లో సూచించినవి కాకుండా నమోదిత రాజకీయ పార్టీల అభ్యర్థులు

3) ఇతర అభ్యర్థులు

అందులో పేర్కొన్న వరుసలోని పేర్లు, ప్రతి కేటగిరిలోని అభ్యర్థుల పేర్లు అక్షర క్రమంలో ఉండాలి. నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న విధంగా పోటీ అభ్యర్థుల చిరునామాలు నిర్దేశించబడిన ఇతర వివరాలతోపాటుగా ఉండాలి.

అయితే, ఫలానా పార్టీ మరో పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నప్పుడు సమస్య ఏర్పడుతుంది.

ఉదాహరణకు, 'ఎక్స్' (సింబల్) పార్టీ 'ఎ' అనే గుర్తింపు పొందిన పార్టీతో కూటమి ఏర్పరచుకుంది. ఈ సందర్భంలో, రెండు పార్టీలు సీట్లు పంచుకుంటాయి, ఒకే స్థానంలో పోటీ చేయవు. నమోదిత పార్టీ 'ఎక్స్' పోటీ చేస్తున్న ప్రాంతాల్లో గుర్తింపు పొందిన పార్టీ 'ఎ' పోటీ చేయదు.

ఎక్స్ అనేది నమోదిత పార్టీ కావటం వల్ల అభ్యర్థి పేరును గుర్తింపు పొందిన జాబితా తర్వాత వచ్చే నమోదిత జాబితా కింద అక్షర క్రమంలో చూడవచ్చు. ఈ ఏర్పాటు, పొత్తుగా కలిసిన పార్టీలు, ఆ పొత్తు వల్ల కలిగే పూర్తి ప్రయోజనాలకు అవరోధమవుతుంది. గుర్తింపు పొందిన జాబితా కింద నమోదిత అభ్యర్థి పేరుకీ చోటివ్వటం సముచితంగా ఉంటుంది.


**నాలుగవ పరిశీలన:**

ఈవీఎం, వీవీప్యాట్, బీయూ అమరిక

ప్రిసైడింగ్ అధికారుల కోసం హ్యాండ్‌బుక్‌లో సూచించినట్లు, ఎం3 ఈవీఎంలో (ఎం3 ఉపయోగంలో ఉన్న ప్రస్తుత మోడ్‌ను సూచిస్తుంది), 24 బ్యాలెట్ యూనిట్లను కంట్రోల్ యూనిట్‌కి కనెక్ట్ చేయవచ్చు. పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 3, 16 (నోటాతో సహా) మధ్య ఉన్నట్లయితే, ఒక బ్యాలెట్ యూనిట్‌ని మాత్రమే కేటాయిస్తారు.

ఓటు వేసేందుకు ఉపయోగించే (థంబ్-వీల్) స్విచ్‌ని, రిటర్నింగ్ అధికారి '01' స్థానంలో సెట్ చేసిన బ్యాలెట్ యూనిట్ టోప్ కుడివైపున ఉన్న విండో ద్వారా గమనించవచ్చు.

ఒక బ్యాలెట్ యూనిట్ 16 బటన్లను అందిస్తుంది. నోటాతో




సహా గరిష్టంగా 384 మంది అభ్యర్థులకు చోటు కల్పించటానికి 24 బీయూలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కంట్రోల్ యూనిట్ నోటాతో సహా అంతమంది అభ్యర్థుల వరకు మాత్రమే పోల్ అయిన ఓట్లను రికార్డు చేయగలదు. ఈ ప్రయోజనం కోసం, ఒక దానితో ఒకటి అనుసంధానించిన ఇరవై నాలుగు బ్యాలెట్ యూనిట్లను ఒక కంట్రోల్ యూనిట్‌తో సంధానిస్తారు.

వీవీప్యాట్‌ను 1 వ బ్యాలెట్ యూనిట్‌కు ఎడమ వైపున ఉంచాలి.

పోలింగ్ స్టేషన్‌లో ఉపయోగించాల్సిన అటువంటి బ్యాలెట్ యూనిట్‌లన్నింటినీ పరస్పర సంధానం చేయాలి. వీవీప్యాట్ యూనిట్‌తో మొదటి బ్యాలెట్ యూనిట్‌ను మాత్రమే లింక్ చేస్తారు.

అందువలన, యూనిట్ల క్రమం ఇలా ఉంటుంది: వీవీప్యాట్-బీయూ 1, బీయూ 2, బీయూ 3.

అయితే, యూనిట్లను అమర్చే సమయంలో, వీవీప్యాట్ ఉంచిన క్రమం కరదీపికలో పేర్కొన్న సూచనలకు భిన్నంగా ఉంది. నిర్దేశించిన ప్రకారం, ఎడమ వైపున ఉంచకుండా, ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ అధికారులు వీవీప్యాట్‌ని కుడివైపు ఉంచారు. ఇది యూనిట్ల క్రమాన్ని మార్చింది. దీంతో, యూనిట్ల క్రమం వీవీప్యాట్-బీయూ 1, బీయూ 2, బీయూ 3 నుండి బీయూ 3, బీయూ 2, బీయూ 1- వీవీప్యాట్‌కి మారింది.

బయట ఓటరు పోస్టర్‌లో అభ్యర్థుల జాబితా చూసి ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన తర్వాత, ఓటరు వీవీప్యాట్‌ని తమ కుడివైపున, బీయూ3ని ఎడమ వైపున గుర్తించగలరు. అయితే బీయూలు అమర్చే క్రమం మార్చినందున కుడివైపున ఉన్న బీయూ 1 అని భావించి, ఆ బీయూపై క్లిక్ చేసి, ఆ ఓటు 3వ బీయూలో జాబితా చేయబడిన మరో అభ్యర్థికి వెళ్లే అవకాశముంది. వీవీప్యాట్ చూసుకున్నవారు మాత్రమే ఈ తప్పు గమనించగలరు.

**ఐదవ పరిశీలన:**

ఓటర్లకు సహాయం చెయ్యటం.

**ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రచారంతోపాటు, తన ఓటుహక్కును సద్వినియోగం చేసుకునే అవకాశం ప్రతి పౌరునికీ ఉండేలా చేయటానికి ఈ ఎన్నికల్లో ఈసీ మరింత ఎక్కువ కృషి చేసింది. ఈశాన్య అరుణాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల గ్రామం, మలోగంలో ఏకైక ఓటరుగా ఉన్న 44 ఏళ్ల సోఖెలా తయాంగ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల్లో పాల్గొని తన ఓటుహక్కును వినియోగించుకునేలా చేసేందుకు ఈసీ అధికారులు శ్రమకోర్చి సుదీర్ఘ పాదయాత్ర చేశారు.**

సీనియర్ సిటిజన్లు లేదా మొదటిసారి ఓటర్లకు సహాయం అవసరమైనప్పుడు, ప్రిసైడింగ్ అధికారి వారిని ఓటింగ్ కంపార్ట్‌మెంట్ లోపలికి తీసుకెళ్లారు. ఇది నిబంధనలకు విరుద్ధమని ప్రిసైడింగ్ అధికారుల హ్యాండ్‌బుక్ పేర్కొంది. ఈవీఎంను ఎలా ఉపయోగించాలో నిరక్షరాస్య ఓటర్లకు వివరించేందుకు ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ సమయంలో ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించకూడదు. ప్రిసైడింగ్ అధికారులందరికీ ఇతర పోలింగ్ సామాగ్రితోపాటు కార్డ్‌బోర్డ్ (వాస్తవ పరిమాణం)పై అతికించిన ఈవీఎం బ్యాలెట్ యూనిట్ ముద్రిత నమూనాను సరఫరా చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచన జారీచేశారు. అటువంటి నమూనా బ్యాలెట్ యూనిట్‌ను ప్రింట్ చేస్తున్నప్పుడు, వాడుకలోలేని డమ్మీ పేరు, డమ్మీ గుర్తు మాత్రమే ఉపయోగిస్తారు. అసలు పేర్లు, గుర్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

ఇది రంగులో ముద్రించబడుతుంది, తద్వారా "బ్లూబటన్", "గ్రీన్‌లైట్", "రెడ్‌లైట్" మొదలైనవి స్పష్టంగా సూచిస్తారు. ఏదైనా ఓటరు సహాయం కోసం అడిగినా లేదా ఈవీఎం ఉపయోగించి ఓటు వేయటానికి అశక్తతను వ్యక్తం చేసినప్పుడల్లా, మీరు ఓటరు అర్థం చేసుకోగలిగే విధంగా ఈవీఎం బ్యాలెట్ యూనిట్ కార్డ్‌బోర్డ్ మోడల్‌ని ఉపయోగించి ఓటింగ్ విధానాన్ని అతనికి వివరించవచ్చు. ఇది ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వెలుపల పోలింగ్ ఏజంట్ల సమక్షంలో మాత్రమే చేస్తారు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్ లోపల ఎప్పుడూ చేయరు.

ఇలాంటి అడ్డంకులు తప్ప ఈవీఎంలపరంగా పోలింగ్ బూత్‌లో సమస్యలు లేవు. మొత్తంగా భారత ఎన్నికల సంఘం తన పరిధిలో సమర్థంగా పనిచేస్తోందని చెబుతూ ముగిస్తాను. పై సమస్యలను పరిష్కరిస్తే, ఈసీ పనితీరు మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా ఉంటుంది.

# రాజకీయాలు, మతం, రాజ్యవ్యవస్థ

విడాకులు తీసుకున్న మహిళల పోషణ బాధ్యతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశం మతపరమైన ఆచారాలు, పద్ధతులను నియంత్రించటంలో ప్రభుత్వ పాత్రను సమీక్షించుకోవటానికి మనకో అవకాశం.

సీఆర్‌పీసీ సెక్షన్ 125 (కొత్తగా వచ్చిన నాగరిక్ సురక్ష సంహితలో సెక్షన్ 144) ప్రకారం, తగిన ఆదాయ మార్గాలున్న ఏ వ్యక్తయినా తన భార్య (విడాకులు తీసుకుని తిరిగి వివాహం చేసుకోని, తనను తాను పోషించుకోలేని భార్య సహా), ఆమె మైనర్ పిల్లలు, పేద తల్లిదండ్రుల పోషణ భారం వహించాలి. వనరులున్నప్పటికీ పోషణ బాధ్యత వహించటాన్ని నిర్లక్ష్యం చేసినా, అందుకు నిరాకరించినా, ఆ నిర్లక్ష్యానికి తగిన ఆధారాలను పరిశీలించాక అతని భార్య, బిడ్డ లేదా తల్లిదండ్రుల పోషణకు నెలవారీ భరణం చెల్లించాలని మేజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.

తాను ముస్లిం పర్సనల్ లా నిబంధనలను అనుసరిస్తున్నందున, విడాకులు తీసుకున్న భార్యకు పోషణ భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని 1985లో షాబానో కేసులో (మహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షాబానో బేగం) భర్త వాదించాడు. ఆ వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. సెక్షన్ 125 అన్ని మతాలకూ వర్తిస్తుందని పేర్కొంది. ఆ తీర్పు రద్దుకు చర్యలు తీసుకోవాలని మతఛాందసవాదులు యూనియన్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. రాజీవ్‌గాంధీ తలొగ్గారు, 1986లో ముస్లిం మహిళల చట్టం (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. విడాకులు తీసుకున్న భార్యను మూడు నెలలపాటు (చాంద్రమానం ప్రకారం) పోషించటానికి, పుట్టిన దగ్గర్నుంచి రెండేళ్లపాటు పిల్లల బాగోగుల్ని చూడటానికి భర్త బాధ్యతను ఆ చట్టం పరిమితం చేసింది.

ఆ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ నుండే పలువురు ప్రగతిశీల ఎంపీలు వ్యతిరేకించారు. అప్పట్లో హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ (ప్రస్తుత కేరళ గవర్నర్) ప్రభుత్వం నుండి రాజీనామా చేశారు. కాంగ్రెస్‌లో గుర్తింపుపొంది ఎదుగుతున్న ఆ నాయకుడు తన రాజకీయ జీవితాన్ని త్యాగం చేశారు. గుడ్డిగా వ్యవహరిస్తున్న మత పెద్దల ఒత్తిడికి తలొగ్గద్దని, కాలం చెల్లిన మతాచారాల నుంచి మహిళల హక్కుల్ని కాపాడాలని సుప్రసిద్ధ ముస్లిం మేధావులు అనేకమంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానీ ఛాందస మతపెద్దలకు ఆగ్రహం తెప్పిస్తుందేమోనని భయపడి

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**



కాంగ్రెస్ పార్టీ, బిల్లు కోసం ఓటు వేయాలని ఎంపీలపై ఒత్తిడి తెచ్చింది. విప్ జారీ చేసింది. విప్‌ను ధిక్కరిస్తే సభ్యులపై అనర్హత వేటు పడుతుందని హెచ్చరించింది. అప్పట్లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా అమల్లోకొచ్చిన పదవ షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం)లోని నిబంధనలను చూపుతూ భయపెట్టింది.

ఈ 1986 చట్టం ఇప్పుడు కోర్టు తీర్పుతో నిర్వీర్యమైంది. దీంతో, మహిళలు ఏ మతవిశ్వాసానికి లేదా ఆచారానికి చెందినవారైనా చట్టం కింద అదే రక్షణ పొందుతారు. ముస్లింలలో ఆలోచనాపరులు అనేకమంది కోర్టు తీర్పును స్వాగతించారు. 1986 ఘటనలు భారత రాజకీయ ముఖచిత్రాన్ని బహుముఖంగా పునర్నిర్మించాయి. మన రాజకీయాలకు మతం రంగు పులిమాయి, మన సామాజిక సంస్కరణను మందగింప చేశాయి. ఛాందస మతపెద్దలకు ప్రభుత్వం లొంగిపోవటం పట్ల పలువురు భారతీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సెంటిమెంట్‌ను చల్లార్చేందుకు ఓ తప్పుడు సలహాను అనుసరించి ప్రభుత్వం బాబ్రీ మసీదు గేట్లు తెరిచింది. రామమందిరానికి పునాది

వేయటానికి (శిలాన్యాస్) హెూంమంత్రి బూటాసింగ్‌ని అయోధ్యకు పంపారు. రాజీవ్‌గాంధీ 1989 ఎన్నికల ప్రచారాన్ని అయోధ్య నుండి ప్రారంభించారు. హిందువులలో మతపరమైన సెంటిమెంట్‌ను రగిల్చి లబ్ధి పొందే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తుంటే, హిందువులను ఏకం చేసి, సాంస్కృతిక జాతీయవాదం లక్ష్యంగా పనిచేస్తున్న బీజేపీ వెనకబడుతుందా? మిగిలింది, వారు చెబుతున్నట్లు, చరిత్ర. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, మతాచారాల్లో రాజ్యం ఎంతమేర జోక్యం చేసుకోవాలి. మన జాతీయోద్యమం, రాజ్యాంగం, గత 77 ఏళ్లుగా మనం అనుసరిస్తున్న పంథా మనకు స్పష్టమైన మార్గసూచీ ఇస్తున్నాయి. ప్రతి మతానికీ రక్షణ ఉండాలి, తమ దేవుడిని లేదా దేవతల్ని ఆరాధించే, తమ విశ్వాసాన్ని అనుసరించే హక్కు ప్రజలకు ఉంది అని ఒక సమాజంగా, దేశంగా మనమంతా అంగీకరిస్తాం. కానీ మత స్వేచ్ఛ ఇతరులను అణగదొక్కే లేదా ఇతరుల స్వేచ్ఛలను కాలరాసే విపరీత ధోరణులు, కాలం చెల్లిన పద్ధతులు ఆచారాలకు విస్తరించకూడదు.

భారతీయుల్లో అత్యధికులు దేవుడ్ని నమ్ముతారు. చరిత్ర మొత్తంలో, మానవుడి ప్రవర్తనను నియంత్రించేందుకు, తద్వారా వ్యక్తిగత స్వేచ్ఛ, సమాజహితం కలసిమెలసి సాగేలా మతం ప్రయత్నించింది. దేవుడు, స్వర్గం, నరకం, పాపం, మరణానంతర జీవితం, దేవుడి తీర్పు, పవిత్రయుద్ధాలను 'మంచి'ప్రవర్తను ప్రోత్సహించేందుకు, 'చెడు' ప్రవర్తనను శిక్షించేందుకు ప్రాచుర్యంలోకి తెచ్చారు. సమాజ హితాన్ని పెంపొందించేందుకు, మనల్ని సవ్యమైన, క్రమశిక్షణ మార్గంలో నిలిపే మతాచారాలు: ఈ మేరకు మనం మతాన్ని, ఆధ్యాత్మికతని గౌరవించాలి.

కానీ మతం పేరుతో పలు విపరీత ఆచారాలు, వ్యవహారాలు అణగారిన, బలహీన వర్గాలకు అపార నష్టం కలిగించాయి. పుట్టుకతో కులాలవారీ అంతరాలు, అంటరానితనం, భర్త చితిపై విధవరాలిని దహనం చేయటం, బాల్యవివాహం, వితంతు పునర్వివాహాన్ని నిషేధించటం, మౌలిక హక్కులను మహిళలకు నిరాకరించటం, జననాంగాల మ్యుటిలియేషన్, సాటి మనుషులను బానిసలుగా వినియోగించుకోవటం, దేవదాసీల పేరుతో మహిళలను లైంగికంగా దోపిడీ చేయటం, మహిళల్ని ఆస్తిగా చూడటం, పెళ్లి, విడాకులు, పిల్లల సంరక్షణ, ఆస్తి విషయాల్లో మహిళలకు సమాన హక్కులు ఇవ్వకపోవటం, మహిళలకు పునరుత్పాదక హక్కుల్ని తిరస్కరించటం – ఇవి, ఇలాంటి ఆచార వ్యవహారాలు ఆధునిక సమాజంలో ఆమోదనీయం కాదు. ఆధునికత గత 500 ఏళ్లలో అవరోధాలను ఛేదించుకుంటూ ప్రపంచమంతా విస్తరించింది. మత విశ్వాసం, దైవాన్ని ఆరాధించే హక్కుల సారాంశాన్ని




గౌరవించాలి, కానీ హేయమైన, హానికరమైన, దోపిడీ ఆచారాలు, పద్ధతులకు స్వస్తి చెప్పారు. ఇతరులను కించపరిచే, అణచివేసే హక్కును మత స్వేచ్ఛ ఇవ్వదు.

మన రాజకీయం, పార్టీలు, చట్టసభల వైఫల్యాలు ఏవైనా కావచ్చు, కానీ మన సమాజాన్ని ఆధునీకరించటం, మతం, ఆచారం పేరుతో అనాగరిక, చెడు పద్ధతులను నిర్మూలించటం పట్ల ప్రశంసనీయ ఏకాభిప్రాయాన్ని, సంసిద్ధతని ప్రదర్శించాయి. 1986 చట్టం ఒక ఉల్లంఘన తప్ప, సాధారణ పంథా కాదు. మతాచారాలకు అతీతంగా మానవ హక్కులను నిలపటంలో ఒక సమాజంగా, రాజ్య వ్యవస్థగా మనం చేసిన ప్రయత్నాలు విశేషమైనవి. మనం సగర్వంగా భావించాల్సినవి. ఇప్పుడు కూడా అమెరికా, అనేక ఇతర పాశ్చాత్య దేశాల్లో మహిళల పునరుత్పాదక హక్కులపై ప్రజల మధ్య తీవ్ర స్థాయి విభజన వచ్చింది. ఎప్పుడో 1971లోనే మన పార్లమెంటు మహిళలకు తమ శరీరాలు, గర్భంపై హక్కునిస్తూ వైద్యపరంగా గర్భస్రావ చట్టాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రగతిశీల చట్టాల్ని ఆమోదించటంలో, వాటిని స్వీకరించటంలో మన సమాజం గణనీయ పరిణతిని, విజ్ఞతను ప్రదర్శించింది.

అన్ని విశ్వాసాలనూ గౌరవిద్దాం, కానీ మన తోటి మనుషులను అణగదొక్కే, దోపిడీ చేసే, వారి హక్కుల్ని నిరాకరించే విపరీతమైన, కాలం చెల్లిన ఆచారాలు, పద్ధ తులను కొనసాగించటానికి దాన్నో వంకగా, కవచంలా ఉప యోగించటాన్ని మాత్రం మనం అనుమతించకూడదు. రాజకీయ సమీకరణ కోసం కులం, మతం, ప్రాంతం మీద మనం ఉన్నకొద్దీ ఎక్కువ ఆధారపడటం, సమానత్వం, అభివృద్ధి, మానవ గౌరవం, అవకాశం కోసం మన ప్రస్థానాన్ని అణగదొక్కుతుంది, దుర్భర విధానాలను అవలంబించేట్లు చేస్తోంది.మనం నింపాదిగా సమీక్షించు కోవటానికి, రాజకీయాల్ని పునర్నిర్వచించు కోవటానికి ఇది మంచి సమయం.

❖

# ప్రత్యేక సాయం ఎంతమేర సద్వినియోగం?

యూనియన్ బడ్జెట్ 2024-25లో ఆంధ్రప్రదేశ్‌కి విభజన సమయంలో ఇచ్చిన హామీల్ని ఆమోదించి కేటాయింపులు జరిపారు. ఇంకా కొన్ని రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పుడు ఏపీ ప్రభుత్వం సాధించుకున్నవి తక్కువేమీ కాదు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి ఏపీకున్న అయిదేళ్ల బకాయిలు రూ.16,000 కోట్లను కూడా క్రమంగా సాధించుకోవాలి. అదేవిధంగా ప్రత్యేకహోదా సాయం కోసం గట్టిగా అడుగుతున్న వెనుకబడిన రాష్ట్రం బీహార్‌కి కూడా బడ్జెట్‌లో గణనీయ కేటాయింపులు చేశారు. నిధులు తెచ్చుకోవటంలో విషయంలో సాధించిన విజయం వాటి సద్వినియోగం చేయటంలో కూడా సాధించగలరా? అన్నది ప్రశ్న.

ఇటీవల ముఖ్యమంత్రులతో నిర్వహించిన నీతి ఆయోగ్ పాలక మండలి సమా వేశంలో కూడా ప్రధానమంత్రి మోదీ ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'అంతర్జాతీయ పెట్టుబడుల్ని ఆకర్షిం చేందుకు రాష్ట్రాలు పోటీపడాలి, దానికి తగ్గ విధానాలు రూపొందించుకోవాలి. కేవలం ప్రోత్సా హకాలిస్తే సరిపోదు, శాంతి భద్రతలు, సుపరిపాలన, మౌలిక సదు పాయాలనేవి పెట్టుబడులను ఆకట్టు కోవటంలో కీలకం. వికసిత్ భారత్ రాష్ట్రాలు వికసిత్ భారత్‌ను తీర్చిదిద్దుతాయి. దాని కోసం గ్రామస్థాయి నుండి ప్రణాళికల్ని రూపొందించుకోవాలి' అని సూచించారు. కాబట్టి ప్రభుత్వం తాను చేయాల్సిన పనులు సవ్యంగా చేయటం, వాటికి ప్రమాణాల్ని పాటించటం, పౌర సేవలను అందించే సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవటం ఎంతో కీలకం.

ఉన్న నిధులను సద్వినియోగం చేయకపోతే ఏం జరుగుతుందో ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో చూశాం. రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్ మహానగరాన్ని కోల్పోవటం వల్ల ఆదాయ లోటుతో ప్రారంభమైంది. కొత్త రాష్ట్రంలో తొలి ప్రభుత్వం లోటు ఆదాయంలో కూడా మౌలిక వసతులు, అభివృద్ధి కోణంపై దృష్టి పెట్టినా, ప్రత్యేక హోదా ప్రయోజనాల్ని, ముఖ్యంగా పన్ను రాయితీల్ని వేగంగా సాధించటం, అదే విధంగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయటం మీద తొలినాళ్లలో దృష్టి పెట్టకపోవటం వల్ల రాష్ట్రం మూల్యం చెల్లించింది. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా అధ్వాన్నమై పోలవరం పూర్తిగా ఆగిపోగా, ప్రత్యేక హోదా చుట్టూ రాజకీయ డ్రామాలు సాగాయి. దీంతోపాటు సంక్షేమమే పరిపాలన అనే తరహా రాజకీయం వల్ల అప్పులు చేసి మరీ తాత్కాలిక వ్యక్తిగత పథకాలను అమలు చేశారు. సాంకేతికత సాయంతో ప్రతి ఒక్కరికీ నేరుగా సాయాన్ని, వారి వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ చేశారు, కానీ అది తప్ప తాను చేయాల్సిన పనుల్ని ప్రభుత్వం చేయలేదు. కానీ మొత్తంగా రాష్ట్రానికి రూ.9.74 లక్షల కోట్ల దాకా అప్పు తేలిందని చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. 2019 మార్చి 31 నాటికి అప్పు రూ.3,75,295 కోట్లు. గత ప్రభుత్వం పలు వివరాల్ని పారదర్శకంగా నమోదు చేయలేదు కాబట్టి ఈ అంకెలు కొంత అటుఇటు అవ్వొచ్చుగానీ, ఏపీ అప్పు ప్రమాదకరస్థాయిలో ఉందన్న విషయం నిర్వివాదాంశం. గత ప్రభుత్వంలో రాజ్యాంగ విరుద్ధంగా ఎస్క్రో అకౌంట్‌ను నడిపి, ఖజానాకు చేరాల్సిన ఆదాయాన్ని నేరుగా ప్రయివేటు ఖాతాల్లోకి అప్పుల జమ కింద పంపారు. తప్పనిసరిగా చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పలు ప్రభుత్వ ఆస్తుల్ని తాకట్టు పెట్టారు. మొత్తంగా రాష్ట్ర జీఎస్‌డీపీలో ఏపీ అప్పు 45-50 శాతం దాకా చేరుకుందని అంచనా. సంక్షేమం పేరుతో పంచుడే తప్ప అభివృద్ధి అక్కర్లేదు అనటం వల్ల, పెట్టుబడి పెడతామని వచ్చినవారికి ఇంటర్వ్యూలు కూడా ఇవ్వకపోవటం, వేధించటం వల్ల రాష్ట్రం మూల్యం చెల్లించింది. పెరుగుదల రేటు తగ్గిపోవటంతో రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్లు నష్టపోయిందని అంచనా. తలసరి అప్పు రూ.74,790 నుంచి రూ.1,44,336కు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,46,909 కోట్ల లోటులో ఉందని, తలసరి ఆదాయం పెరుగుదల వేగం 13.5 నుంచి 9.5 శాతానికి తగ్గిందని శ్వేతపత్రం తెలిపింది.




జాతీయ స్థాయిలోగానీ, రాష్ట్రాల్లోగానీ మన పన్నుల డబ్బు, మన వనరులే గదా. విదేశీ ప్రభుత్వం నుండి రావటం లేదు గదా! మనకు స్థానికంగా, రాష్ట్ర స్థాయిలో యూనియన్ నుండి వాటాగా రావాల్సిన డబ్బును తప్పనిసరిగా సాధించుకోవాలి. కానీ ఆ డబ్బులో సద్వినియోగం కానప్పుడు, ఎక్కువ భాగం అవినీతికి, అసంబద్ధ తాత్కాలిక ఉపశమనాలకి, రోజువారీ ఖర్చులకు చేస్తున్న అప్పులకి వడ్డీలు చెల్లించటానికి, ఆర్భాటాలకి నిర్లక్ష్యంగా ఖర్చు చేస్తుంటే మనకు ఏ రకమైన లాభం చేకూరినట్లు?

ప్రజల సంక్షేమం కోసం భారీగా ఖర్చు పెట్టినట్లు ప్రకటనలిచ్చుకున్నారుగానీ, ఆ పథకాల కోసం అయిదేళ్ల ఖర్చు చేసిన సుమారు రూ.2,71,000 కోట్లు పోగా, బడ్జెట్ లెక్కల ప్రకారం మిగిలిన 11,75,000 కోట్ల పైచిలుకు డబ్బు ఎలా ఖర్చయిందన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీలు పోగా, ప్రజలకు చేయాల్సిన పనుల్ని సక్రమంగా చేయలేదు. చివరకు రోడ్ల మరమ్మతు సైతం చేయలేదు. మరి ఆ డబ్బంతా ఎటుపోయింది?

పలు కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులను సద్వినియోగం

చేయలేదు. దారిమళ్లించారు. పట్టణాభివృద్ధి, జాతీయ ఆరోగ్య మిషన్ వంటి వాటికి యూనియన్ ప్రభుత్వ నిధుల్ని వినియోగించలేకపోయారు. దీంతో కొన్ని నిధుల్ని కోల్పోయారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల మాట్లాడుతూ, గ్రామీణ రహదారుల నిర్మాణానికి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ఇచ్చిన రుణాన్ని కూడా గత ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసింది. జల్‌జీవన్ మిషన్ పథకానికీ రాష్ట్ర వాటా నిధులు కేటాయించలేదు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులూ మళ్లించారు" అని తెలిపారు. 2018 ఆగస్టులో ప్రారంభమైన జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) కింద రాష్ట్రంలో రూ.27,248 కోట్ల అంచనాతో 77,917 పనుల నిర్వహణకు యూనియన్ ప్రభుత్వం ఆమోదించింది. అయితే తన వాటాగా ఇవ్వాల్సిన 50% నిధులను సమకూర్చాలన్న ఒప్పందానికి గత ప్రభుత్వం గండికొట్టింది. రాష్ట్ర వాటా నిధులు సక్రమంగా విడుదల చేయకపోవటం వల్ల పనుల నిర్వహణ అస్త వ్యస్తమైంది. పనులు చేసిన కాంట్రాక్టర్‌కి కూడా రూ.535.50 కోట్ల దాకా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. నిధుల్ని ఎలా మళ్లించారో ఆర్థిక శ్వేతపత్రంలో కూడా వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే బడ్జెట్ కేటాయింపుల్లో రూ.90వేల కోట్ల పై చిలుకు ఖర్చు చేయలేకపోయారని అంచనా. దీనివల్ల ప్రభుత్వం తన బాధ్యతల్లో ఘోరంగా విఫలమైంది. ప్రజ లకు సాధారణ సేవలు కూడా సక్రమంగా అందలేదు. విద్య, ఆరో గ్యం, స్థానిక ప్రభుత్వాలు ఇలా అన్ని రకాలుగా రాష్ట్రం నష్టపో యింది.

**అదే విధంగా బీహార్‌లో**

కారణాలు వేరైనా, జీఎస్‌డీపీలో అప్పుల శాతం ప్రమాదకర స్థాయిలో ఉన్న, ప్రత్యేక హోదా డిమాండ్ చేసిన బీహార్‌లో పాలనా యంత్రాంగం తీరు చూడండి, కొన్ని రోజుల వ్యవధిలోనే కొత్త, పాత, నిర్మాణంలో ఉన్నవి అని తేడా లేకుండా పలు వంతెనలు కూలాయి. వర్షాకాలం కాబట్టి వంతెనలు కూలాయని, ఆ రాష్ట్రానికి చెందిన యూనియన్ మంత్రి జితన్ రామ్ మాంఝీ సెలవిచ్చారు. డిజైన్లు, నిర్మాణ నాణ్యత, నిర్వహణ ఇలా పలు అంశాల్లో లోపాలు ఇందుకు కారణమని విశ్లేషణలు వస్తున్నా మంత్రి పట్టించుకోలేదు.

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరూ సుపరిపాలనకు గుర్తింపు పొందినవారేగానీ, ఇప్పటికీ ఆ రెండు రాష్ట్రాల్లో అందుకు అవసరమైన వ్యవస్థ వేళ్లూనుకోలేదు. బాబ్బాబూ, సకాలంలో, సవ్యంగా పనులు పూర్తి చేయండి, మీ కాళ్లు పట్టుకుంటా అని బీహార్ సీఎం ఐఏఎస్ అధికారులను బతిమిలాడుకోవటం మన ప్రభుత్వ యంత్రాంగంలో జరగాల్సిన ప్రక్షాళనకు అద్దం పడుతోంది. బీహార్ కంటే ఏపీ ఈ విషయంలో గణనీయంగా మెరుగ్గా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వ హయాంలో పరిస్థితి దిగజారింది. దీంతో పాలనా సామర్థ్యం మరింత దెబ్బతింది. ప్రజలు తీవ్ర దుష్పరిపాలనను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఈ నేపథ్యంలోనే, ప్రభుత్వాలు తమకున్న వనరులను, వేలకోట్ల ఆదాయాల్ని సమర్థంగా వినియోగిస్తే ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా సాయం అక్కర్లేదని కొందరు నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మాట కొంచెం అతిశయోక్తిగా అనిపించవచ్చుగానీ, అర్థవంతమైనది.

కాబట్టి ప్రత్యేక సాయాల్ని సాధించుకోవటానికి పరిమితం కాకుండా, ఆ డబ్బు సద్వినియోగమయ్యేలా ఆర్థిక క్రమశిక్షణ, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించే విధానాలు, ప్రభుత్వం తాను చేయాల్సిన పనుల్ని సక్రమంగా చేయటం, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచటం కోసం పటిష్ఠంగా కృషి చేయాలి. ఇందులో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి హామీ ఇస్తూనే గత ప్రభుత్వం కంటే ఎక్కువగా సంక్షేమ పథ కాల హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఆ పథకాలను హేతుబద్ధీకరించాలి. ప్రత్యేక హోదా సందర్భం మినహాయిస్తే, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు కూడా తక్షణం అవసరమైన మార్పులివి. ❖

## గ్రామ న్యాయాలయాల సంగతేంటి?

గ్రామ న్యాయాలయాలతో పౌరులకు వేగంగా న్యాయం లభించటమే కాకుండా, కోర్టులపైనా పెండింగ్ కేసుల భారం తగ్గుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తక్షణమే గ్రామాల్లో న్యాయాలయాల పరిస్థితిపై సమగ్ర నివేదికతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను, హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్‌ను ఆదేశించింది. గ్రామ న్యాయాలయాలపై 2008లోనే పార్లమెంటు చట్టం తెచ్చిందని, దాని ప్రకారం ఇప్పటికే ఆరువేల గ్రామాలలో కోర్టులు ఏర్పడాలని, కానీ కేవలం 264 గ్రామాల్లోనే ఇవి పనిచేస్తున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. లోక్‌సత్తా కృషితో వచ్చిన ఈ చట్టం ద్వారా పట్టణ, నగర ప్రాంతాల్లో స్థానిక కోర్టులను కూడా ఏర్పాటు చేయటం అవసరం.


**తెలంగాణలో ఏర్పాటుకి చర్యలు తీసుకోండి**

తెలంగాణలో గ్రామన్యాయాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కి లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో 55 గ్రామన్యాయాలయాల ఏర్పాటుకి 2019లో ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. వీటి ఏర్పాటు జరగలేదని, ఈ అంశం హైకోర్టు పరిశీలనలో ఉందని సమాచారహక్కు ద్వారా తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారం 5 ఏళ్లుగా హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల్లో ప్రజలిచ్చిన సంకేతం

సాయి పృథ్వి

ఎన్నికల్లో గెలుపు ఓటములను పక్కన పెడితే, ప్రతి ఎన్నికా భారతదేశ ప్రజల ఆశయాలను, వారి అవసరాలను అర్థం చేసుకోవటానికి ఒక గొప్ప అవకాశం. మన దేశంలో ఉన్న విస్తృత పేదరికం, వైవిధ్యం, స్వాతంత్ర్యానికి ముందు సొంత పరిపాలన అనుభవంలేని కారణంగా.. ఎన్నికలో గెలుపు లేదా ఓటమిని విప్లవంలా చూస్తున్నాం. అందువల్ల, ఎన్నికలను ఎన్నికలా చూడకుండా, ప్రజలు కేవలం ఒక పండుగలాగా, పార్టీలు "డూ ఆర్ డై"లాగా, మీడియా "టీ 20 క్రికెట్ మ్యాచ్" లాగా చూపిస్తున్నారు. 1977 ఎమర్జెన్సీ తర్వాతి ఎన్నికల్లో దేశంలోని పలుచోట్ల యువత, వివిధ వర్గాల ప్రజలు దేశంలోని పార్టీలు, శక్తులు ఏకమై ఏర్పడిన జనతా పార్టీని గెలిపిస్తూ ఇందిరాగాంధీని, కాంగ్రెస్‌ను తొలిసారిగా ఓడించారు. కానీ జనతా ప్రభుత్వం కేవలం 2 సంవత్సరాల్లోనే పడిపోయింది. ఒక ఎన్నిక విప్లవం కాదు, కేవలం ప్రభుత్వాలు మారతాయి. ఆటగాళ్లు మారతారు తప్ప, ఆటనియమాలు కాదు అనటానికి




గొప్ప ఉదాహరణ మన ఎన్నికలు. కానీ ప్రతి ఎన్నికా భారతదేశ ప్రజల గురించి, వారి ఆశలు, ఆశయాల గురించి తెలుసుకోవటానికి మంచి అవకాశం. దేశంలో, ఉత్తరం, దక్షిణం అంటూ ఎన్ని తేడాలున్నా, దేశంలో ఎన్ని విభిన్న భాషలున్నా, సంస్కృతులు వేరైనా, దేశంలో పనికిరాని విద్య, నిరక్షరాస్యత, పేదరికం ఉన్నా కూడా.. ప్రజలు వారి సొంత అనుభవాల నుంచి ఓటు వేస్తున్నారు. ఎన్నిక తర్వాత ఎన్నికలో ప్రాంతాలు వేరైనా, అనుభవాలు వేరుగా ఉన్నా, ప్రజల ఆకాంక్షలు ఒక్కటే– తమ జీవితాల్లో మార్పు కావాలి, గతం కంటే మెరుగవ్వాలి అని.

నవంబర్‌లో, ఆ తర్వాత మేలో వచ్చిన తెలంగాణ ఫలితాలను చూస్తే, రాష్ట్ర ప్రజలు ఒకే ఎన్నికలో రెండు భిన్న ఫలితాలను ఇచ్చారు. ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం చాలా సమర్థంగా ఉచితాలు ఇచ్చింది. మరోవైపు హైదరాబాద్‌ను ఇంతకుముందు ప్రభుత్వాల కంటే వేగంగా సమర్థంగా అభివృద్ధి చేసింది. అయితే ఒకసారి ఎన్నికల ఫలితాలను చూస్తే హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 24 అసెంబ్లీ స్థానాల్లో 16 చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించింది. కానీ మిగతా తెలంగాణ వ్యాప్తంగా ఘోరపరాజయాన్ని చూసింది. ఈ ఓటమికి ఎన్నో కారణాలు ఉండగా, ఒక ముఖ్యకారణం మాత్రం – బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవితాల్లో అంతగా కనిపించకపోవటం. హైదరాబాద్‌లో ప్రజల కనుల ముందు, వారి రోజువారీ జీవితాల్లో ఆ ఫలాలు కనిపించటం బీఆర్ఎస్ గెలుపుకి ముఖ్య కారణం.

ఇంకోవైపు మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఊహించినంత రాణించలేకపోయింది. దీనికి ముఖ్యకారణం ప్రజల ఆకాంక్షల్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందుకోకపోవటం. అభివృద్ధి మీద కాక 6 గ్యారంటీల మీద ఎక్కువ దృష్టి పెట్టటం వారి వైఫల్యానికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఇటీవల కూడా ఎన్నికల హామీలో భాగంగా రుణమాఫీ ఇస్తున్న సందర్భంలో రూపాయి రూపాయి కూడబెట్టి, రైతులకు రుణమాఫీ చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం చెప్పింది. కానీ ఒకసారి గతంలోకి చూస్తే, మొదటిసారి రుణమాఫీ చేసిన వీపీ సింగ్ ప్రభుత్వం పడిపోయింది. ఆ తర్వాత రుణమాఫీ చేసిన మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా 2014 ఎన్నికల్లో ఓడిపోయింది. తెలుగు రాష్ట్రాల్లో చూస్తే, 2014 ఎన్నికల్లో రుణమాఫీ చేసిన టీడీపీ ప్రభుత్వం తర్వాతి ఎన్నికల్లో ఘోరవైఫల్యం చెందింది. తెలంగాణలో గత తెరాస ప్రభుత్వం రుణమాఫీ చేసినా మొన్న జరిగిన ఎన్నికలో ఓడిపోయింది.

ప్రజలు ఆరోజు వారున్న సందర్భాన్ని బట్టి ఓటు వేసినా, దీర్ఘకాలంలో వారి సొంత అనుభవంతో ఓటు వేస్తారు. ఒక అసంబద్ధ రాజకీయం పరిధిలో వారు తెలివిగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు 6 నెలల ముందు జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను చూస్తే, ఆ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఘోరపరాజయం పొందింది. దీనికి ముఖ్య కారణం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర ప్రజల్లో ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రాన్ని, ప్రభుత్వ నిధులను అవసరానికి మించిన ఉచితాల మీద ఖర్చు పెట్టటం వల్ల అవసరం అయిన రంగంలో ఖర్చు పెట్టటానికి డబ్బులులేని పరిస్థితి. జాతీయస్థాయి ఎన్నిక కాబట్టి, మోదీ ప్రభావం ఉన్నా కూడా, ఆ అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో కనిపించింది.

మరోవైపు, మొన్న వచ్చిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూస్తే, రాష్ట్రంలో ఒక ప్రభుత్వం మితిమీరి ఉచితాలు ఇచ్చి, పెట్టుబడులకు అభివృద్ధికి అడ్డుకట్ట వేసి పరిపాలనలో తుగ్లక్‌లాగా ప్రవర్తిస్తే ఊరుకోం అని ప్రజలు స్పష్టమైన సంకేతం ఇచ్చారు. ఉచితాల వల్ల ఈరోజు సంతృప్తి కలిగినా, దీర్ఘకాలికంగా తమ జీవితాల్లో ఎలాంటి మార్పూ కనిపించకపోవటం వారిలో అసంతృప్తి కలుగుతోంది. అవి కేవలం వన్‌టైమ్ ఫార్ములాలా పనిచేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు తాత్కాలిక సాయం అవసరం, కానీ కేవలం ఉచితాల కోసం ప్రభుత్వం మీద ఆధారపడటం వారి సమస్యలకు పరిష్కారం కాదు. ఆదాయానికి తగ్గ సంక్షేమంతోపాటు ప్రభుత్వం తాను చేయాల్సిన పనులు సవ్యంగా చేసి అభివృద్ధికి బాటలు వేయాలి, ప్రజలకు వారి జీవితం మీద వారికి ఆత్మవిశాసాన్ని కలిగిం చాలి, వారి ఆదాయాల్ని పెంచాలి.

మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్ని కలను చూస్తే దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని మూడోసారి గెలిపిస్తూనే వారి అసంతృప్తిని వ్యక్తపరిచారు. దీనికి కారణం మనం పైన ఇతర ప్రాంతీయ పార్టీల గురించి మాట్లాడుకున్నట్లు ఒక ప్రాంతం మీద దృష్టి పెట్టి ఇతర ప్రాంతాలను పట్టించుకోకపోవటం కాదు. ఎన్నికల తర్వాత డబ్బులన్నీ ఉచితాల మీద ఖర్చు పెట్టం కాదు. అదేవిధంగా, ఉచితాలనేవే లేకుండా అభివృద్ధికి అడ్డుకట్ట వేయటం కూడా కారణం కాదు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 5 సంవత్సరాల్లో ఉత్తర భారతదేశంలో అవినీతిలేకుండా ఉచితాలు ఇచ్చారు, అభివృద్ధితో సమతుల్యం పాటిస్తూ ఇచ్చారు. ఇది బీజేపీ రెండోసారి గెలవటానికి ముఖ్య కారణం అయింది.

ఈ ఎన్నికలకు వచ్చినప్పుడు, ఎన్నికల ముందు ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌ను చూస్తే మనకు అర్థం అవుతుంది. ఎన్నికల సంవత్సరంలో ఎలాంటి లోపాలకు లొంగకుండా వారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తగా ఎటువంటి ఉచితాలను ప్రకటించకుండా, సంక్షేమంతో సమతుల్యతతో ప్రగతిని ప్రోత్సహించే విధంగా ఉంది. ఆ తర్వాత ఎన్నికల సమయంలో వారి మేనిఫెస్టో కూడా ప్రగతి సంకేతాన్నిచ్చింది. గత 5 సంవత్సరాల్లో ఆర్థిక విషయాల్లో నిలకడగా ఆర్థిక వ్యవస్థను నడిపింది. కానీ ప్రజల్లో ఈసారి అసంతృప్తి ఎందుకు అంటే, ప్రగతి అన్నది అంకెల్లో మాత్రమే కాదు, తమ జీవితాల్లో కనిపించాలని చెప్పటం. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఈ సంకేతాన్నిస్తున్నాయి.

ఇప్పుడున్న ఆర్థిక ప్రగతి నమూనా వల్ల సంపన్నులు, నైపుణ్యం ఉన్నవారు, పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారు లాభపడుతున్న స్థాయిలో మిగిలిన అత్యధిక సంఖ్యాక ప్రజలు ప్రయోజనం పొందలేకపోతున్నారు. వారందరినీ ప్రగతిలో భాగస్వాముల్ని చేసే ఒక సమగ్ర అభివృద్ధి వైపు అడుగులు వేయటం ఎంతో అవసరం.

వీటితోపాటు, ఎన్నికల సమయంలో దేశం లోపల, ఇతర దేశాల నుంచి భారత్‌పై వచ్చిన విమర్శలు ఏమిటంటే భారతదేశ ప్రజలు వారి మత విశ్వాసాలను బట్టి ఓటు వేస్తారని, ఓట్ల కోసం బీజేపీ మతాన్ని వాడి ప్రజల్లో విద్వేషాలను పెంచుతుందని, కానీ ఒకసారి ఎన్నికల ఫలితాలను చూస్తే అయోధ్య ఉన్న ఫైజాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో, సీతాపూర్‌లో సైతం బీజేపీ పరాజయాన్ని చూసింది. గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయింది. భారతదేశంలో భిన్న మతాలు ఉండి, మాట్లాడే భాష వేరు అయినా వేల సంవత్సరాల నుండి సహజీవనం చేయటం వల్ల ప్రజాజీవనంలో ఒక కనపడని గీత హద్దుగా ఏర్పడింది. ఆ గీతను పార్టీలుగానీ, ప్రజలుగానీ, ప్రభుత్వాలుగానీ దాటలేదు. ఆ గీత దాటే ప్రయత్నం చేసినప్పుడు ఓటుతో ఈ దేశ ప్రజలు స్పందించారు.

ఎన్నికల ముందు కొన్ని ప్రపంచ దేశాలు, మన దేశంలో ప్రధాన ప్రతిపక్షం, కొన్ని ఇతర రాజకీయ పార్టీలు మన ఎన్నికల విధానంపై ఆరోపణలు వేశాయి. కానీ ఒకసారి ఎన్నికల ఫలితాలు ఆ అనుమానాలను తుడిచేశాయి. ఇప్పుడే కాదు, గతంలో చంద్రబాబు, జయలలిత ఓడిపోయినప్పుడు కూడా ఈవీఎంలపై, ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేశారు. కానీ ఆ తర్వాతి ఎన్నికల్లోనే బ్రహ్మాండమైన మెజారిటీతో ఆ ఈవీఎంలతోనే గెలిచారు. మన దేశంలో ఎక్కడ ఎన్ని రకాల లోపాలున్నా, ఎన్నికల సమయానికి అధికార యంత్రాంగమంతా ఒక్కటిగా పనిచేస్తుంది.

మొన్న మెక్సికోలో ఎన్నికలు జరిగిన సమయంలో 37 మంది అభ్యర్థులను చంపారు. మెక్సికో భారతదేశం కంటే 4 రెట్లు ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న దేశం. అదే మన దేశంలో ఎన్నికల సమయంలో ఎక్కడా పెద్ద హింసాత్మక ఘటన జరగలేదు. దీనికి కారణం మన దేశంలో ఎన్నికల ప్రక్రియ, నిర్వహణ, ఓటరు తీర్పును అందరూ గౌరవించటం ఒక బలమైన సంప్రదాయంగా వేళ్లూనుకుంది. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయినా, మొదటి ఎన్నికల నుండి మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల వరకు ప్రతి ఎన్నికల్లో ప్రజలు వారి తీర్పును స్వేచ్ఛగా చెబుతున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీని గెలిపించిన ఆ ప్రజలే, దేశంలో నియంతలాగా ప్రవర్తిస్తే ఓడించారు. నోట్ల రద్దు తెచ్చి ప్రజలను కష్టపెట్టినా ఆ నోట్ల రద్దు వెనుక ఉన్న ఉద్దేశంలో లోపం లేదు అని అదే పార్టీని అప్పుడు అంతకుముందు కంటే ఘనమైన మెజారిటీతో గెలిపించారు. మొన్న జరిగిన ఎన్నికల్లో కూడా అదే పార్టీని గెలిపిస్తూ, అదే సమయంలో వారి అసంతృప్తిని వ్యక్తపరిచారు. బహుశా ప్రజలు అన్ని సందర్భాల్లో వారి భవిష్యత్తు కోసం ఓటు వేయకపోయినా, కొన్నిసార్లు అవసరానికి మించిన ఉచితాల కోసం ఓటు వేసిన అనుభవంతో వచ్చిన ఆలోచనతో ఓటు వేస్తున్నారు. ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు, పార్టీలకు, మేధావులకు ఎన్నికల ద్వారా సంకేతం ఇస్తూనే ఉన్నారు. ❐

# సరైన విధానాలతో ఏపీ 9-10% అభివృద్ధి సాధించగలదు, అమరావతి గ్రీన్‌ఫీల్డ్ సిటీ, 100 చిన్న పట్టణాలూ అవసరం

**ఆంధ్రప్రదేశ్‌ను సమ్మిళిత అభివృద్ధి పథంలోకి తీసుకు రావటానికి అవసరమైన తప్పనిసరి చర్యలపై ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా.జయ ప్రకాష్ నారాయణ్ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు:**

**ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం పరిస్థితి ఎలా ఉంది?**

**జేపీ:** సామాజికార్థిక నేపథ్యం, కులం, తెగ, మతం వంటి వాటితో సంబంధం లేకుండా ఏ కుటుంబం స్థితిగతులనైనా మార్చే శక్తి ఒక్క విద్యకు మాత్రమే ఉంది. కానీ పాసయ్యే విద్యార్థుల శాతం 90 నుంచి 96 వరకు ఉండగా, ఆ విద్యార్థుల మేధోసామర్థ్యం మాత్రం తరగతి స్థాయికి తగ్గట్లు లేదని జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే వెల్లడించింది. ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణలో ఏడాదికి ఒకో బిడ్డ మీద రూ.80,000 ఖర్చు పెడుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో ఆ మొత్తం బహుశా రూ.1,00,000 దాకా ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు గతంతో పోలిస్తే అనేక రెట్లు మెరుగుపరిచినా, ఉపాధ్యాయులకు ఇంకా అనేకరెట్లు జీతభత్యాలిస్తున్నా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మాత్రం అరకొరగా, అగమ్యంగా ఉంటున్నాయి. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నా ఏటా జరుగుతున్న టీచర్ల సెలక్షన్లు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచలేకపోతున్నాయి. ఇది చాలా ఆందోళనకర పరిస్థితి.

**ఏపీ ఆర్థికాభివృద్ధికి ఏ విధానాలు అవసరం?**

**జేపీ:** ప్రస్తుతం ఏపీకి, దేశానికి కూడా ఆర్థికాభివృద్ధి, ప్రగతి అత్యంత కీలకమైనవి. మౌలిక వసతుల పెంపు, ఆర్థిక క్రమశిక్షణ, ప్రగతి, పెట్టుబడులకు ప్రోత్సాహం, ఆదాయాల పెరుగుదలపై ప్రభుత్వం స్పష్టమైన ఎజెండాతో కృషి చేయాలి. బయటకుపోయే డబ్బు తగ్గి, లోపలికి ప్రవహించే డబ్బు పెరిగినప్పుడే ఏపీ ఆర్థికంగా తన సామర్థ్యాన్ని నిరూపించుకోగలుగుతుంది. ప్రజల ఓటు వెళ్లేది రాష్ట్రానికి, దేశానికి తప్ప రాజకీయ నాయకులకు కాదు. సరైన విధానాలుంటే ఆంధ్రప్రదేశ్ 9–10% వృద్ధిని సాధించగలదు.

చొరవ తీసుకుని కష్టపడగలిగే ప్రజలతో పాటు అద్భుత అవకాశాలున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1000 కిలోమీటర్ల



దాకా తీరప్రాంతముంది. బ్రిటిష్ పాలన ప్రారంభం నాటి నుండి సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. దీంతో సంపద సృష్టి జరిగింది. స్వతంత్ర పోరాటానికి ముందు, తరువాత కూడా ఒకటి రెండు తరాలపాటు అనేకమంది నాయకులు విద్యను ఒక ఉద్యమంలా తీసుకున్నారు. అరకొర వసతులున్నా, పూరిపాకల్లో బడుల్ని నడిపినా పిల్లలకు అద్భుతమైన చదువు అందించారు. సహజ అనుకూలతలున్న తీరప్రాంత రాష్ట్రంగా ఏపీ వేగంగా అభివృద్ధిని సాధించి ఉండాల్సింది. కానీ దురదృష్టవశాత్తూ ఫలితాలు ఆశాజనకంగా లేవు.

అభివృద్ధికి రెండు మూలస్తంభాలు అవసరం. వనరుల్ని ఎలా నిర్వహించాలి, ఉపయోగించుకోవాలి. దురదృష్టవశాత్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గడచిన కొన్నేళ్లలో తాత్కాలిక ప్రయోజనాల మీదే ఖర్చు పెట్టింది. ఎటువంటి మౌలిక వసతులనీ నిర్మించకుండా, పెట్టుబడులను, అభివృద్ధినీ ప్రోత్సహించకుండా, ఉపాధిని, నైపుణ్యాలను సృష్టించ కుండా ఆ తాత్కాలిక పథకాలకే ఖర్చులో ఎక్కువభాగం వెచ్చించారు. దీంతో దేశంలోనే అత్యధిక అప్పులున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీ తయారైంది. రాష్ట్ర అప్పు 45–50 శాతానికి చేరుకుంది. ఈ సంఖ్య జీఎస్‌డీపీలో 20 శాతం దాకా మాత్రమే ఉండాలి.

రెండోది, ప్రభుత్వం తాను చేయాల్సిన పనులను సవ్యంగా చేయటం. మౌలిక వసతులు, పెట్టుబడులను ప్రోత్సహిం చటం, ఆర్థికాభివృద్ధిని, ఆదాయాల్ని పెంచటం, తాత్కాలిక సంక్షేమానికి, దీర్ఘకాల అభివృద్ధి చర్యలకు మధ్య సమతూకం

పాటించటం కోసం పనిచేయాలి. ఈ కోణాలన్నిటిలో పటిష్ఠంగా వ్యవహరించగలిగితే, ప్రభుత్వం సంపదను సృష్టించనక్కర్లేదు; తపన, కొత్త ఆలోచనలున్న రాష్ట్ర యువతే సృష్టిస్తారు.

చట్టబద్ధపాలన, కొత్త ఆలోచనల్ని, స్వతంత్ర ధోరణుల్ని ప్రోత్సహించటం, చిన్న పట్టణాల అభివృద్ధి, విద్యలో నిజమైన ప్రమాణాలు, నాణ్యమైన ఆరోగ్యం ఈ చట్రంపై ఆధారపడిన బలమైన పునాదితో ఈ రెండు మూలస్తంభాలనూ రాష్ట్రంలో నిర్మించగలిగితే, కష్టపడేతత్వం, అంకితభావం గల సమాజం, అన్ని వర్గాల ప్రజలూ తమ గురించి తాము చూసుకోగలరు.

విద్య అసలు లక్ష్యం – పుట్టుక పరిస్థితులు, కులం, మతం, తెగ, ఆర్థిక స్థాయి, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డా తమ సామర్థ్యాన్ని, సృజనాత్మక ఆలోచనాతీరును వెలికితీసుకోవటం, తమ నైపుణ్యాలను, ఉత్పాదకతను పెంచుకోవటం, సమాజంలో సంపద సృష్టి ద్వారా తమ సంపాదన సామర్థ్యాన్ని పెంపొందించుకోవటం. ఏ ప్రభుత్వమైనా విద్యను కేవలం ఆ రంగంలో తాను ఖర్చు చేసే నిధులను బట్టి అంచనా వేయటం ఏ రకంగా చూసినా అసంబద్ధం, నేర సమాన నిర్లక్ష్యం.

విద్యార్థులు నేర్చుకున్న పరిజ్ఞానాన్ని తెలుసుకునేలా ఫలితాల్ని విశ్లేషించాలి. బేరీజుకు కొలబద్ద, పిల్లల మస్తిష్కాల్లో, సామర్థ్యాలు, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం ఎంత వికసించాయన్నది. కానీ ఏపీలో, దేశంలో కూడా సాక్ష్యా ధారాలన్నీ అందుకు విరుద్ధంగా నిరూపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 80 శాతం మంది విద్యార్థుల్లో వయసుకు తగ్గ మేధో సామర్థ్యాలు కొరవడ్డాయని గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఆ బిడ్డ ఎదుగుతున్నా తన ఉపాధికి, సంరక్షణకి ఎప్పటికీ ప్రభుత్వం మీదే ఆధారపడి ఉంటే మొత్తం విద్యావ్యవస్థ ఘోరవైఫల్యమవుతుంది.

**అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయాలని, 100 చిన్న పట్టణాలు అవసరమని మీరు చెబుతున్నారు. కొంచెం వివరించండి.**

ఈవేళ్టితరంలో, అంతర్జాతీయ పెట్టుబడులను, సాంకేతికతను, నైపుణ్యాన్ని ఆకర్షించాలంటే మనకు అత్యాధునిక మౌలిక వసతులు అవసరం. పెట్టుబడులు, ఉత్పాదకత, ఉపాధి సృష్టి, అభివృద్ధి కోణంలో మనం గ్రీన్‌ఫీల్డ్ సిటీ గురించి మాట్లాడుకుంటే, మన ఆలోచనలు హైదరాబాద్ వైపు మళ్లుతాయి. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి వంటి ప్రాంతాలు శరవేగంగా పెరిగాయి, పెరుగుతున్నాయి. ఎంసీహెచ్ ప్రధాన కేంద్రమని చెప్పుకునే ప్రాంతానికి పరిమితం కాకుండా, అభివృద్ధి, పెట్టుబడులకు ప్రపంచ



ఆకర్షణీయ కేంద్రాలయ్యాయి. 1995లో సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌లకు స్థలాల్ని మొట్టమొదట కేటాయించిన వారిలో నేను మొదటివాడిని. హైటెక్ సిటీ అభివృద్ధికి ఎల్ అండ్ టీతో అవగాహనా ఒప్పందంపై సంతకం చేశాను. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నగరంలో ప్రతిదీ ఎంతో తపనతో నిర్మించారు. హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబునాయుడు గారిది కీలక పాత్ర అని ఆయన రాజకీయ ప్రత్యర్థులు సైతం ఒప్పుకుంటారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు, ఉదాహరణకి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాలు, రాజకీయంగా ఎన్ని విభేదాలున్నా, హైదరాబాద్ అభివృద్ధి కోసం కృషి చేసి అగ్రస్థాయి సాఫ్ట్‌వేర్ కేంద్రంగా రూపుదిద్దారు.

కొత్త ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధికి గ్రీన్‌ఫీల్డ్ సిటీ కీలకం. చుట్టుపక్కల భూమి, ఖాళీ అందుబాటులో ఉండటం హైదరాబాద్‌కి సానుకూలంగా ఉపయోగపడింది. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతికి కూడా అదే వర్తిస్తుంది. వేల ఎకరాల భూసమీకరణకు రైతులందరూ కలిసి వచ్చారు. ఏపీలో తొలిసారిగా ఎన్నికైనప్పుడు చంద్రబాబు ప్రభుత్వం విజ్ఞతతో వ్యవహరించి ఒక జీవ నది ఒడ్డున పెద్దఎత్తున భూముల్ని పూలింగ్ ద్వారా సమీకరించింది. తమ ఉజ్వల భవిష్యత్తు కోసం ఎంటర్‌ప్రెన్యూర్ చొరవ ఉంటే, కష్టపడి పనిచేయటానికి రిస్కులు తీసుకోవటానికి సిద్ధంగా ఉన్న ప్రజలు ఎలాగూ ఉన్నారు. భారీ పెట్టుబడులకు అన్ని రకాలుగా సరైన పరిస్థితులు నెలకొన్నాయి. కానీ ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఒక వెల కట్టలేని అవకాశాన్ని జారవిడిచింది. ప్రభుత్వాలు, కొత్తవైనా, పాతవైనా కొనసాగింపు తప్ప ప్రతిదీ తిరగదోడటం చేయకూడదు.

మహానగరాల అభివృద్ధి. ఆర్థిక వ్యవస్థలో క్లస్టర్ ఎఫెక్ట్ అవసరం. కానీ అన్ని వ్యాపారాలు, నైపుణ్యాలు మనుగడకు, అభివృద్ధి చెందటానికి మహానగరాల్లోనే ఉండనక్కర్లేదు. మహానగరాలను దాటి ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి

చేయకపోవటం వల్ల, తక్కువ నైపుణ్యాలున్న, ఏదైనా సమస్య వస్తే ఆదుకునేవారులేని నిరుపేదలు ఎక్కడో దూరంగా ఉన్న మహానగరాలకు వలస పోవాల్సి వస్తోంది. పర్యవసానంగా, నగర జీవన ప్రమాణాలకు వారి ఆదాయం సరిపోక ఎంతో బాధ, ఆక్రోశాలకు గురవుతున్నారు.

ప్రభుత్వం గనక గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధికి నిధులు కేటాయించి, మౌలిక వసతులు, పట్టణ ప్రణాళిక, ఉపాధి అవకాశాల సృష్టికి చర్యలు తీసుకుంటే, పెద్ద నగరాల్లో బతుకుపోరాటం చేయాల్సిన అవసరం లేకుండా అదే ఆదాయంతో అత్యధిక గ్రామీణ ప్రజలు సౌకర్యవంతంగా, హాయిగా బతకగలుగుతారు. చిన్న పట్టణాలను, క్లస్టర్ ఎఫెక్ట్ ఉన్న పెద్ద నగరాలను అభివృద్ధి చేయటానికి ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేయకుంటే. అభివృద్ధి ఫలాలు ఒక ప్రాంతానికే పరిమితమవుతాయి. ఆర్థిక వ్యవస్థకు, తద్వారా రాష్ట్రానికి, దేశానికి ఇది తీవ్ర నష్టం కలిగిస్తుంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌కి అమరావతి గ్రీన్‌ఫీల్డ్ సిటీ కావాలి, వంద వేర్వేరు చిన్న పట్టణాలూ కావాలి.

**విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మీ వైఖరి ఏమిటి?**

**జేపీ:** నా అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వ, ప్రయివేటు అనేవి పెద్ద మిథ్యలు. ఒక ప్రభుత్వ కంపెనీ అంటే, సామాన్యుడు కష్టపడి సంపాదించిన పన్నుల డబ్బును ప్రభుత్వ సంస్థలో పెట్టుబడి పెట్టటం. విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, మౌలిక వసతులకు కేటాయించాల్సిన మన నిధుల నుంచి మళ్లించినది ఈ డబ్బంతా. గత 70 ఏళ్లుగా, ప్రభుత్వాలు తాము విధిగా ఏం చేయాలో ఆ పనులు చేయటంలో విఫలమయ్యాయి. అంటే, ప్రజలు తమ ఉమ్మడి అవసరాలు తీర్చటానికి ఉమ్మడిగా ఎన్నుకున్న వ్యవస్థే ప్రభుత్వం అని మర్చిపోయారు. ఇక్కడ ప్రస్తావించిన అంశాలన్నీ ప్రభుత్వాలే చేయాల్సుంది. ఇటువంటి కీలక పాత్రలకు మార్కెట్ పనిచేయదు. తమ కీలక పాత్రలు, బాధ్యతలపై కేంద్రీకరించకుండా, మార్కెట్, ప్రజలు ఎంతో సమర్థంగా చేయగలిగే విభాగాల్లోకి ప్రభుత్వాలు ప్రవేశించాయి, జోక్యం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మనం ప్రభుత్వ, ప్రయివేటు రంగాలను చూడాలి. కాలక్రమంలో, ఎయిరిండియా వంటి ప్రతి ప్రభుత్వ రంగ సంస్థా దిగజారాయి. సాధారణ ప్రజల నెత్తిన భారంగా మారాయి. ప్రయివేటు రంగమంటే వేరే ఏమీ లేదు, పెట్టుబడి పెట్టే, రిస్క్ తీసుకునే మనమే అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి!

**కాబట్టి పౌరులంగా మనం చూడవలసింది రెండు విషయాలు:**

1. వస్తువులు, సేవలు మనకి మంచి ప్రమాణాలతో, సరసమైన ధరకి అందుతున్నాయా, లేదా? ఉత్పత్తి దేశంలో ఎక్కడ జరిగింది, ఎవరు చేశారో మనకి అనవసరం.

2. ప్రభుత్వం మన పన్నుల డబ్బుతో, మన పేరుతో తెచ్చిన అప్పులతో మనందరికి అవసరమయిన, మరెవ్వరూ చేపట్టలేని, ఉమ్మడి వసతుల్ని, సేవల్ని, సమర్థంగా అందిస్తోందా? లేదా? ఉదా॥ మౌలిక సదుపాయాలు, రవాణా, మంచినీరు, మురుగునీటి పారుదల, వరద నివా రణ, మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన వగైరా.

**విడిపోయాక ఆంధ్రప్రదేశ్ ఇప్పటిదాకా అనేక మార్పుల్ని చూసింది. రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?**

**జేపీ:** ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించటం, ప్రభుత్వ ధనాన్ని విజ్ఞతతో, సురక్షితంగా, తెలివిగా వినియోగించటంపై ఆధారపడి ఉంటుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన తాత్కాలిక సంక్షేమ పథకాలను మితిమీరిన ఆర్థిక భారం లేకుండా మరింత ఉత్పాదకంగా, అభివృద్ధికి దోహదం చేసేలా అమలు చేసేలా హేతుబద్ధీకరించాలి. నిధుల్ని మౌలిక వసతుల్లో పెట్టుబడి పెట్టటం, ప్రయివేటు పెట్టు బడులను ప్రోత్సహించటం, ప్రజల్ని భాగస్వాముల్ని చేయటం – ఇవి చేసినప్పుడు మనం ఎన్ని సమస్యలను ఎదు ర్కొన్నా కచ్చితంగా అభివృద్ధి, మెరుగైన భవిష్యత్తు ఉంటాయి. అదే విధంగా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాము లయ్యేలా, ఆ ఫలాలు ప్రతి సామాన్యుడికీ చేరేలా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలి; నాణ్యమైన విద్య, ఆరోగ్యం, అధికార, అభివృద్ధి వికేంద్రీకరణ, చట్టబద్ధపాలన అందిం చాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి, సామాజిక స్థిరత్వం, ఆర్థిక క్రమశిక్షణ మీద దృష్టి సారిస్తుందని నాకు విశ్వాసం ఉంది. సవాళ్లు తీవ్రంగా ఉన్నా ఏటా 9–10% ఆర్థిక వృద్ధితో పెరిగే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కి ఉంది. ❒

## ఏపీకి బలాన్నిచ్చిన యూనియన్ బడ్జెట్

అభివృద్ధికి దూరమై ప్రజల్లో తీవ్ర అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌కి యూనియన్ బడ్జెట్ ఊపిరి పోసిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో అన్నారు. ఏపీలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేకహోదా సాయం సహా పలు హామీల్ని విభజన చట్టంలో చేర్చటంలో జేపీ కీలక పాత్ర పోషించారని, లోక్‌సత్తా కృషి వల్లే ఇటీవల రాష్ట్రానికి రూ.10,461 కోట్లు వచ్చాయన్నారు. ఏపీకి చట్టబద్ధంగా రావాల్సిన నిధుల్ని సాధించిన చంద్రబాబు ప్రభుత్వానికి అభినందనలన్నారు. వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం గావించాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజు, పి.ఎల్.ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.




# నారాయణ గురు కృషిని ఈవేళ్టి సమాజానికి అన్వయించాలి

అంటరానితనం నిర్మూలన, విద్య కోసం పోరాటం చేసి తన జీవితకాలంలోనే ఫలితాల్ని చూసిన సంస్కర్త నారాయణ గురు అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

గురు ధర్మప్రచారణ సభ (జీడీపీఎస్), శ్రీ నారాయణ గురు ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో 'సర్వమత సమ్మేళనం, వైక్కోమ్ సత్యాగ్రహం' శతాబ్ది ఉత్సవాలను హైదరాబాద్‌లో నిర్వహించారు.

తాను ఏ సాంప్రదాయంలో పుట్టారో, ఆ సాంప్రదాయాన్ని, మతాన్ని త్యజించకుండానే అందులోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని, కులవ్యవస్థని నారాయణ గురు త్యజించారని జేపీ అన్నారు. ఆచరణసాధ్యమైన ఒక తాత్విక చింతనను ప్రవేశపెట్టి, ఆ చింతనకు, మనిషి జీవితానికి మధ్య సంబంధాన్ని స్పష్టంగా అర్థమయ్యేట్లు చేసి మనుషుల ప్రవర్తనను మార్చగలిగారన్నారు. అందుకే నారాయణ గురును భారతీయ సమాజం నిరంతరం గుర్తుంచుకోవాలి, అనుసరించాలన్నారు. నారాయణ గురు కృషిని ఈవేళ్టి సమాజానికి మనం అన్వయించాలన్నారు.

'ఒక్కసారి రాజకీయాన్ని చూడండి. నేను మిగతా లోతుల్లోకి వెళ్లటంలా. ఎన్నికల్లో ప్రజలు ఏం చెబుతున్నారు అన్ని పార్టీలవాళ్లకి? వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమం అవసరం, కానీ అది చాలదు అని చెబుతున్నారు. అభివృద్ధి అవసరం అని చెబుతున్నారు. కాబట్టి సమ్మిళిత అభివృద్ధి కావాలి. ఈ ప్రజలు చెబుతున్నదాన్ని మనం అర్థం చేసుకోకపోతే, ఒక నారాయణ గురు బోధనల్ని ఈవేళ్టి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దకపోతే ఈ కార్యక్రమాలన్నీ పోసుకోలు కబుర్లు అవుతాయి. ఏ రకంగా ఎదిగే అవకాశాల్ని ప్రతి బిడ్డకూ కల్పించాలి, ఏ విధంగా నివారించదగ్గ అనారోగ్యాల్ని తొలగించి ఉత్పాదకత పెంచేలా అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం అందించాలి, ఏ రకంగా గ్రామాల నుంచి పొట్ట చేత పట్టుకుని వలసలు పోవాల్సిన అవసరం లేకుండా ఆ చుట్టుపక్కల చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి, ఉపాధి అవకాశాలను, సామాజిక భద్రతను అందించాలి అని మనసు పెట్టి ఆలోచించి ఆ ప్రయత్నం చేసినప్పుడే ఈ దేశంలో కులం, మతం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా ప్రతి బిడ్డకీ ఎదిగే అవకాశాలు నూటికి నూరుపాళ్లూ ఇవ్వగలం. అప్పుడు మాత్రమే ఈ సాంప్రదాయంలోని గొప్పతనాన్ని వెలికితీయగలం, దీనిలో ఉన్న దుర్మార్గాన్ని అణచివేయగలం, అప్పుడు మాత్రమే నిజమైన దీర్ఘకాల ప్రగతి




ఉంటుంది, అప్పుడు మాత్రమే ఈ సమాజంలో శాంతి ఉంటుంది, అప్పుడు మాత్రమే రాజకీయ స్థిరత్వం, పూర్తిస్థాయి స్వేచ్ఛ సాధ్యం. వీటిని సాధించటానికి ఈవేళ మనకి అద్భుతమైన అవకాశం, మానవ చరిత్రలో ఎప్పుడూ లేని అవకాశం ఉంది. మౌలికమైన మార్పుకి ఒక తరం కాలం లోపల నాంది పలికే అవకాశం ఉంది' అని జేపీ అన్నారు.

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య, ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కొలకలూరి జ్యోతి, తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, జీడీపీఎస్ ప్రతినిధులు డాక్టర్ ఎ.సాయిబాబా గౌడ్, ప్రొ.జి.సత్యనారాయణ, పల్లెల ఉపేందర్ గౌడ్, వి.కె మహమ్మద్, చెన్నయ్య, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ నారాయణగురు స్టడీస్ అండ్ పిలిగ్రిమేజ్ (కేరళ) డైరెక్టర్ ప్రొ.కె.శిశుబాలన్, శ్రీ నారాయణ గురు ధర్మసంఘం ట్రస్ట్ కార్యదర్శి శ్రీమద్ అసంగనందగిరి స్వామి, మహాబోధి బుద్ధవిహార్ (సికింద్రాబాద్) వెనెరబుల్, తెలుగు క్యాథలిక్ బిషప్స్ కౌన్సిల్ డిప్యూటీ సెక్రటరీ ఫాదర్ రాజు అలెక్స్, మనస్తత్వవేత్త ఆర్శియా అహ్మద్ ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th August, 2024 Posting Date 15 &16th of every month



# TOWNHALL WITH JP



## ఎన్నికలయ్యాయి - కొత్త ప్రభుత్వాల నుండి ఏం సాధించుకోవాలి?

### Roadmap for the next 25 years

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, లోక్‌సభ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి, స్టూడెంట్ ట్రైబ్ ఫౌండర్, సీఈవో శ్రీచరణ్ (హోస్ట్), విద్యార్థులు, యువత పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని

https://www.youtube.com/@JPLoksattaOfficial లో చూడండి.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**